www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 సంచిక : 05 Vol No | విజయవాడ, శనివారం 05 జనవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs

నెలాఖరులోగా మరో నోటిఫికేషన్
- 1,521 పోస్టులు భర్తీ
- ఎపిపిఎస్‌సి చైర్మన్ ఉదయభాస్కర్
- కటాఫ్ మార్కులు అందరికీ ఒక్కటే

2



ఆసీస్‌కు పంత్ పంచ్
యువ వికెట్‌కీపర్ రిషబ్ పంత్ అజేయంగా 159 పరుగులతో రాణించి విదేశీ పర్యటనలో టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన ధోనీ రికార్డును బ్రేక్ చేశాడు. ఆల్‌రౌండర్ జడేజాతో కలిసి ఏడో వికెట్‌కు 204 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నిర్మించాడు. టీమిండియా నయావాల్ పుజారా(193) తృటిలో డబుల్ సెంచరీని మిస్ చేసుకున్నా భారతజట్టు ఏడు వికెట్ల నష్టానికి 622 పరుగుల భారీస్కోర్ చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది.

త్వరలో జెఎసి
- ఆర్‌టిసి కార్మిక సంఘాల సమావేశంలో నిర్ణయం
- ముమ్మరమవుతున్న సమ్మె సన్నాహాలు



ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఆర్టీసిలో సమ్మె సన్నాహాలు ముమ్మర మయ్యాయి. వేతన సవరణతో పాటు ఆర్టీసిని ఆదుకోవాలన్న డిమాండ్ల సాధన కోసం త్వరలో జెఎసి ఏర్పాటు కానుంది. విజయవాడలోని ఇయు రాష్ట్ర కార్యాలయంలో అన్ని కార్మిక సంఘాలతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి ఎన్ఎంయు మినహా మిగిలిన అన్ని సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ నెల 18లోపు జెఎసిని ఏర్పాటు చేయాలని, అనంతరం ముఖ్యమంత్రిని, రవాణా శాఖ మంత్రిని, ఎమ్‌డిని కలిసి ఆర్టీసి ఉద్యోగుల పరిస్థితులను వివరించాలని నిర్ణయించారు. ఇయు, ఎస్‌డబ్ల్యుఎఫ్‌లు ఇప్పటికే ఇచ్చిన సమ్మె నోటీసుకు మద్దతుగా అన్ని సంఘాలు యాజమాన్యానికి లేఖలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అప్పటికీ సమస్యలను పరిష్కరించకపోతే మిగతా 9లో

ఎపికి బిజెపి ద్రోహం
- మోడీ సర్కార్‌ను గద్దె దింపాల్సిందే
- ప్రత్యేక హోదా ధర్నాలో సీతారాం ఏచూరి

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రాజకీయ మార్పుతోనే ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలు సాధ్యమవుతుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఏపి విభజన హామీలపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీతో తాను చాలా సార్లు మాట్లాడానని, ఆయనెప్పుడూ అబద్దాలే చెబుతున్నారని అన్నారు. ఏపి ప్రత్యేక హోదాకై జరిగిన ఉద్యమానికి పార్లమెంట్ లోపల, వెలుపల సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని అన్నారు. శుక్రవారం నాడిక్కడ స్థానిక జంతర్ మంతర్ వద్ద సిపిఎం, సిపిఐ, ప్రత్యేక హోదా సాధన సమితి, జనసేన ఆధ్వర్యంలో రెండో రోజూ ధర్నా కొనసాగింది. అనంతరం నేతలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యుల బివి రాఘవులు, సిపిఐ ఎంపి బినయ్ విశ్వం తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. హోదాతోనే రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని ఆయన ఉద్ఘాటించారు. ఏపి విభజన బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ జరిగిన సందర్భంగా తాను రాజ్యసభలో ఏపికి జరిగిన అన్యాయంపై లేవనెత్తానని ఏచూరి గుర్తు చేశారు. ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని అడిగితే, అందుకు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఐదేళ్ల పాటు


ఢిల్లీలో జరిగిన ధర్నాలో ప్రసంగిస్తున్న సీతారాం ఏచూరి

ప్రత్యేక హోదా ఇస్తామని హామీనిచ్చినట్టు తెలిపారు. ఆ సమయంలో అప్పటి బిజెపి ఎంపి వెంకయ్య నాయుడు తమ ప్రభుత్వం రాబోతుందని, రాష్ట్రానికి పదేళ్ల పాటు హోదా ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. కానీ హామీలను అమలు చేయకుండా ప్రస్తుత మోడీ సర్కార్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. విభజన అహేతుకంగా జరుగుతుందని తాను ఆందోళన వ్యక్తం చేస్తే, ఏపికి న్యాయం చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని ఏచూరి వెల్లడించారు. పోలవరంను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే ఖర్చు కేంద్రమే భరిస్తుందని తెలిపారని చెప్పారు. కడప స్టీల్‌ప్లాంట్, విశాఖ రైల్వే జోన్, గిరిజన యూనివర్శిటీ వంటి హామీలను గాలికొదిలేసి, మోడీ సర్కార్ ఏపికి ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. విభజన హామీలను పార్లమెంట్ చాలా సార్లు లేవనెత్తామని, పార్లమెంట్ వెలుపల కూడా ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు. హోదా అంశంపై అరుణ్ జైట్లీ అబద్దాలు చెబుతున్నారని, ఏపికి ప్రత్యేక హోదా ప్రకటిస్తే, మిగతా రాష్ట్రాలు కూడా అడుగుతాయని జైట్లీ అంటున్నారని తెలిపారు. కానీ మిగతా రాష్ట్రాలను విభబిజించ చేయలేదని, ఏపిని మాత్రమే విభజించారని మిగతా 9లో


కడపలో విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు - వార్త 7లో

హోదా అడిగితే లాఠీఛార్జా ?
కాకినాడ సభలో మోడీపై చంద్రబాబు ఫైర్

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి



ప్రత్యేక హోదా కోసం ఢిల్లీలో ఆందోళన చేస్తున్న సిపిఎం, సిపిఐ. విద్యార్థి సంఘాలు, హోదా సమితి నాయకులను లాఠీలతో కొట్టి జైల్లో పెడతారా అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిలదీశారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రెండో డివిజన్‌లో శుక్రవారం జరిగిన ఆరో విడత జన్మభూమి–మా ఊరు సభలో ఆయన ప్రసంగించారు. కేంద్రం ఎన్ని ఆటంకాలు పెట్టినా అభివద్ధిలో దూసుకెళుతున్నామన్నారు. నేరుగా బెదిరించేందుకు తమ పార్టీ నేతల మీద ఇడి, ఐటిలను ఉసిగొల్పుతోందని, అయినప్పటికీ వెనకడుగు వేసేది మిగతా 12లో

విపత్తు సాయానికి కత్తెర
- ఎకరాకు 10 వేలు తూచ్..
- సిఎం హామీ గాలికి
- 'ఆగస్టు' బాధితులకు ఆరు వేలు మాత్రమే

2

7 నుంచి హైకోర్టుకు సంక్రాంతి సెలవులు
2



ఆర్ఎస్ఎస్, బిజెపి గూండాల దాడిని నిరసిస్తూ ఢిల్లీలో ప్రదర్శన చేపట్టిన ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యకర్తలు

కేరళలో ఆగని హింసాకాండ
నిరసనగా పార్లమెంట్‌లో లెఫ్ట్ ఎంపిల ధర్నా
- ఆ రాష్ట్ర కాంగ్రెస్ ఎంపిలపై సోనియా, రాహుల్ ఆగ్రహం
- పార్లమెంట్ ముట్టడికి ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ యత్నం.. 50 మంది అరెస్టు

8



ఆలయంలోకి మరో మహిళ
అయ్యప్పను దర్శించుకున్న శశికళ

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన
- ఎన్ఎమ్‌సి బిల్లు, సిపిఎ సవరణలపై ఆగ్రహం
- వైద్యసేవలు స్తంభింపజేస్తాం: ఐఎమ్ఎ హెచ్చరిక

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో కేంద్ర ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమిషన్‌ను తీసుకువచ్చేందుకు ప్రతిపాదించిన ఎన్ఎమ్‌సి బిల్లుపై వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వైద్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ ఐఎమ్ఎ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఐఎమ్ఎ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ గంగాధర్ మాట్లాడుతూ కేంద్రం అప్రజాస్వామికంగా, ఐఎమ్ఎ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఈ బిల్లులను ప్రవేశపెడుతోందని విమర్శించారు. ఎన్ఎమ్‌సి బిల్లు అమలులోకి వస్తే సామాన్యులు, పేదవారికి వైద్యవిద్య దూరమయ్యే ప్రమాదముందని తెలిపారు. దీనికి నిరసనగా అవసరమైతే వైద్యసేవలు స్తంబింపజేస్తామని హెచ్చరించారు. ఐఎమ్ఎ మాజీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సమరం మాట్లాడుతూఎంసిఐ స్వయం ప్రతిపత్తిని నాశనం చేస్తూ కేంద్రం తన ఆధీనంలోకి తీసుకువచ్చేందుకే ఎన్ఎమ్‌సి బిల్లును తెచ్చేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఐఎమ్ఎ మిగతా 9లో

జగన్‌పై దాడి కేసు ఎన్ఐఎకు అప్పగింత
హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ప్రతిపక్షనేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన దాడి కేసును నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఎ)కు అప్పగిస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం సరిగా దర్యాప్తు చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సాగి స్తున్న విచారణ ప్రక్రియపై నమ్మకం లేదని పేర్కొంటూ వైసిపి నేతలు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. శుక్రవారం ఆ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు దాడి జరిగిన విమానాశ్రయ లాంజ్ ప్రాంతం కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వస్తుంది కాబట్టి, దర్యాప్తును జాతీయ సంస్థలకు అప్పగించవచ్చని భావించింది. అమేరకు ఎన్ఐఎకు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేసింది. జస్టిస్ కొంగర విజయలక్ష్మీ, జస్టిస్ ఎస్‌వి భట్‌లతో కూడిన రెండవ బెంచ్ కోర్టు ధర్మాసనం ఈ కేసును విచారించింది.

ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన దమ్మాలపాటి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రత్యేకంగా సిట్ బృందంతో విచారణ చేస్తోందని, నిందితుడు శ్రీనివాస్‌ను రిమాండ్‌కు పంపడం జరిగిందని కోర్టుకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును నిష్పక్షపాతంగా చేస్తోందన్నారు. ఈ కేసును ఈ పరిస్థితుల్లో ఎన్ఐఎకు బదిలీ చేయాల్సిన అవసరం లేదని, ఈ విషయంపై అప్పీల్‌కు వెళ్లే ఆలోచనలో ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. జగన్ తరపున వాదనలు వినిపించిన న్యాయవాది సుధాకర్‌రెడ్డి తమ వాదనల్లో జగన్‌పై హత్యాయత్నానికి ప్రభుత్వమే కుట్ర చేసిందని, అందుకే తాము కేంద్ర పరిధిలోని థర్డ్ పార్టీ విచారణ కావాలని కోరుతున్నామని తెలిపారు. ఎయిర్‌పోర్టు పరిధి కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఎలా కేసును విచారిస్తుందన్నారు. దర్యాప్తు ఆలస్యమైతే సాక్ష్యాలు తారుమారయ్యే అవకాశాలున్నాయని తమ వాదనను వినిపించారు. అయితే, ఈ కేసుకు మిగతా 9లో

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి
సిఐటియు ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

ప్రజాశక్తి – న్యూఢిల్లీ బ్యూరో

2019 జనవరి 8, 9 తేదీల్లో సమ్మె కోసం చేపట్టే ఈ ప్రచారం మన ముందున్న మరో రాజకీయ పోరాటానికి నాంది. వస్తున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి విధానాలను ఎండగట్టాలి. సామ్రాజ్యవాద అనుకూల నయా ఉదారవాదాన్ని ప్రోత్సహించే రాజ్యాంగ శక్తి బిజెపి దేశాన్ని నిర్వీర్యం చేసే వైపు పయనిస్తోంది. అధికశాతం ప్రజలు బాధల్లో పేదరికంలో మగ్గుతున్నారు. వీటికి వ్యతిరేకంగా చేసే మన పోరాటం నయాఉదారవాదాన్ని ప్రోత్సహించే మోడీ నాయకత్వంలోని ప్రస్తుత బిజెపిపై గురిపెట్టాలి. దేశప్రజలపై చేస్తున్న ఈ విధ్వంసకర దాడికి బిజెపికి ఆర్ఎస్ఎస్ మార్గనిర్దేశం చేస్తోంది. ఈ దాడితో ప్రజలను అనేకరకాలుగా బిజెపి విడదీస్తున్నది. మనం ఇప్పటికే దేశప్రజలకు వ్యతిరేకమైన అతిపెద్ద శత్రువులపై జరుగుతున్న భయంకర పోరాటం మధ్యలో ఉన్నాం. ఈ పోరాటాన్ని మరింత తీవ్రం చేయాలి. ప్రభుత్వ పాలకశక్తులు సామ్రాజ్యవాద శక్తులను



కాపాడుతూ వారికి సేవలందిస్తూ, దేశ ప్రజలను మరింతగా దోపిడీకి గురిచేస్తున్నాయి. అలాంటి ప్రభుత్వం నీడన, దేశంలోని ప్రతిదీ నాశనమవుతోంది. శ్రమ జీవుల హక్కులు, వారి జీవనోపాధి, ప్రజల ఐక్యత, దేశ సమగ్రత, చివరగా ప్రజాస్వామ్యాన్నే నాశనం చేస్తోంది. జాతి విచ్ఛిన్న శక్తులు అన్ని రంగాల్లో ఉన్నాయి. పాలకులు చేస్తున్న దేశ విధ్వంస కాండకు వ్యతిరేకమే మన పోరాటం. ప్రజలపై విషపూరిత, విభజన, మళ్లింపు రాజకీయాలు చేస్తూ, వాళ్లను కుల, మత, ప్రాంత ఇంకా అనేక రకాలుగా రెచ్చగొట్టి విడదీస్తూ మానవత్వానికే శత్రువుగా మారుతున్నారు. అందుకనే ఇది కార్మికవర్గం రాజకీయ పోరాటం. ఈ ప్రచారంలోని రాజకీయ ప్రాముఖ్యతను ఏవిధం గాను తక్కువగా చూడకూడదు. ఇది కేవలం మనం ఉన్నచోట రెండు రోజులు చేసే సమ్మె మాత్రమే కాదు. దేశ కార్మికులందరూ ఈ సమ్మెలో పాల్గొనటం ద్వారా నిజమైన శత్రువు ఎవరో గుర్తించకలిగేలా చేయటం. అంటే అధికార బీజేపీ రాజకీయమే మన శత్రువని అందరికీ తెలిసేలా చేయటం. అంతేకాదు. ఈ సమ్మె పిలుపు ముఖ్య ఉద్దేశం అందరినీ చేరేలా చేయటం. ఆ ఉద్దేశ్యమే మోడీ నాయకత్వంలోని అధికార, మతవాద రాజకీయాన్ని పడదోయటం. ఇది ప్రతి కార్మికుడూ, సంఘం, ప్రతి ఒక్కరూ తెలుసుకునేలా చేయటం.

మన ప్రచారంలోని ప్రతి లక్ష్యం. శ్రామిక జనం అందరికీ చేరాలి. ఈ సమ్మెలోని రాజకీయ ప్రాముఖ్యత అందరికీ అర్థం కావాలి. ప్రతి శ్రామికుడూ ఈ సమైక్య పోరాటాలు తనవిగా భావించాలి. బిజెపి అధికార యుతమైన మిగతా 9లో



అమెరికన్ ప్రతినిధుల సభ స్పీకర్‌గా నాన్సీ
షట్ డౌన్ ఎత్తివేతకు డెమొక్రాట్లు ఓకే
సరిహద్దు గోడ నిర్మాణానికి నో

9

ప్రధాని స్థాయికి తగదు

టిడిపి ఎంపి జెసి దివాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని మోడీ స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని, అసత్యాలు మాట్లాడటం తమ స్థాయికి తగదని అనంతపురం ఎంపి జెసి దివాకర్‌రెడ్డి అన్నారు. ఉండవల్లిలోని సిఎం గ్రీవెన్స్‌హాల్ వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఆనాడు రాష్ట్రానికి దుష్టశక్తి కాగా, నేడు దేశం మొత్తానికి బిజెపి దుష్టశక్తిగా మారిందన్నారు. రాయలసీమలో ముఠా నాయకుని స్థాయిలో మోడీ తీరు ఉందన్నారు. చంద్రబాబు ఏకు మేకై కూర్చుంటాడనే మోడీ భయమని దివాకర్‌రెడ్డి చెప్పారు. ప్రజాభిప్రాయాన్ని గౌరవించకుండా పార్లమెంట్‌లో సభ్యులను సస్పెండ్ చేస్తే సరిపోతుందా? అని ఆయన ప్రశ్నించారు.

యువత కోసం..

విజయవాడ నగర పోలీసులు శుక్రవారం నిర్వహించిన 'చేరువ' కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన యువతీ, యువకులు



24 నాటికి పరిష్కారం

- చుక్కల భూములపై కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దీర్ఘకాలంగా ఉన్న చుక్కల భూముల సమస్యను ఈ నెల 24వ తేదీలోపు పరిష్కరించాలని ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వం తనంతట తానుగా చుక్కల భూములను పున:పరిశీలించాలని నిర్ణయించింది. దీని ప్రకారం చుక్కల భూములకు సంబంధించి సర్వే నెంబర్లు, ఇతర వివరాలు రెవెన్యూశాఖ ఆయా జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపుతుంది. ఆ భూములను స్వాధీనంలో ఉంచుకున్నవారు సాగుచేసుకున్న వారు ప్రభుత్వం నిర్ణయించిన పత్రాల్లో ఏదో ఒకటి చూపిస్తే ఆ భూమి వారికి సంబంధించినదిగా రిజిస్టర్‌లో పేరు నమోదు చేస్తారు. 2017 జులై 14వ తేదీకి ముందు 12 ఏళ్ల అధీనంలో ఉన్నట్లు ఆధారాలు చూపినా రిజిస్టర్‌లో వారి పేరు నమోదు చేస్తారు. చుక్కల భూములకు సంబంధించి రెవెన్యూశాఖ వద్ద తహశీల్దార్ కార్యాలయంలో పరిశీలనలో ఉన్న వాటిని, పిర్యాదులు, విజ్ఞప్తులను రెవెన్యూ సిబ్బంది తమంతటతాముగా పరిశీలిస్తారు. వాటికి కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి. ఆర్ఓఆర్ చట్టం ప్రకారం 1బి రిజిస్టర్ 2వ కాలమ్‌లో నమోదైన పట్టాదారు పేరును సరిచూసుకుని దానికి అనుగుణంగా 1బి రిజిస్టర్ 8వ కాలమ్‌లో కొనుగోలు లేదా వారసత్వం అని నమోదు చేసి వాటిని నిషేధిత జాబితా నుండి తొలగిస్తారు. 8వ కాలమ్‌లో ఏమీ రాయకపోయినా పట్టాదారు భూమిగా పరిగణించి నిషేధిత జాబితా నుండి తొలగిస్తారు. 8వ కాలమ్‌లో 1954కు ముందు ఇచ్చిన డి పట్టా, డికెటి పట్టా, అసైన్‌మెంట్ భూములు అని నమోదు చేస్తే వాటిని కూడా నిషేధిత జాబితా నుండి తొలగిస్తారు. 1954 తరువాత ప్రభుత్వం ఇచ్చిన భూములు నిషేధిత జాబితాలోనే కొనసాగుతాయి. చుక్కల భూముల పరిశీలన పూర్తయిన తరువాత తుది జాబితాని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ప్రదర్శనకు పెడతారు. వాటిల్లో ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని తెలిపితే రెవెన్యూశాఖ పరిశీలన అనంతరం కొత్త జాబితాను రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. సెక్షన్ 22ఎ1(ఈ) జాబితాని నేరుగా ప్రభుత్వానికి పంపాలని, ప్రభుత్వం దాన్ని గెజిట్‌లో ప్రచురిస్తుందని తెలిపింది. ఈ నెల 24వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం తన ఆదేశాల్లో పేర్కొంది. దీనికి సంబంధించిన మార్గదర్శ కాలను నేరుగా విఆర్ఓ కార్యాలయాలకు పంపాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది.

సాధారణ చలి

థాయ్‌లాండ్‌పైకి 'పాబుక్' తుపాను

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో చలి సాధారణ స్థితికి చేరుకుంది. గురు, శుక్రవారాలు పగటి, రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. కోస్తాలో పగలు 29 నుంచి 30 డిగ్రీలు, రాత్రి వేళల్లో 15 నుంచి 19 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నాయి. వారం క్రితం విశాఖ, కళింగపట్నం, అమరావతిలో రికార్డు స్థాయిలో 12 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు శుక్రవారం 15 నుంచి 18 డిగ్రీలకు పెరిగాయి. దీంతో చలి తీవ్రత తగ్గింది. ప్రయాణాలు చేసిన వారికి మినహా ఇళ్లల్లో ఉన్న వారికి చలి తీవ్రత తగ్గింది. రాయలసీమలో అనంతపురం, ఆరోగ్యవరంలో మాత్రం 11.5, 12.9 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప, కర్నూలు, నంద్యాల, తిరుపతిలో 15 నుంచి 16.5 డిగ్రీల వరకు పెరిగాయి. క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతూనే సాధారణ చలి కొనసాగుతుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

మరోవైపు దక్షిణ చైనా సముద్రంలో ఏర్పడిన 'పాబుక్' తుపాను శుక్రవారం నాటికి గల్ఫ్ ఆఫ్ థాయ్‌ల్యాండ్‌పైకి వచ్చిందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. పశ్చిమ-వాయువ్య దిశగా తుపాను శనివారం మధ్యాహ్నం అండమాన్ సముద్రంలోకి రానుందని పేర్కొంది. 6 వ తేదీన అండమాన్ దీవులను తాకుతుందని తెలిపింది.

9 తరువాత జనసేన జిల్లా కమిటీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనసేన పార్టీకి స్వల్పకాలిక జిల్లా కమిటీలను ఈ నెల 9 తరువాత ప్రకటించనున్నట్లు పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తెలిపారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నెల్లూరు, తూర్పుగోదావరి జిల్లా నాయకులతో విడివిడిగా సమీక్షా సమావేశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో రాజకీయం నేడు పది కుటుంబాల చేతుల్లో చిక్కుకుందని, ఈ నేపథ్యంలో ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తతరాన్ని రాజకీయాల్లోకి తీసుకురాకుంటే, జిల్లాకి అన్యాయం చేసిన వారమవుతామని చెప్పారు. వారసత్వ రాజకీయాలను ఎదుర్కోవడానికి ఓపిక కష్టించి పని చేస్తూ ప్రజలకు చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా నాయకులతో జరిగిన సమీక్షలో మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయయం కులాలతో ముడిపడి ఉందన్నారు. ప్రజారాజ్యం అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జనసేనని తీర్చిదిద్దుతున్నాని చెప్పారు. . పని చేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఇస్తామన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి దినపత్రిక,
ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4,
గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

విపత్తు సాయానికి కత్తెర

సిఎం హామీ గాలికి
'ఆగస్టు' బాధితులకు ఆరు వేలు మాత్రమే
ఎకరాకు పది వేలు.. తూచ్



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఎకరానికి పది వేల రూపాయల నష్ట పరిహారం హామీకి ప్రభుత్వం తూచ్ కొట్టింది. పాత నిబంధనల చాటున సాయాన్ని రూ.ఆరు వేలకు తగ్గించింది. అదీ విపత్తు వచ్చిన నాలుగున్నర నెలల తర్వాత నిధులు విడుదల చేసింది. సర్కారు ఎకరానికి ఇస్తామన్నదాంట్లో రూ.4 వేల సాయం ఎగ్గొట్టింది. సుమారు రూ.20 కోట్ల మేర వరద బాధిత రైతాంగానికి సున్నం పెట్టింది. ఆ మేర నిధులు మిగుల్చుకొనేందుకు కక్కుర్తి పడింది. గతేడాది ఆగస్టు మూడవ వారంలో ఎనిమిది జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలు ఖరీఫ్ పంటలను ముంచెత్తాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గోదావరి నదికి వరదలొచ్చిపడ్డాయి. పశ్చిమగోదావరిలో ఎర్ర కాల్వ పొంగడంతో పంటలు నీట మునిగాయి. ఉభయగోదావరి జిల్లాల్లో గోదావరి నది పక్కనున్న వేలాది ఎకరాల్లో ఇసుక మేటలేసి వరి పైరు దెబ్బతింది. ఆ సమయంలోనే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కృష్ణా, గుంటూరు, కర్నూలులో సైతం భారీ వర్షాలు పంటలను ముంచాయి. పంటల ఎదుగుదల వేళ వరదలు రావడంతో రైతులకు అపారనష్టం జరిగింది. ఆగస్టు 22న ఉభయగోదావరి జిల్లాల్లో వరద ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అనంతరం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో అధికారులతో అత్యవసరంగా సమీక్షించారు. వరి పంటకు బాగా నష్టం వాటిల్లిందంటూ రైతులు తిరిగి పంటలేసుకునేందుకు ఎకరాకు రూ.10 వేలు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) ఇస్తామని ప్రకటించారు. ఆ తర్వాత నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లోనూ ఇదే విధంగా రైతులకు హామీ ఇచ్చారు. అయితే ఇన్‌పుట్ సబ్సిడీని పెంచుతూ ఉత్తర్వులివ్వలేదు.

20 కోట్లు ఎగవేత

పరిహారం పెంపుపై ప్రభుత్వ ఉత్తర్వుల కోసం ఎదురు చూసిన అధికారులు ఎంతకీ రాకపోవడంతో నష్టాల నమోదు, సాయం ప్రతిపాదనల్లో అంతకుముందున్న నిబంధనల మేరకు అంచనాలు రూపొందించి సర్కారుకు పంపారు. నవంబర్ 11న వ్యవసాయశాఖ నుంచి పరిహారంపై ప్రతిపాదనలు వెళ్లాయి. అదే నెల 14న ఆర్థిక శాఖ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బిఆర్‌వో) ఇచ్చింది. జనవరి 2న విపత్తు నిర్వహణ విభాగం రూ.32.95 కోట్లు విడుదల చేసింది. తీరా చూస్తే సిఎం ఇచ్చిన హామీ ప్రకారం వరికి ఎకరానికి రూ.పది వేలు కాకుండా హుదూద్ సందర్భంలో ఇచ్చిన జీవోలోని నిబంధనల ప్రకారం ఎకరానికి రూ.ఆరు వేలు మాత్రమే విడుదల చేసింది. ఇస్తానన్నదాంట్లో ఎకరానికి రూ.4 వేల చొప్పున రైతులకు పరిహారం ఎగ్గొట్టింది. నాడు 58 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా అందులో 50 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని అంచనా. ఆ ప్రకారం చూస్తే రూ.20 కోట్లు రైతులకు సర్కారు నామం పెట్టింది.

తిత్లీ, పెథాయి కంటే తక్కువ

తిత్లీ, పెథాయి తపాను విషయంలో ప్రత్యేకంగా నష్ట పరిహారాన్ని ఎకరాకు రూ.8 వేలుగా నిర్ణయిస్తూ జీవో ఇచ్చింది. ఆగస్టు నష్టాలపై ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేదు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు 'ఆగస్టు' పరిహారంపై ప్రశ్నించగా తిత్లీ, పెథాయి, వరదలు ఈ మూడింటిలో ఒక విపత్తుకే పరిహారం ఇవ్వాలని సిఎం అసహనం వెలిబుచ్చారు. కాగా కలెక్టర్లు తాము నష్టాలను నమోదు చేశామని విన్నవించగా ఈసారికి కానివ్వండన్నారు. ఆ తర్వాతనే 'ఆగస్టు' ఫైలు కదిలింది. పాత నిబంధనలను పేర్కొంటూ ఎట్టకేలకు మొన్న గురువారం నిధులు విడుదలయ్యాయి. ఎకరానికి రూ.పది వేలని చెప్పి చివరికి తిత్లీ, పెథాయిలో ఇచ్చిన విధంగా రూ.8 వేలు సైతం ఇవ్వకుండా 'ఆగస్టు' రైతులను సర్కారు మోసగించింది.

బ్రాహ్మణ యువతకు కార్ల పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


జన్మభూమి సంక్షేమ దినోత్సవం సందర్భంగా చాణక్య ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్ల పథకం కింద బ్రాహ్మణ యువతకి మారుతీ డిజైర్ టూర్ కార్లను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఉండవల్లిలోని ప్రజావేదికలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ వేమూరి ఆనంద్ సూర్య మాట్లాడుతూ బ్రాహ్మణుల్లో కూడా యువత రవాణా రంగాన్ని ఎంచుకొని ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఈ రంగంలో ఉపాధి పొందాలనుకునే బ్రాహ్మణ టాక్సీ డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందించడానికి సిఎం అంగీకరించారన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ చాణక్య ట్రాన్స్‌పోర్ట్ ఆపరేటర్ల పథకాన్ని 2018-19 సంవత్సరంలో ప్రవేశపెట్టారని, ఈ పథకం కింద మొదటి దశలో 30 మంది యువతకు ఉపాధి కల్పించేందుకు రు. రెండు కోట్ల సబ్సిడీ రుణాలు మంజూరు చేశారని తెలిపారు. బ్రాహ్మణ వ్యాపార వేత్తలలో 1431 మందికి సబ్సిడీ రుణాల కింద రు.21 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కార్పొరేషన్ ఎమ్‌డి డాక్టర్ ఎం పద్మ, బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ప్రెసిడెంట్ శ్రీశర్మ, హెచ్‌డిపిటి చైర్మన్ సిఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీని అరెస్టు చేసి విచారించాలి : బిజెపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సినీనటుడు శివాజీని అరెస్టు చేసి విచారిస్తే వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు జగన్‌పై దాడి కేసులో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని రాష్ట్ర అధికార ప్రతినిధులు డి ఉమా మహేశ్వరరాజు, కోసూరి వెంకట్ డిమాండ్ చేశారు. విజయవాడలోని బిజెపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్‌పై దాడి కేసును హైకోర్టు ఎన్ఐఎకు అప్పగించడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు నిజాలను నీరుగార్చలని చూస్తున్నారన్నారు. శివాజీ రాష్ట్ర ప్రభుత్వంపై కొత్తగా మరో దాడి జరగబోతోందని ఆరోపిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాడని విమర్శించారు.







హైకోర్టు జడ్జి నక్కా బాలయోగికి వీడ్కోలు చేబుతున్న సహచర జడ్జిలు

7 నుంచి 18 వరకు హైకోర్టుకు సంక్రాంతి సెలవులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ఈ నెల 7 నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ మానవేంద్రనాథ్ రాయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. సంక్రాంతి సెలవుల్లో డివిజన్ బెంచ్ జడ్జిలుగా జస్టిస్ ఏవి శేషసాయి, జస్టిస్ ఎం గంగారావు వ్యవహరించనున్నారు. సింగిల్ బెంచ్ జడ్జిగా జస్టిస్ ఎం సత్యనారాయణ మూర్తి వ్యవహరిస్తారు.

- **బాలయోగికి వీడ్కోలు :** ఈ నెల 14న పదవీ విరమణ చేయనున్న హైకోర్టు జడ్జి నక్కా బాలయోగికి శుక్రవారం కోర్టు ప్రాంగణంలో సహచర జడ్జిలు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రధానన్యాయమూర్తి సి ప్రవీణ్‌కుమార్ ప్రభృతులు హాజరయ్యారు.
- తాము సొంత గడ్డపై పనిచేస్తుండటం ఆనందంగా ఉందని ఎపి హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కెబి రామన్న దొర అన్నారు. స్థానిక హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైకోర్టుకు ఇక్కడకు తరలి రావడం ఒక చారిత్రక ఘట్టమైతే అందులో తాము భాగస్వామ్యులు కావడం గర్వకారణంగా ఉందన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవలను వెంటనే పునరుద్ధరించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్టీఆర్ వైద్య సేవలను వెంటనే పునరుద్ధరించాలని, ప్రయివేటు ఆస్పత్రులు చేసున్న సమ్మెను నివారించి ప్రజలకు వైద్య సేవల్లో ఆటంకాలు లేకుండా చూడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రూ.500 కోట్ల బకాయిలు చెల్లించనందుకు నిరసనగా ప్రయివేటు ఆస్పత్రులు ఈ నెల 2 నుంచి ఈ పథకాన్ని నిలిపివేశాయని, దీంతో వైద్య సేవల్లో మరింత జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తున్నామని శ్వేతపత్రాలు విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వైద్య సేవల్లో అంతరాయంలేకుండా చేయడంలో విఫలమైందని, బకాయిలు చెల్లించాలని ప్రయివేటు ఆస్పత్రులు గతం నుంచే డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే వైద్య సేవల నిలిపివేతకు కారణమైందని పేర్కొన్నారు. వెంటనే చర్చలు జరిపి సమ్మెను ఉపసంహరించేలా చేసి వైద్య సేవలు కొనసాగేలా చూడాలని కోరారు. ఈ నెల 1 నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసూతి సేవలు నిలిపివేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సేవలను ప్రయివేటుకు అప్పగించి ఒక్కో కాన్పుకు డబ్బు చెల్లిస్తామని ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకోవడం సరైందికాదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వీర్యం చేసే చర్యలను విడనాడి, మౌలిక వసతులను కల్పించి మెరుగైన సేవలందేలా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు.

ఖర్చెంత చేశాం?

- పథకాల వారీగా వివరాలు పంపండి
- అన్ని శాఖలకు ప్రభుత్వం ఆదేశాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త వార్షిక బడ్జెట్‌కు రూపకల్పన ప్రారంభించిన ఆర్థికశాఖ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పథకాల వారిగా చేసిన ఖర్చుల(అవుట్‌కమ్ బడ్జెట్)పై కూడా దృష్టి సారించింది. ప్రధానంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటికి కేటాయించిన నిధులు, ఖర్చు చేసిన నిధులపై వివరాలు ఇవ్వాలని కోరింది. ఆయా శాఖలు నిర్దేశించుకున్న విజన్, లక్ష్యాలను స్పష్టంగా వివరించాలని నిర్దేశించింది. వృద్ధిని పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ద్వారా సాధించే లక్ష్యాల అంచనాలను కూడా నివేదించాలని స్పష్టం చేసింది. ఈ వివరాలు సచివాలయంలోని కార్యదర్శులే కాకుండా వారి పరిధిలవో ఉండే శాఖాధిపతులు కూడా సమర్పించాల్సి ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2019-20 సంవత్సరంలో కావాల్సిన నిధులు, అంతకు ముందు ఏడాది సాధించిన ప్రగతి, కొత్త సంవత్సరంలో నిర్దేశిస్తున్న లక్ష్యాలను నిర్దేశిస్తూ ప్రొఫార్మాలను సిద్ధం చేశారు. అలాగే ప్రభుత్వ పథకాలకు సంబంధించిన భౌతిక, ఆర్థిక అమలు తీరును ముందుగానే ప్రతిపాదించాలని సూచించింది.

కొండంతలో ఇచ్చింది గోరంతే : తులసిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కొండంత ఇవ్వాల్సి ఉండగా గోరంతే ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ తులసిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బిజెపి మోసగారితనం, టిడిపి చేతగానితనం, జగన్ పార్టీ అవకాశవాదం వల్ల కొన్ని అంశాలు అసలు అమలుకు నోచుకోలేదన్నారు. పిల్లికి భిక్షం వేసిన్నట్లు, ఎంగిలిమెతుకులు విదిల్చిన్నట్లు కేంద్రం నిధులు విడుదల చేసిందని విమర్శించారు.

32 కోట్లివ్వండి

ఆర్థికశాఖకు హైకోర్టు ప్రతిపాదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్థికసంవత్సరంలో చివరి మూడు నెలలకుగానూ 32 కోట్ల రూపాయలు విడుదల చేయాలని ఆర్థికశాఖను హైకోర్టు కోరింది. జీతాలు, అలవెన్సులు, ఇతర నిర్వహణ ఖర్చుల కోసం ఈ మొత్తం కావాలని తెలిపింది. జీతాలు, కరవు భత్యం, మధ్యంతర భృతి, ఇంటి అద్దె అలవెన్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఎల్‌టిసి వంటి వాటికోసం 26.62 కోట్లు, చిన్న ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల కోసం 32 లక్షలు, రవాణా అలవెన్సుల కింద 13.4 లక్షలు, విద్యుత్, నీరు, ఇతర కార్యాలయాల నిర్వహణ కోసం 4.29 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. వాహనాలు,న్యాయ వాదుల ఫీజులు, ఇతర ఖర్చులకు మరో 11.68 లక్షలు కేటాయించాలని కోరింది. విధులకు ఇబ్బందులు కలుగకుండా వీలయినంత త్వరగా ఈ నిధులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్థికశాఖను కోరింది.

ప్రత్యేకం

నెలాఖరులోగా మరో నోటిఫికేషన్

- 1,521 పోస్టులు భర్తీ
- ఎపిపిఎస్‌సి చైర్మన్ ఉదయభాస్కర్
- కటాఫ్ మార్కులు అందరికీ ఒక్కటే



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జనవరి మాసాంతంలోగా మరో 1,521 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఎపిపిఎస్‌సి ఛైర్మన్ ఉదయ భాస్కర్ తెలిపారు. కమిషన్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రభుత్వం నుండి అనుమతులు రాగానే నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు 3,255 పోస్టుల భర్తీకి 21 నోటిఫికేషన్లు విడుదల చేశామని వివరించారు. ఎపిపిఎస్‌సి పోస్టుల భర్తీకి ఇక నుండి కటాఫ్ మార్కుల విధానాన్ని అనుసరించనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు స్క్రీనింగ్ టెస్టు నుంచి మెయిన్ పరీక్షలకు 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. ఇక నుంచి కటాఫ్ మార్కులు ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం అంగీకరించిందన్నారు. రిజర్వేషన్ కేటగిరి పోస్టులలో రిజర్వేషన్ అభ్యర్థులు అర్హత మార్కులు సాధించకపోతే వారికి అర్హత మార్కులు తగ్గించి భర్తీచేస్తామని స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల అన్ని పోస్టులు భర్తీ అవుతాయని, బ్యాక్‌లాగ్ పోస్టులు ఉండవని చెప్పారు. అభ్యర్థులు ముందుగానే పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. చివరి సమయంలో దరఖాస్తు చేసుకోవడంతో సర్వర్ సమస్యతో పాటు, కమిషన్‌కు ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ నెంబర్లు 08645-2527819, 2527820, 2527821 ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ కార్యదర్శి అరుణ్ కుమార్ మౌర్య, సభ్యులు సేవా రూపా, జి సుజాత, పద్మరాజు, ఆర్ జనార్ధన, కె విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ

ఎపిపిఎస్‌సి విడుదల చేసిన పోస్టులకు అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎఇఇ), ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్‌వో), అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎఎంవిఐ), హార్టికల్చర్ ఆఫీసర్(హెచ్‌ఓ) పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ ముగిసింది. 24 ఎఫ్ఆర్‌ఓ పోస్టులకు 16,031(ఒక్కో పోస్టుకు 667 చొప్పున)మంది దరఖాస్తు చేసుకున్నారు. 23 ఎఎంవిఐ పోస్టులకు 5,411(ఒక్కో పోస్టుకు 236 చొప్పున) మంది దరఖాస్తు చేసుకున్నారు. 309 ఎఇఇ పోస్టులకు 47,001(ఒక్కో పోస్టుకు 153 చొప్పున)మంది దరఖాస్తు చేసుకున్నారు. 39 హెచ్‌ఓ పోస్టులకు 1,309 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1051 పంచాయతీ కార్యదర్శుల పోస్టుల దరఖాస్తుకు ఈ నెల 19 చివరి తేది కాగా ఇప్పటి వరకు 56,600 మంది దరఖాస్తు చేసుకున్నారు.

కొత్త ఉద్యోగాల వివరాలు

1	డిపిఆర్‌ఓ(ఐ అండ్ పిఆర్) పోస్టులు	4
2	సెరికల్చర్ ఆఫీసర్	13
3	ఈవో గ్రేడ్-3	60
4	అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్	78
5	అసిస్టెంట్ డైరెక్టర్ (ఎపి ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్)	6
6	తెలుగు రిపోర్టర్(అసెంబ్లీ)	05
7	ఇంగ్లీష్ రిపోర్టర్(అసెంబ్లీ)	10
8	ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్	50
9	ఫారెస్ట్ బీట్ ఆఫీసర్	330
10	అసిస్టెంట్ బీట్ ఆఫీసర్	100
11	అసిస్టెంట్ ఇంజనీర్స్	190
12	లెజిస్లేటివ్ ఆఫీసర్	03
13	రిసర్చ్ ఆఫీసర్	02
14	జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్	670
	మొత్తం	1,521

గొల్లపాలెంలో గ్యాస్ లీకేజీ

ప్రజాశక్తి - రాజోలు (తూర్పుగోదావరి)

మలికిపురం మండలం తూర్పుపాలెం, గొల్లపాలెంలో పైపులైన్ నుంచి గ్యాస్ లీకైన ఘటనలు తీవ్ర కలకలం రేపాయి. మలికిపురం మండలం తూర్పుపాలెంలో గురువారం రాత్రి నుంచి ఒఎన్‌జిసికి చెందిన గొల్లపాలెం-తూర్పుపాలెం సరిహద్దుల్లోని 47వ బావి నుంచి వెళ్తున్న పైపులైన్ లీకైంది. గ్యాస్, ఆయిల్ పైకి రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు ఒఎన్‌జిసి అధికారులకు సమాచారం ఇవ్వగా, శుక్రవారం ఉదయం వాల్వులు ఆపేయడంతో పెను ప్రమాదం తప్పింది. కోనసీమలో ఒఎన్‌జిసి, గెయిల్ సంస్థలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



బాలోత్సవంలో విద్యార్థులతో మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి డి.సాంబశివరావు

బాలోత్సవంతో నైపుణ్యం

అమరావతి బాలోత్సవం ముగింపులో రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

బాలోత్సవం నిర్వహణతో విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకత వెలుగుచూసిందని రెవెన్యూశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి డి.సాంబశివరావు అన్నారు. విజయవాడ పటమటలోని చిగురుపాటి శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో మూడురోజులుగా జరుగుతున్న అమరావతి బాలోత్సవం శుక్రవారంతో ముగిసింది. ఆయన శుక్రవారం బాలోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు విద్యార్థులను కలుసుకుని వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం గురువారం జరిగిన పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షులు చలువాది మల్లికార్జునరావు, అధ్యక్షులు ఎస్‌పి.రామరాజు, కార్యదర్శి ఆర్.కొండలరావు, మురగ శ్రీనివాస్, పి.మురళీకృష్ణ, ఆలిండియా రెడియో మాజీ సంచాలకురాలు ఎం.కృష్ణకుమారి పాల్గొన్నారు. దేశంలోనే అక్షరాస్యతా శాతంలో మనరాష్ట్రం ఇంకా వెనుకబాటులోనే ఉందని, 99.9 శాతం అక్షరాస్యతతో కేరళ ప్రథమ స్థానంలో ఉందని, అందువల్లే ఆ రాష్ట్రం మానవాభివృద్ధి సూచీలో ముందు వరుసలో ఉండి ఆదర్శంగా నిలిచిందని కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం అన్నారు. అమరావతి బాలోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుతం కృష్ణాజిల్లాలో విద్యార్థులను కార్పొరేట్ పాఠశాలలు తరగతి గదుల్లో బందీలుగా చేస్తున్నాయని, దీనివల్ల ప్రతి వందమందిలో 8 మంది చక్కెర వ్యాధిబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పద్ధతి మారాలని, చదువుతో పాటుగా ఆటపాటల్లో, క్రమశిక్షణలో ముందుండేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు.

జన్మభూమి సభలో రైతు ఆత్మహత్యాయత్నం

- మూడో రోజూ నిలదీతలే
- విజయవాడలో పోలీసుల సమక్షంలోనే టిడిపి నేతల దాడి
- విశాఖలో బండారు అనుచిత వ్యాఖ్యలు

ప్రజాశక్తి యంత్రాంగం

మూడో రోజైన శుక్రవారం కూడా రాష్ట్ర వ్యాపితంగా ప్రజలు వివిధ సమస్యలపై జన్మభూమి సభల్లో నిలదీశారు. కర్నూలు జిల్లా ఆస్పరి మండలం అలిగేరిలో తన సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని రైతు నరాల జలపతి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుమార్తెకు వికలాంగ పింఛను ఇవ్వడం లేదని, ఇల్లు మంజూరైనా నిధులు రాకుండా టిడిపి నాయకులు అడ్డుపడుతున్నారని రైతు వివరించారు. ఉలిందకొండలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం బాగోలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు.

విజయవాడ 56వ డివిజన్ వాంబే కాలనీలోనూ, పశ్చిమ నియోజకవర్గం 29వ డివిజన్ లేబర్ కాలనీలోనూ, తూర్పు నియోజకవర్గంలోని 18వ డివిజన్‌లో సమస్యలు ప్రస్తావించిన సిపిఎం, సిపిఐ, జనసేన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమక్షంలోనే టిడిపి నాయకులు వాంబే కాలనీలో సిపిఎం, ఇతర పార్టీల నేతలపై దాడికి పాల్పడ్డారు. సమస్యలు చెప్పేందుకు వచ్చిన నాయకులను అరెస్టు చేశారు. పెనమలూరు మండలం పోరంకిలో జరిగిన జన్మభూమిలో అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని సిపిఎం నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. విశాఖ జిల్లా పంచగ్రామాల భూ సమస్యపై అడ్డుపడుతున్నది కమ్యూనిస్టులేనని, వారిని సభ నుంచి బయటకు లాగేయండని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అనుచిత వ్యాఖ్యలు చేశారు. జివిఎంసి 72వ వార్డు పాత గోశాల కూడలి సభలో పంచగ్రామాల రైతులపై ఆయన విరుచుకుపడ్డారు. సభ ప్రారంభంలో సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు, ఇతర నాయకులు బి.రమణి భూసమస్యపై సరైన సమాధానం ఇవ్వాలని ప్లేకార్డులు పట్టుకుని సభలో నినాదాలు చేశారు. దీంతో రెచ్చిపోయిన ఎమ్మెల్యే రైతులు, భూ బాధితులపై విరుచుకుపడ్డారు. సంఘ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని వదిలేశారు.



కర్నూలు జిల్లా అలిగేరి జన్మభూమి సభలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేస్తున్న రైతు నరాల జలపతి

అనంతపురం జిల్లా రాయదుర్గం, పెనుకొండ, పుట్లూరు మండలాల్లో స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. పెనుకొండలో సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన సిపిఎం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

కృష్ణాజిల్లా మొవ్వ మండలం మంత్రిపాలెంలో పెండింగ్ సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారో చెప్పాలని కోరుతూ పామర్రు ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పనను నిలదీశారు. చల్లపల్లి మండలం మంగళాపురంలో ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లకు 20 నెలల నుంచి జీతాలు ఎందుకు చెల్లించటం లేదని టిడిపి సీనియర్ నాయకుడు నిడమానూరు దిలీప్ అధికారులను ప్రశ్నించారు. పెడనలో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. సమస్యలు పరిష్కారం కాని ఈ సభలు మాకొద్దంటూ సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన విజయనగరం జిల్లాలో పలుచోట్ల అధికారులను ప్రజలు నిలదీశారు. గుమ్మలక్ష్మీపురం మండలం ఇరిడిలో సభను దర్శిని, గాజులగూడ, కన్నయ్యగూడ, నర్సుగూడ గిరిజనులు అడ్డుకున్నారు. కురుపాం మాజీ ఎమ్మెల్యే విటి జనార్ధన్ థాట్రాజ్‌తో వాగ్వాదానికి దిగారు. కొత్తవలసలో సభ ప్రారంభం నుంచే స్థానికుల నుంచి నిరసనలు, నిలదీతలు ఎదురయ్యాయి. సమస్యలు పరిష్కారం కాకపోవడంపై లక్కవరపుకోట మండలం రెల్లిగౌరంపేటలో జన్మభూమి సభను స్థానికులు అడ్డుకున్నారు. వేపాడ మండలం కరకవలసలో తమ సమస్యలపై అధికారులను ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన గిరిజనులు నిలదీశారు.. తిత్లీ తుపానులో పూరిళ్లు పడిపోయినా పరిహారం అందకపోవడం, అనర్హులకు పరిహారం అందించడంపై శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం కేశరిపడలో అధికారులను స్థానికులు నిలదీశారు. ప్రకాశం జిల్లా కనిగిరి ఒకటో వార్డులో జరిగిన సభళో నీటి సమస్యపై ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అధికారులను నిలదీశారు. సభ జరక్కుండా కొద్దిసేపు అడ్డుకున్నారు. కమిషనర్ పద్మావతి స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువులో గతేడాది నుంచి ఉపాధి హామీ పనుల్లేక వలసలు వెళుతున్నారనీ, అధికారులకు ఎన్నిసార్లు అర్జీలిచ్చినా పట్టించుకోవడం లేదనీ సభను అడ్డుకున్నారు. గంటన్నరసేపు అధికారులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది.

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులో ఎస్టీకాలనీ వాసులు తమ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులను నిలదీశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలో నిర్వహించిన సభలో సిపిఎం నిరసన చేపట్టింది. ఉండవల్లి దళితులను సిఆర్‌డిఎ డిఇ బాబురావు కులం పేరుతో దూషించడాన్ని సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం.రవి తీవ్రంగా ఖండించారు. డిఇపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. స్థానికులకు డిఇ క్షమాపణ చెప్పాలన్నారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రస్తావించారు.

పాతగుంటూరు రెడ్ల బజారులో సభకు ధరఖాస్తులిచ్చేందుకు అధికంగా జనం వచ్చినా స్వీకరించేవారు లేక వెనుదిరిగారు. కార్యక్రమానికి వచ్చిన ప్రజలు సమస్యలపై సభావేదిక వద్ద ప్రశ్నించకుండా ముందు జాగ్రత్తగా అన్నిచోట్ల టిడిపి కార్యకర్తలను కాపలా పెట్టారు.విశాఖ గ్రామీణ జిల్లాలో డుంబ్రిగుడ మండలం రంగిలిసింగిలో గత జన్మభూమి సమస్యలను పరిష్కరించలేదని గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు జన్మభూమిని బహిష్కరించారు. ముంచంగిపుట్టు మండలం బరడ, లక్ష్మీపురంలో ఉపాధి బిల్లు బకాయిలు చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన కూలీలు అధికారులను నిలదీశారు. ఈ నెల 10వ తేదీలోగా బకాయిలు చెల్లిస్తామని అధికారులు లిఖితపూర్వక హామీనిచ్చాకే ఆందోళన విరమించారు.

28,29 తేదీల్లో తిరుపతిలో ఎపిడబ్ల్యుజెఎఫ్ 4వ రాష్ట్ర సభ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి


ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) 4వ రాష్ట్ర మహాసభను తిరుపతిలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు వెల్లడించారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ.. ఈ నెల 27 రాష్ట్ర కార్యవర్గ సమావేశం, 28న ప్రారంభసభ, 29న నూతన కార్యవర్గం ఎన్నిక ఉంటుందన్నారు. తిరుపతిలోని రామతులసి కళ్యాణమండపంలో నిర్వహించనున్న ఈ మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అతిథులుగా మంత్రులు కాల్వశ్రీనివాసులు, అచ్చెన్నాయుడు, అమరనాథరెడ్డి, నారాయణతోపాటు వివిధ పార్టీల ముఖ్యనాయకులు హాజరవుతారని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపై ఎపిడబ్ల్యుజెఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ఫెడరేషన్ ఆవిర్భవించి 11 ఏళ్లు పూర్తవుతోందని తెలిపారు. గత మూడు మహాసభలను వరుసగా హైదరాబాదు, విశాఖపట్నం, విజయవాడల్లో నిర్వహించామని, ఈసారి 4వ మహాసభను తిరుపతిలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 28 వ తేదీ సాయంత్రం నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ కార్యవర్గ సమావేశమూ జరుగుతుందని, దీనికి ఆ సంఘం జాతీయ అధ్యక్షులు పాండే, ప్రధాన కార్యదర్శి ఎం. కోటేశ్వరరావుతో పాటు కార్యవర్గసభ్యులు పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వళిగలం గోపి, రాష్ట్ర నాయకులు మునిరాజు, మురళి, ఎం రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షులు జి శ్రీధర్, జిల్లా నాయకులు పి సురేంద్ర, తులసి పాల్గొన్నారు.

మూడోరోజూ అదే తంతు

భోజనం అందించలేని 'ఏక్తా శక్తి'!

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

పశ్చిమగోదావరి జిల్లాలో వరుసగా మూడోరోజూ ఏక్తా సంస్థ చిన్నారులకు మధ్యాహ్న భోజనాన్ని పూర్తిస్థాయిలో అందించలేకపోయింది. శుక్రవారం ఉండి క్లస్టర్‌లో నాలుగు మండలాలు ఉండగా పాలకోడేరు, ఉండి మండలాలకే భోజనం అందింది. కాళ్ల మండలంలో 60 స్కూళ్లు ఉండగా, ఒక రూట్‌లోని 15 స్కూళ్లకే భోజనం అందించారు. మిగిలిన 45 స్కూళ్లకు అందించలేదు. ఆకివీడు మండలంలో 62 స్కూళ్లు ఉండగా, ఒక రూట్‌లోని 22 స్కూళ్లకే అందించారు. ఏలూరు క్లస్టర్‌లో పూర్తిస్థాయిలో భోజనం అందించినట్లు చెబుతున్నా, వందమంది విద్యార్థులు ఉన్నచోట 30 మందికే భోజనం అందింది. శనివారం నుంచి ఏక్తాశక్తి సంస్థకు మండలాలు తగ్గించి వంటమ్మలతో భోజనం తయారు చేయిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుక తెలిపారు.











సంపాదకీయం

ఉన్మాద వీరంగం

బంద్ పేరిట కేరళలో గురువారంనాడు హిందుత్వ శక్తులు హింసాకాండ సాగించడం గర్హనీయం. శబరిమల అయ్యప్ప సన్నిధానంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశించినందుకు నిరసనగా బంద్ చేపట్టినట్టు చెబుతున్నా ఆ రాష్ట్రంలో అరాచకాన్ని సృష్టించి, వామపక్ష ప్రభుత్వాన్ని అస్థిర పర్చాలన్న సంఘ్ పరివార్ కుట్రలో అంతర్భాగంగానే జరిగిందిది. కాషాయ కుట్రకు ఆ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ కూడా తోడవ్వడం దాని దిగజారుడుతనానికి పరాకాష్ట. అయ్యప్ప గుడిలోకి మహిళల ప్రవేశానికి ఎలాంటి ఆటంకం వుండరాదన్నది దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశం. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం తీర్పు అమలుకు అన్ని చర్యలూ తీసుకుంది. బుధవారం తెల్లవారు ఝామున గీత, కనకదుర్గ ఆలయానికి వెళ్లడం, వారికి పోలీసులు భద్రత కల్పించడమూ అందులో భాగమే. రాజ్యాంగం ప్రసాదించిన లింగ సమానత్వ హక్కును ఎవరూ తిరస్కరించ జాలరు. సంఘ్ పరివార్ నీడలోని శబరిమల కర్మ సమితి బంద్‌కు పిలుపునివ్వడం, బ్లాక్‌డేగా పాటించాలని కాంగ్రెస్ చెప్పడం సుప్రీం తీర్పును ధిక్కరించడం, రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే అవుతుంది. బంద్ పేరిట హిందుత్వ మూకలు సాగించిన హింసాకాండలో ఒకరు మరణించగా, వందలాదిమంది గాయపడ్డారు. 79 ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేయడమేగాక అనేక చోట్ల సిపిఎం, సిపిఐ కార్యాలయాలపై రాళ్లతో దాడులు చేశారు. విధి నిర్వహణలో వున్న జర్నలిస్టులను, 39 మంది పోలీసులను గాయపర్చారు. శబరిమలపై సుప్రీం తీర్పు అనంతరం ఆ రాష్ట్రంలో జరిగిన ఐదవ హర్తాళ్ ఇది. ఉత్పత్తి నిలిచిపోవడం, ప్రజా జీవనానికి ఆటంకం కలగడం అటుంచి విధ్వంసం సృష్టించడం తీవ్రమైన అంశం. ఇటీవలే రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన వరదలు రూ.30 వేల కోట్లకు పైగా నష్టం కలిగించాయి. కేరళ ప్రజలంతా ఒక్క మనిషిలా నిలిచి ఆ విపత్తును ఎదుర్కున్నారు. ఇప్పుడు మత ఛాందసత్వాన్ని ఉపయోగించి ఆరెస్సెస్ ఆ ప్రజల సమైక్యతకు చిచ్చు పెడుతోంది. మహిళలు ఆలయంలోకి ప్రవేశించినందున ప్రధాన అర్చకుడు (తంత్రి) శుద్ధి కార్యక్రమం చేపట్టడం ఘోరమైన తప్పిదం. మహిళల ప్రవేశం ఇష్టం లేకపోతే ఆ బాధ్యత నుండి తప్పుకోవాలే తప్ప శుద్ధి చేస్తామనడం శుద్ధ తప్పు. శ్రీలంకకు చెందిన శశికళ అనే మరో మహిళ గురువారం రాత్రి అయ్యప్ప సన్నిధానానికి వెళ్లారు. ఈ క్రమం ఇకపై కొనసాగుతుంది.

జాతీయ స్థాయిలో లింగ సమానత్వానికి కాంగ్రెస్ కట్టుబడి వుంది. కనుక పార్లమెంటులో నిరసనలు తెలపరాదనీ, రాజకీయ అవసరాలకు స్థానికంగా వ్యతిరేకించుకొమ్మని ఆ పార్టీ ఎం.పిలకు సోనియా గాంధీ హితబోధ చేసినట్టు శుక్రవారంనాడు మీడియాలో కథనాలు వచ్చాయి. అయోధ్య వివాదాస్పద స్థలంలో శిలాన్యాస్‌ను అనుమతించడం, షాబానో కేసు సందర్భంగా ద్వంద్వ వైఖరి తీసుకోవడం వంటివాటితో సహా కాంగ్రెస్ పార్టీ దీర్ఘ కాలంగా మతతత్వంతో రాజీ పడుతోంది. శబరిమల విషయంలో కూడా అదే విధానం అనుసరిస్తోంది. సుమారు మూడు దశాబ్దాలుగా మతతత్వ శక్తులు బలపడడం, కాంగ్రెస్ శక్తి సన్నగిల్లడం గమనార్హం. మతతత్వ, మితవాద శక్తుల పట్ల రాజీ వైఖరి అనుసరించిన ఇతర పార్టీలు బలహీనపడడం ఒక అంతర్జాతీయ పరిణామంగా వుంది. కేరళలో కాంగ్రెస్ ఇలాగే కొనసాగితే అక్కడా బలహీన పడడం ఖాయం. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో యుడిఎఫ్ ఓట్లు తగ్గి, ఆ మేరకు ఎల్‌డిఎఫ్‌కు పెరిగాయి. కాబట్టి కాంగ్రెస్ 'ఏ రోటి కాడ ఆ పాట పాడుతామంటే' కుదరదు. ప్రజలు అంగీకరించరు.

లింగ సమానత్వాన్ని ఎలుగెత్తి నినదిస్తూ, చైతన్య స్ఫూర్తితో సుమారు 50 లక్షల మంది 620 కిలోమీటర్ల మహిళా మహా కుడ్యాన్ని నిర్మించి ప్రపంచ రికార్డు నెలకొల్పిన మూడు రోజులకే పరివార్ మూకలు విధ్వంసం సృష్టించడం నేరపూరితమైన కుట్ర. ఆ కుట్రలను వమ్ము చేస్తూ చైతన్యవంతులైన కేరళ ప్రజలు అభ్యుదయ భావాలకు వెన్నుదన్నుగా నిలవడం హర్షణీయం. హింసకు పాల్పడిన మూకలను చాలా చోట్ల ప్రజలే ప్రతిఘటించి, తరిమివేసిన ఘటనల ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ప్రగతిశీల సంస్కృతి, సాంప్రదాయాలను ముందుకు తీసుకుపోవడానికి కృషి చేస్తున్న సిపిఎం నాయకత్వంలోని ఎల్‌డిఎఫ్‌కు కేరళీయులు మద్దతుగా వుండడం ఆహ్వానించదగింది. దేశంలో అటు వ్యవసాయ సంక్షోభం ముదురుతుండగా, ఇటు పారిశ్రామికోత్పత్తి దిగజారుతోంది. యువతకు ఉపాధి లేదు. ప్రజల కొనుగోలు శక్తి కునారిల్లుతోంది. ఈ సవాళ్లనెదుర్కొని పరిస్థితిని చక్కదిద్దవలసిన కేంద్ర ప్రభుత్వం ఆ పని మానేసి మత కుంపటిని రాజెయ్యడం అత్యంత గర్హనీయం. రానున్న సార్వత్రిక ఎన్నికలకు మత విద్వేష మార్గం పట్టాలని కాషాయ పార్టీ నిర్ణయించుకొనే ఇలా చేస్తోంది. మతపరమైన చీలికను కేరళీయులు మాత్రమేగాక యావత్ భారత ప్రజానీకం ఆమోదించరు. పరివార్ శక్తులు మట్టి కరవక తప్పదు.

ఇది విషయం



నమ్ముకొని అధికారము ఇస్తే
నమ్మకము పోగొట్టుకుంటివి
పదవి అధికారము బూని
పదిలముగా తల బోడిజేస్తివి
దాపునకు రాననుచు చనువుగా
టోపి పెడితివి లాభపడితివి

- కాళోజీ

విశ్లేషణ

చెప్పే దానికన్నా, దాచిపెట్టేదే ఎక్కువ!



సీతారాం ఏచూరి



ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడిస్తున్న వాస్తవాల కన్నా దాచిపెడుతున్న వాస్తవాలే ఎక్కువగా వుంటున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఒక మీడియా సంస్థకు 2019లో ఇచ్చిన తొలి ఇంటర్వ్యూలో గత ఏడాదిని భారత్‌కు 'వెలుగుల సంవత్సరం' అంటూ మాజీ ప్రధాని వాజ్‌పేయి 2004లో తెర పైకి తెచ్చిన 'వెలుగుల భారతం' నినాదాన్ని గుర్తుకు తెచ్చారు. ఈ ప్రకటన ద్వారా ప్రధాని 'పాత నినాదాన్నే కొత్తగా చదువు'తున్నట్లు కనిపిస్తోంది తప్ప కొత్తగా ఏమీ చెప్పటంలేదు. మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో దాదాపు గంటన్నరకు పైగా మాట్లాడిన ప్రధాని 2014 నాటి ఎన్నికల్లో భారత ప్రజలకు తాను చేసిన వాగ్దానాలలో ఒక్కదానిని కూడా ప్రస్తావించలేదు. అవేవీ అమలుకు నోచుకోకపోవటమే ఇందుకు కారణం. ఈ ప్రక్రియ అంతా 'వాస్తవాలు తక్కువ, ప్రచారం ఎక్కువ' అన్న తరహాలో కొనసాగుతోంది తప్ప మరొకటి కాదు. ఈ ప్రక్రియలో ఎక్కువగా తప్పుడు సమాచారమే వెల్లడవుతోంది తప్ప వాస్తవాలకు చోటు దక్కటం లేదు.

వ్యవసాయ రుణాల మాఫీ

ఏక కాల వ్యవసాయ రుణాల మాఫీని ప్రధాని 'లాలీపాప్' అని అభివర్ణించటం దీనిపై ఆయనకున్న దారుణమైన, అమానుషమైన ఆలోచన లను ప్రతిబింబిస్తోంది. రోజురోజుకూ అప్పుల ఊబిలో కూరుకుపోతూ మనుగడ కష్టసాధ్యమైన పరిస్థితుల్లో రైతాంగం జరిపిన పోరాటాల ఫలితంగా ఈ రుణ మాఫీ డిమాండ్ తెర పైకి వచ్చిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. రైతుల ఆత్మహత్యలకు దారితీసే ప్రమాదకర పరిస్థితులకు ఈ రుణభారం దారి తీస్తోంది. ఈ దురదృష్టకర పరిస్థితులను నివారించి 'అన్నదాత'ను రక్షించేందుకు ఏక కాల రుణ మాఫీ ఒక పరిష్కార మార్గం. ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు వుండే విధంగా వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధరను నిర్ణయిస్తామని 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కార్యాచరణలో పెట్టాలని దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న రైతాంగ ఉద్యమాలు ప్రధానిని డిమాండ్ చేస్తున్నాయి. ఈ నాలుగేళ్లూ మోడీ ప్రభుత్వం ఈ దిశగా చేసిందేమీ లేదు. గ్రామీణ భారతానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తూట్లు పొడుస్తున్న కారణంగానే వ్యవసాయ సంక్షోభం నానాటికీ తీవ్ర రూపం దాలుస్తోంది. ఈ పరిస్థితులు గ్రామీణ ప్రాంతాలలోని వ్యవసాయేతర వర్గాలను కూడా అల్పాదాయ వర్గాలుగా మార్చివేస్తున్నాయి.

నోట్ల రద్దు

నోట్ల రద్దు సునామీతో భారత ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైన పరిస్థితులకు భిన్నంగా ప్రధాని మోడీ ఈ ప్రక్రియ పూర్తి విజయవంతమైందని చెప్పటం విడ్డూరంగా వుంది. నోట్ల రద్దు ప్రక్రియ వల్లే దేశంలో మొత్తం నల్ల డబ్బు బ్యాంకులకు చేరుకుందని ప్రధాని చెప్పిన మాటలు విస్మయం కలిగిస్తున్నాయి. ఇంతకన్నా తప్పుడు వాదన మరొకటి వుండదు. చట్టానికి వ్యతిరేకంగా కూడ బెట్టిన నల్లడబ్బును తెల్లడబ్బుగా మార్చుకునేం దుకు ప్రధాని చేపట్టిన ఈ నోట్ల రద్దు ప్రక్రియ సహకరించింది. చట్టాన్ని ఉల్లంఘించి నల్లడబ్బును కూడబెట్టిన వారిని శిక్షించటానికి బదులుగా ప్రధాని వారి ఉల్లంఘనలకు చట్టబద్ధత కల్పించారు. ఈ ప్రక్రియలో నోట్ల రద్దు దేశ అసంఘటిత ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసింది. వ్యవసాయం తరువాత అధికంగా ఉద్యోగా వకాశాలు కల్పించే అసంఘటిత రంగం నోట్ల రద్దు కారణంగా ధ్వంసమై పోవటంతో దైనందిన జీవితంలో అధిక శాతం నగదు లావాదేవీలపై ఆధారపడిన కోట్లాది మంది ప్రజల జీవనాధారం కూడా ధ్వంసమైంది. దేశ జిడిపి తగ్గుదల, ఆర్థిక సంక్షోభం వంటివి ప్రధాని తీసుకున్న నిర్ణయం ఫలితంగా ఏర్పడినవే.

జిఎస్‌టి

'అర్ధరాత్రి సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్లమెంట్ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆర్భాటంగా జిఎస్‌టి అమలును ప్రకటించారు. పన్ను వసూళ్ల ద్వారా అధిక రెవిన్యూ రాబడితో భారత ఆర్థిక వ్యవస్థలో ఇది విప్లవాత్మక మార్పు తీసుకు వస్తుందని చెప్పారు. దీనితోపాటు పన్ను పరిధి కూడా విస్తృతమవుతుందన్నారు. అయితే పన్ను రిటర్న్‌లు దాఖలు చేసే వారి సంఖ్య పెరిగింది తప్ప పన్ను వసూళ్లు మాత్రం గణనీయంగా పడిపోయాయి. 2018 ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో జిఎస్‌టి వసూళ్లు సగటున రూ.96,800 కోట్లు మాత్రమే నమోదయ్యాయని, బడ్జెటరీ లక్ష్యాలను మాత్రం రూ.1,06,300 కోట్లుగా నిర్ణయించారు. ఈ లెక్కన రానున్న మూడు నెలల్లో బడ్జెటరీ లక్ష్యాలను చేరుకోవటానికి జిఎస్‌టి వసూళ్లు సగటున రూ.1,34,900 కోట్ల మేర వుండాలి. అంతేకాక జిఎస్‌టి గొప్పతనాన్ని చెబుతూ ప్రధాని పన్ను వ్యవస్థ సరళీకృతమైందని, ప్రజలకు గొప్ప సాంత్వన లభించిందని చెప్పటం హాస్యాస్పదంగా వుంది. జిఎస్‌టి అమలు తీరును పరిశీలిస్తే దేశంలో ఉద్యోగావకాశాలను విస్తృతంగా కల్పించే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాల (ఎంఎస్‌ఎంఇ) రంగం ఈ దెబ్బకు కుదేలయి పోయిందన్న భావన కలగక మానదు. కోట్లాది మంది చిరుద్యోగులు ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారు. జిఎస్‌టితో 500కు పైగా వస్తువులపై పన్ను పోటు వుండదని ప్రధాని చెబుతున్నారు. అయితే ఇందులో 490కి పైగా వస్తువులు ఇంతకు ముందే పన్ను రహిత జాబితాలో వున్నాయని, ఈ అంశాన్ని పరిశీలిస్తే ప్రధాని ప్రకటన ఎంత బూటకమో ఎవరికైనా అర్థమవుతుంది.

రాఫెల్ కుంభకోణంలో తన పాత్రేమీ లేదని చెబుతున్న ప్రధాని, దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) విచారణ జరిపేందుకు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ఈ ఒప్పందంలో ఎటువంటి అవినీతీ లేదని ధీమాగా వున్నపుడు జెపిసి విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు? పార్లమెంట్, ప్రజలకు తెలియని సమాచారాన్ని తొక్కిపెట్టినందు వల్లే ఇటు ప్రధాని, అటు బిజెపి జెపిసి విచారణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్న విషయం రుజువవుతోంది.

నిరుద్యోగిత

దేశంలో నానాటికీ పెరుగుతున్న నిరుద్యోగితపై ప్రధాని నోటి నుండి ఇప్పటి వరకూ ఒక్క మాట కూడా వెలువడలేదు. తమ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని భారత యువతకు ప్రధాని ఇచ్చిన హామీ మేరకు ఇప్పటి వరకూ పది కోట్ల ఉద్యోగావకాశాలు కల్పించి వుండాలి. కానీ అందుకు బదులుగా భారీయెత్తున లేఆఫ్‌లు, అసంఘటిత ఆర్థిక వ్యవస్థ విధ్వంసం, ఛిద్రమైన ఎంఎస్‌ఎంఇ రంగం.. ఇవన్నీ దేశంలో నిరుద్యోగిత పెరుగుదలకు మూల కారణాలుగా మారుతున్నాయి. గత రెండు దశాబ్దాల కాలంలో ఎన్నడూ లేనంత తీవ్ర స్థాయిలో నిరుద్యోగ సమస్య మన దేశాన్ని వేధిస్తున్నదని అనధికారిక అంచనాలు చెబుతున్నాయి. నిరుద్యోగ పరిస్థితిపై లేబర్ బ్యూరో వార్షిక నివేదికల గణాంకాలను అధికారిక లెక్కలు ఎప్పుడో దూరం పెట్టేశాయి. లేబర్ బ్యూరో గణాంకాలు వాస్తవాలను వెల్లడిస్తాయన్న భయంతోనే వాటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం దేశ జనాభాలో యువత పెద్ద సంఖ్యలో వుంది. గత ఐదేళ్ల కాలంలో వీరి భవిత అభద్రత, అనిశ్చితిలో పడిపోయింది. ఈ యువతే దేశ భావి నిర్మాతలు. వారి భవిష్యత్తును ధ్వంసం చేయటం అంటే మన భవితను మనం ధ్వంసం చేసుకోవటమే అవుతుంది.

ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం

బిజెపి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు లూటీకి గురవుతున్నా ప్రధాని నోటి నుండి ఒక్క మాట కూడా లేదు. 2014-19 మధ్య కాలంలో కార్పొరేట్ సంస్థలు తీసుకున్న రుణాలు నాలుగు రెట్లు పెరిగాయి. రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకుండా విదేశాలకు పారిపోయిన వారిని వెనక్కి తీసుకు వస్తానని ప్రధాని ఆర్భాటంగా హామీ ఇచ్చేశారు. ఇప్పటి వరకూ ఒక్కరంటే ఒక్కరిని కూడా వెనక్కి తీసుకురాలేదు. వారు తీసుకున్న రుణాలకు వారి ఆస్తులను జప్తు చేయటానికి బదులుగా బిజెపి సర్కారు కార్పొరేట్ రుణాలను క్రమపద్ధతిలో మాఫీ చేస్తోంది. ఈ అనుత్పాదక ఆస్తుల (ఎన్‌పిఎ)లను రుణాలను తీసుకుని ఎగ్గొట్టిన సంస్థలకే వేలం ద్వారా కట్టబెడుతున్నారు. దీనిని కోతలుపెట్టే విధానంగా చెప్పవచ్చు. ఈ విధానంలో కార్పొరేట్ సంస్థలు బ్యాంకులకు తాకట్టు పెట్టిన ఆస్తులను వాటి విలువ కన్నా 20 శాతం తక్కువగా కొనుగోలు చేసేందుకు ఆ సంస్థలకు సహకరించాలని ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకులపై ఒత్తిడి తెస్తోంది. ఈ కోతలు పెట్టే విధానం ద్వారా ప్రధాని, ఆయన ప్రభుత్వ పెద్దలే ప్రధాన లబ్ధిదారులుగా మారుతున్నారు. అడ్డూ, అదుపూ లేకుండా ఇలా రుణాలిచ్చిన బ్యాంకులు ఇప్పుడు సంక్షోభ పరిస్థితుల్లో కూరుకుపోయాయి. ఈ బ్యాంకులకు పెట్టుబడులు సమకూర్చేందుకు ప్రభుత్వం భారీయెత్తున ప్రజాధనాన్ని వెచ్చిస్తోంది. ఈ రుణాలను మంజూరు చేయటం ద్వారా బ్యాంకుల్లో వున్న కోట్లాది మంది ప్రజల డిపాజిట్లను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టారు. ఇప్పుడు బ్యాంకులకు పెట్టుబడులు పెట్టటం ద్వారా మరోసారి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు.

ప్రభుత్వ రంగ బ్యాంకులు లూటీకి గురవుతున్నా ప్రధాని నోటి నుండి ఒక్క మాట కూడా లేదు. 2014-19 మధ్య కాలంలో కార్పొరేట్ సంస్థలు తీసుకున్న రుణాలు నాలుగు రెట్లు పెరిగాయి. రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకుండా విదేశాలకు పారిపోయిన వారిని వెనక్కి తీసుకు వస్తానని ప్రధాని ఆర్భాటంగా హామీ ఇచ్చేశారు. ఇప్పటి వరకూ ఒక్కరంటే ఒక్కరిని కూడా వెనక్కి తీసుకురాలేదు.

రాఫెల్ కుంభకోణం

వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన రాఫెల్ ఒప్పందాన్ని సమర్ధించుకుంటున్న ప్రధాని సుప్రీంకోర్టు ఈ ఒప్పందానికి క్లీన్ చిట్ ఇచ్చిందని, అందువల్ల ఇందులో ఎటువంటి అవినీతి, కుంభకోణానికి ఆస్కారం లేదని చెబుతున్నారు. ఇది అత్యంత స్వచ్ఛమైన ఒప్పందమని, ఇందులో ముడుపులు చెల్లించేందుకు డబ్బు ప్రమేయం లేదని అంటున్నారు. రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు ప్రధాని, ఆయన ప్రభుత్వం ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రవేశపెడుతూ చట్టాలను సవరించిన నేపథ్యంలో ముడుపుల చెల్లింపు బాగోతాల జాడలు ఎవరికీ అందవు. ఎవరైనా ఈ బాండ్లను బ్యాంకు నుండి కొనుగోలు చేసి ఒక రాజకీయ పార్టీకి ఇవ్వొచ్చు. వారు బ్యాంకు నుండి దానిని నగదుగా మార్చుకోవచ్చు. ఇందులో ఎటువంటి ప్రశ్నలకు, జవాబులకు తావుండదు. ఈ విధానం ద్వారా ప్రధాని, ఆయన ప్రభుత్వం అవినీతిని చట్టబద్ధం చేశారు. ఈ కుంభకోణంలో ప్రధాన లబ్ధిదారు బిజెపి యే. ఈ పార్టీకి తొలి దశలోనే బ్యాంకులు జారీ చేసిన దాదాపు రు.222 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లలో రు.210 కోట్ల విలువైన బాండ్లు (94.5 శాతం) అందాయి. రాఫెల్ కుంభకోణంలో తన పాత్రేమీ లేదని చెబుతున్న ప్రధాని, దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జెపిసి) విచారణ జరిపేందుకు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? ఈ ఒప్పందంలో ఎటువంటి అవినీతీ లేదని ధీమాగా వున్నపుడు జెపిసి విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు? పార్లమెంట్, ప్రజలకు తెలియని సమాచారాన్ని తొక్కిపెట్టినందు వల్లే ఇటు ప్రధాని, అటు బిజెపి జెపిసి విచారణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్న విషయం రుజువవుతోంది.

(ముగింపు రేపు)

విశ్లేషణ

బి తులసీదాస్

'బ్యాంకు' బాటలో విద్యుత్ రంగం!

విద్యుత్ వినియోగదారుల నుండి వసూలు చేయవలసిన ఛార్జీలను నిర్ణయించడానికి ముందుగా రెగ్యులేటరీ కమిషన్ ఏటా నిర్వహించే బహిరంగ విచారణ (పబ్లిక్ హియరింగ్) సోమవారం (జనవరి 7) విశాఖలో ప్రారంభం కానుంది. విజయవాడలో 8న, తిరుపతిలో 9న, చివరిగా హైదరాబాద్‌లో 18న ఈ ప్రక్రియ ముగుస్తుంది. వార్షిక ఆదాయ అవసరాల (యాగ్రిగేట్ రెవెన్యూ రిక్వైర్‌మెంట్-ఎఆర్ఆర్) నివేదికలను నవంబర్ 24న రెండు విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కామ్)లు సమర్పించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన శ్వేత పత్రాల్లో మౌలిక వసతుల పత్రంలో భాగంగా విద్యుత్ రంగంపై సుదీర్ఘ వివరణ ఇచ్చింది. వాటిలో ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలను ప్రశంసించడమేగాక రెండో దశ అమలు చేస్తామని ప్రకటించింది. చంద్రబాబు నాయుడు 2000 సంవత్సరంలో అమలు చేసిన విద్యుత్ సంస్కరణలు, బషీర్‌బాగ్ కాల్పులు, ముగ్గురు యువకుల బలిదానమే 2004లో టిడిపి ఓటమికి బాటలు వేసిన విషయం అందరికీ తెలిసిందే! అయినా రెండవ దశ సంస్కరణల గురించి పేర్కొన్నారంటే చంద్రబాబుకూ ప్రపంచ బ్యాంకుకూ వున్న పేగుబంధం ఎంత బలమైనదో విదితమవుతుంది.

ఎన్నికల ప్రయోజనాల కోసమా?

రైల్వే ట్రాక్షన్‌కు స్వల్ప పెంపుదల, గ్రామీణ నర్సరీలకు ఉచిత విద్యుత్, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్లకు కొన్ని రాయితీలు వంటివి తప్ప గత ఏడాదిలాగానే కొత్త ఛార్జీలు వుంటాయని, దాని వల్ల ఒక కోటి 76 లక్షల మంది వినియోగదారులపై ఎలాంటి అదనపు భారం పడదని ఎఆర్ఆర్‌లలో డిస్కామ్‌లు పేర్కొన్నాయి. రానున్న ఏడాది తమకు రూ.38,204 కోట్లు అవసరమని, ఆదాయం రూ.29,241 కోట్లు లభించగలదని అంచనా వేశారు. అయితే, భారీ లోటు రూ.8,963 కోట్లను ఎలా భర్తీ చేయనున్నారో మాత్రం తెలపలేదు. అలాగే వచ్చే ఏడాదిలో 68,583 మిలియన్ యూనిట్లు అందుబాటులో వుంటుందని, వినియోగ అవసరం 67,713 మి.యూ. కాబట్టి 870 మి.యూ. మిగులు తేలుతుందని డిస్కామ్‌లు పేర్కొన్నాయి.

భారీ ఆదాయ లోటు చూపిన డిస్కామ్‌లు, భర్తీపై పల్లెత్తు మాట్లాడలేదు. ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందా లేక ట్రూ అప్ ఛార్జీల పేరిట వచ్చే ఏడాది వడ్డిస్తారా? స్పష్టం చేయలేదు. గతంలో కాంగ్రెస్ పరిపాలనా కాలంలో ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్‌ఛార్జి సర్దుబాటు వంటి పేర్లతో దొడ్డిదారిన భారాలు వేసిన చరిత్ర మరచిపోలేం. ప్రజల ఒత్తిడితో ఇంధన సర్‌ఛార్జి వడ్డనకు ఇప్పుడు అవకాశం లేకుండా పోయింది కాని ట్రూ అప్ ఛార్జి, రెగ్యులేటరీ అసెట్ లాంటి పేర్లతో భారాలు మోపే ప్రమాదం పొంచి వుంది. ఎన్నికల ఏడాది కనుక ఛార్జీల పెంపును ప్రతిపాదించలేదని బలమైన వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో డిస్కామ్‌ల లోటును ప్రభుత్వమే భర్తీ చేస్తుందని ముందుగా ప్రకటించాలి. అలా చేయకపోతే ఈ కారణాలతో ఏర్పడే లోటును ఆ తరువాతి సంవత్సరానికి రెగ్యులేటరీ అసెట్‌గా కానీ ట్రూ అప్ ఛార్జీలుగా కానీ అనుమతించబోమని విచారణకు ముందే కమిషన్ స్పష్టంగా ప్రకటించడం అవసరం. లేకపోతే పాలక పార్టీ ఎన్నికల ప్రయోజనాలకు ప్రజలు లేదా డిస్కామ్‌లు బలయ్యే ప్రమాదం ఏర్పడుతుంది.



విద్యుదుత్పత్తి, ప్రసారం, పంపిణీ మూడు పనులనూ ఉమ్మడిగా నిర్వహించే విద్యుత్ బోర్డులను ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలతో మూడు ముక్కలు చేశారు. తొలి దశలో ఉత్పత్తి రంగం ద్వారా ప్రైవేటు కంపెనీలకు లబ్ధి చేకూరింది. పిపిఎల మోసమంతా అదే! ప్రసారంలో మిగిలేదేమీ వుండదు కాబట్టి పంపిణీ రంగాన్ని చేజిక్కించుకోవడానికి ప్రైవేటు శక్తులు ప్రయత్నిస్తున్నాయి. రెండో దశ సంస్కరణల పేరిట రాష్ట్ర ప్రభుత్వం అందుకు రంగం సిద్ధం చేస్తోంది.

ప్రైవేటుకు లబ్ధి చేకూర్చడానికే !

విద్యుత్ అందుబాటు తక్కువగానూ, వినియోగ అవసరాన్ని ఎక్కువగా చూపారని విద్యుత్ రంగ నిపుణుడు ఎం వేణుగోపాలరావు సోదాహరణంగా వివరించారు. ఎఆర్ఆర్‌లలో డిస్కామ్‌లు ఇలా చూపడం, వాటిని రెగ్యులేటరీ కమిషన్ సవరించడం, ఏడాది ముగిసేసరికి ఇంకా వాస్తవ దూరంగా వుండడం గత పది పదిహేనేళ్లుగా జరుగుతున్నదేనని అంటున్నారు. డిస్కామ్‌లు, ఎ.పి ట్రాన్స్‌కో ఇటీవల రెగ్యులేటరీ కమిషన్‌కు సమర్పించిన దీర్ఘ కాలిక విద్యుత్ ప్రసార పంపిణీ అంచనా (లాంగ్ టెర్మ్ లోడ్ ఫోర్‌కాస్ట్) నివేదికల్లో 2019-20లో 77,998 మి.యూ. అందుబాటులో వుంటుందని, వినియోగ అవసరం 66,313 మి.యూ. పోను 11,685 మి.యూ. మిగులుంటుందని పేర్కొన్నారు. మరి ఇంతలోనే అంచనాలన్నీ ఎలా తారుమారయ్యాయన్నది పెద్ద ప్రశ్న. వాస్తవానికి ఇవి కూడా సరి కాదనీ, హిందుజా, సింహపురి వంటివి కలిపితే మిగులు 19,376 మి.యూ. వుండవచ్చని వేణుగోపాలరావు అభియోగం. గ్యాస్ ఆధారిత జివికె, వేమగిరి, గౌతమి, కోనసీమ తదితర ప్లాంట్లకు ముడిసరుకు లేక ఉత్పత్తి నిలిచిపోయింది. కేంద్ర ప్రభుత్వం సహజ వాయువును కేటాయిస్తే వాటి నుండి డిస్కామ్‌లు తప్పనిసరిగా కొనుగోలు చేయాలి. లేకపోతే ఫిక్స్‌డ్ ఛార్జీలు చెల్లించవలసి వుంటుంది. ఆ లభ్యతనూ లెక్కిస్తే మిగులు మరింత ఎక్కువగా తేలుతుంది.

మిగులు విద్యుత్ వుందని చెబుతున్న డిస్కామ్‌లు ఇంకా విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పిపిఎ) కుదుర్చుకోని సెంబ్‌కార్ప్ గాయత్రి ప్లాంటు నుండి అప్పటికప్పటి అవసరాల కోసం స్వాపింగ్ ప్రాతిపదికలో 4,121 మి.యూ. కొనుగోలుకు అనుమతించ వలసిందిగా కమిషన్‌ను కోరడం వారికి లబ్ధి చేకూర్చడానికి తప్ప వేరు కాదు. ఇలా అనుమతింపజేయడం ద్వారా అనధికారికంగా పిపిఎను ఆమోదింప జేయడమే అవుతుంది. బహిరంగ మార్కెట్ రేటు కన్నా సెంబ్‌కార్ప్ గాయత్రి చౌకగా విద్యుత్తును ఇస్తుందని డిస్కామ్‌లు పేర్కొనడం మరో తిరకాసు. దేశంలోని అత్యధిక డిస్కామ్‌లు స్వాపింగ్ అవసరాలకు ఏ రోజుకారోజు బహిరంగ వేలంలో కొనుక్కుంటాయి. ఎ.పి డిస్కాములు చెప్పిందే నిజమైతే వేలంలో సెంబ్‌కార్ప్ తక్కువ ధర కోట్ చేస్తే వారి నుండే కొనవచ్చు. చౌకగా విద్యుత్ లభించడమేగాక కొనుగోలు ప్రక్రియ కూడా పారదర్శకంగా జరుగుతుంది. రాజధాని అమరావతి నిర్మాణ కాంట్రాక్టు పొందిన సింగపూర్ కంపెనీలో సెంబ్‌కార్ప్ ముఖ్య భాగస్వామి. అలాగే గాయత్రి, మాజీ ఎంపి సుబ్బిరామిరెడ్డికి చెందిన సంస్థ కావడం గమనార్హం.

ప్రైవేటు కంపెనీల పట్ల అవ్యాజ ప్రేమ కనబరుస్తున్న డిస్కామ్‌లు ఎ.పి జెన్‌కోపై శీత కన్ను వేస్తున్నాయి. జెన్‌కో థర్మల్ విద్యుత్ 2018-19లో 19,937 మి.యూ. అందుబాటులో వుంటుందని కమిషన్ అనుమతిం చింది. 2019-20 లో అదనంగా దామోదరం సంజీవయ్య పవర్ ప్లాంటు మొదటి, రెండవ యూనిట్ల ద్వారా 9,223 మి.యూ. అందుబాటు లోకి రానుంది. దాన్ని కలిపితే 2019-20లో జెన్‌కో థర్మల్ విద్యుత్ 29,160 మి.యూ. అందు బాటులోకి వస్తుంది. కానీ డిస్కామ్‌లు 24,107 మి.యూ.గానే ఎఆర్ఆర్‌లలో పేర్కొన్నాయి. అందుకు ప్రాతిపదిక ఏమిటీ, గణించిన పిఎల్ఎఫ్ ఎంతో కూడా ప్రస్తావించలేదు.

వ్యవసాయం, అనుబంధ రంగాలపై చిన్న చూపు

వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటలపాటు ఉచిత విద్యుత్తు ఇస్తామని 2014 ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన టిడిపి తన నాలుగేళ్ల పాలనలో ఆ పని చేయలేదు. తాజాగా శ్వేత పత్రంలో దాన్ని పునరుద్ఘాటించారు. కనుక 2019 ఏప్రిల్ నుండి కనీసం ఆ తొమ్మిది గంటలపాటైనా ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి. అలాగే వ్యవసాయ పంప్‌సెట్ కొత్త కనెక్షన్ల మంజూరు అధ్వానంగా వుంది. అర్హతగల రైతులందరికీ త్వరితగతిన మంజూరు చేసేలా కమిషన్ ఆదేశించాలి. ఉత్తరాంధ్ర, చిత్తూరు జిల్లాల్లో విస్తారంగానూ, ఉభయ గోదావరి జిల్లాల్లో చెరకు నుండి బెల్లం తయారు చేస్తున్నారు. బెల్లం ఉత్పత్తిదారుల్లో అత్యధికులు సన్న, చిన్నకారు రైతులు, కౌలుదార్లే. బెల్లం క్రషింగ్ విశాఖ జిల్లాలో ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వం బెల్లం క్రషర్లను పరిశ్రమగా పరిగణించి, ఫిక్స్‌డ్ ఛార్జి కిలోవాట్‌కు రూ.30, ఎనర్జీ ఛార్జిగా యూనిట్‌కు రూ.3.70 వసూలు చేస్తోంది. ప్రభుత్వం గత ఏడాది హార్టికల్చర్ నర్సరీలకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతోపాటు పాత బకాయి రూ.2.8 కోట్లు మాఫీ చేసింది. బెల్లం క్రషర్లకూ ఉచిత విద్యుత్ ఇవ్వాలి.

పేద, మధ్యతరగతి వారిపై భారం

వాణిజ్యం, పరిశ్రమలు వంటి రంగాలకు ఎక్కువ రేటు నిర్ణయించి, గృహ వినియోగదారులకు తక్కువ రేటుకు విద్యుత్తునివ్వడం దేశంలో అనాదిగా వస్తున్న విధానం. అలాగే తక్కువ విద్యుత్ వినియోగించే సామాన్యులకు చౌకగానూ, అధిక విద్యుత్ వాడే వారికి ఎక్కువ రేటు నిర్ణయిస్తారు. ఇదే 'క్రాస్ సబ్సిడైజేషన్'. ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలు వచ్చాక క్రాస్ సబ్సిడీ తగ్గుతూ వస్తోంది. ఇప్పటి ప్రతిపాదనల్లో కూడా మధ్యతరగతి వారికి మోయలేనంత భారం పడింది. గృహ వినియోగదారుల నుండి ఇపిడిసిఎల్ పొందే ఆదాయం క్యాటగిరీ ఎ (నెలకు 75 యూనిట్లు) వారి నుండి రూ.488 కోట్లు, క్యాటగిరీ బి (నెలకు 75పైన, 225 యూనిట్ల లోపు) వారి నుండి రూ.1,101 కోట్లు, క్యాటగిరీ సి (నెలకు 225 యూనిట్లకు పైన) వారి నుండి రూ.526 కోట్లు లభిస్తుందని అంచనా వేశారు. పేద, మధ్యతరగతి, ఉన్నత తరగతి వారిగా ఎ,బి,సి క్యాటగిరీలను వర్గీకరించవచ్చు. కాబట్టి డిస్కామ్‌లకు గృహ వినియోగదారుల్లో మధ్యతరగతి వారి నుండే అధికంగా లభిస్తోందని స్పష్టమవుతోంది.

నాలుగేళ్ల క్రితం నిర్ణయించిన వర్గీకరణ ప్రాతిపదకను మారిన పరిస్థితులకు అనుగుణంగా మార్చాలి. రాష్ట్ర తలసరి విద్యుత్ వినియోగం 2013-14లో 957 యూనిట్లున్నది. 2018-19కి 1,174 యూనిట్లకు పెరిగిందని శ్వేతపత్రంలో పేర్కొన్నారు. దేశ తలసరి వినియోగం 2015-16 లో 1,075 యూనిట్లున్నది. 2017-18లో 1,1149 యూనిట్లకు పెరిగిందని కేంద్ర విద్యుత్ అథారిటీ పేర్కొంది. ప్రజల జీవన శైలి, అవసరాలు మారుతున్న నేపథ్యంలో వర్గీకరణనూ సవరించడం అవశ్యం. నెలకు 100 యూనిట్లు వాడే వారిని క్యాటగిరీ ఎగా, 250 యూనిట్ల లోపు వాడే వారిని బిగా, ఆపై వారిని సిగా వర్గీకరించడం సబబుగా వుంటుంది. పేదరిక రేఖ (బిపిఎల్), ఒబిసిలకు క్రీమీ లేయర్ వంటివి నిర్ణయించడానికి ఆదాయ పరిమితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు మార్చుతుంటాయి. అలాగే ఈ వర్గీకరణను పునర్నిర్ణయించడం రెగ్యులేటరీ కమిషన్ బాధ్యతగా భావించాలి. తద్వారా పేద, దిగువ మధ్యతరగతి వారికి కొద్దిగా ఊరట లభిస్తుంది.

విద్యుదుత్పత్తి, ప్రసారం, పంపిణీ మూడు పనులనూ ఉమ్మడిగా నిర్వహించే విద్యుత్ బోర్డులను ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలతో మూడు ముక్కలు చేశారు. తొలి దశలో ఉత్పత్తి రంగం ద్వారా ప్రైవేటు కంపెనీలకు లబ్ధి చేకూరింది. పిపిఎల మోసమంతా అదే! ప్రసారంలో మిగిలేదేమీ వుండదు కాబట్టి పంపిణీ రంగాన్ని చేజిక్కించుకోవడానికి ప్రైవేటు శక్తులు ప్రయత్నిస్తున్నాయి. రెండో దశ సంస్కరణల పేరిట రాష్ట్ర ప్రభుత్వం అందుకు రంగం సిద్ధం చేస్తోంది. ప్రజానీకం అప్రమత్తమై ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవాలి. కొత్త భారాలు పడకుండా ఎదుర్కోవాలి.

జనవాక్యం

లౌకికవాద ఆచరణ కోసం...

దేశం మూఢ నమ్మకాల విష కౌగిలిలో కూరుకుపోయి వుంది. ఈ రకమైన సామాజిక రుగ్మతలను రూపుమాపి దేశాన్ని ముందుకు తీసుకుపోవాల్సిన ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఈమధ్య జరిగిన సంఘటనలు బట్టి ఊహించవచ్చు. రాజ్యాంగంలో రాసుకున్న లౌకికవాదం దారి తప్పుతోంది. ఆర్టికల్ 51(ఏ)లో రాసుకున్న సుత్రాలను అమలు పరుస్తామని చెప్పి ప్రమాణం చేసిన మన నాయకుల ప్రమాణాలు నీటి మూటలయ్యాయి. కాలం చెల్లిన మూఢ నమ్మకాలను కొన్ని సంఘాలు తెరపైకి తెస్తున్నాయి. వాటికి వ్యతిరేకంగా అభ్యుదయ సంఘాలన్నీ పోరాడాల్సిన అవసరం వుంది. ఈ నేపథ్యంలో సామాజిక రుగ్మతల నిర్మూలనతోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్న లక్ష్యంతో దేశంలో సుమారు 60 హేతువాద, నాస్తిక, మానవవాద, సైన్సు వాద సంఘాలు పని చేస్తున్నాయి. వాటి ఆధ్వర్యంలో ఈ నెల 5 ,6 తేదీలలో విశాఖపట్నం, స్టీల్ ప్లాంట్‌లో జాతీయ హేతువాద సంఘాల సమాఖ్య (ఫిరా) 11వ మహాసభ లను నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనే సంఘాలు అన్నీ కొన్ని సంవత్స రాలుగా మూఢ నమ్మకాల నిర్మూలనా చట్టం కావాలని పోరాడు తున్నాయి. భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న ఆచారాలు కలిగిన మన దేశానికి లౌకికవాద ఆచరణే సరైన పరిష్కారం.

ఏపి హేతువాద సంఘం.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

ఉల్లికాడతో.. ఉపయోగాలు



గుండె, రక్తనాళాలకు ఉల్లికాడలు బాగా ఉపయోగపడతాయి. ఇవి కొలెస్ట్రాల్ ఆక్సీకరణను తగ్గిస్తాయి. దీనిలో పుష్కలంగా ఉండే సల్ఫర్ కాంపౌండ్ బ్లడ్ ప్రెజర్ స్థాయిలను నియంత్రించడానికి, తగ్గించడానికి సహాయపడుతుంది. ఉల్లికాడలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి సహాయపడతాయి. అజీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందటానికి అవసరమైన యాంటి బ్యాక్టీరియల్ లక్షణాలనూ అందిస్తాయి. దీనిలో ఉండే సి విటమిన్ వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. ఉల్లికాడల్లో ఉండే పెక్టిన్ (నీటిలో కరిగే కొల్లాయిడల్ కార్బోహైడ్రేట్) ముఖ్యంగా పెద్ద పేగు కాన్సర్ వృద్ధి చెందకుండా కాపాడుతుంది. ఇవి కీళ్ళనొప్పులు, ఉబ్బసం చికిత్సకు బాగా ఉపయోగపడతాయి. ఉల్లికాడల్లో ఉన్న క్రోమియం కంటెంట్ మధుమేహం నుంచి కాపాడుతుంది. ఇది బ్లడ్ షుగర్‌ను నియంత్రిస్తుంది. శరీరంలో గ్లూకోజ్ శక్తిని పెంచుతుంది. దీనిలో ఉండే యాంటీ-బ్యాక్టీరియల్ లక్షణం జలుబు, జ్వరానికి వ్యతిరేకంగా పోరాడేందుకు సహకరిస్తుంది. అంతేకాదు దీనిలోని స్థూలపోషకాలు జీవక్రియ నియంత్రణకు మంచి ఆహారంగా ఉపయోగపడతాయి. కళ్ళ జబ్బులు, కాళ్ళ సమస్యలు ఉన్నవాళ్లు ఉల్లికాడలు తినడం మంచిది. దీనిలో ఉండే అల్లిసిన్ చర్మానికి మంచి చేస్తుంది. చర్మం ముడతలు పడకుండా కాపాడుతుంది.


తననెలా కాపాడాలి?

స్నేహిత

చిన్నప్పటి నుంచి ఒక ఫ్రెండ్ ఉండేది. మా ఇద్దరి మధ్యా ఎలాంటి రహస్యాలూ ఉండవు. ప్రస్తుతం మేము పిజి చేస్తున్నాం. ఈ మధ్య ఎందుకో తెలియదు తను నాతో చాలా తక్కువగా మాట్లాడుతోంది. ఒంటరిగా ఉండటానికే ఎక్కువగా ఇష్టపడుతోంది. ఏమైందని అడిగితే పెద్దగా కేకలేసి నీకెందుకు? నా విషయం అంటూ ఏడ్చేస్తోంది. అసలేమయ్యిందోనని భయంగా ఉంది.

- ఓ సోదరి


ఎంత స్నేహితులైనా.. ఎవరికైనా కొంత వ్యక్తిగతమైన పరిధులు ఉంటాయి. ఆ పరిధిలో తామున్నామనే విషయం కొంతమందికి అంత త్వరగా అర్థం కాదు. మీరు ఉన్నటువంటి వయస్సునుబట్టి వచ్చే మార్పులు ఒక్కోసారి మీ ఇద్దరి పరిణతికి మించినవి కావచ్చు. ఉదాహరణకు ఆమె మనసులోని బాధేంటి? మీతో చెప్పుకోలేకపోవడానికి కారణాలేమిటి?



అనేది ఇంతకాలం చూసిన వ్యక్తిత్వ ధోరణిని బట్టి అంచనా వేయడానికి ప్రయత్నం చేయండి. తనకు ఎంతో సన్నిహితంగా ఉండే మీకూ చెప్పుకోలేని సమస్యలు తనకు ఏమున్నాయి? ఎలాంటి విషయాలైతే తను సర్వసాధారణంగా ఇతరులతో పంచుకోవడానికి ఇష్టపడదు అనేది మీరు ఒక అంచనా వేయండి. వ్యక్తిగత జీవితంలోనూ ఎన్నో విషయాలు పంచుకున్నాగానీ, పంచుకోలేని విషయాలూ ఉంటాయి. ఉదాహరణకు కుటుంబానికి, ఆస్తిపాస్తులకు, మనసుకు సంబంధించిన విషయాలు కావచ్చు. చెప్పదలచుకోనప్పుడు ఆమెను ఇబ్బంది పెట్టకుండా తన ఇష్టాయిష్టాలకు విలువనిస్తున్నట్లు ప్రవర్తించండి. తనకు చెప్పాలనిపించినప్పుడు విషయాన్ని విని, తనకు అండగా మీరున్నారనే ఓదార్పును ఇవ్వండి. అలాగనుక మీరు చేస్తే తన మనసుకు కొంత ఊరట కలుగుతుంది. నలుగురితో సరదాగా ఉండే మనిషైతే ఎందుకు ఉన్నట్లుండి అలా ముడుచుకుపోయింది అనేది తెలుసుకోండి. ఏ కోణంలో సహాయం చేయవచ్చో గమనించండి. అవసరమైతే తనకు అత్యంత ఆప్తులు, సన్నిహితులు, కుటుంబసభ్యుల అండదండలతో తగిన సహాయం అందేట్లుగా చూసుకోండి. ఇంకా అవసరమనుకుంటే మానసిక నిపుణుల సహాయం కూడా తీసుకోండి. ఏదేమైనా ఒంటరిగా ఉండటం, పెద్దగా ఏడ్వటం లాంటివి ఆమెలో ఉన్న నిరాశ, నిస్పృహలకు సూచికలుగా మీరు భావించండి. తనకు వీలైనంత త్వరగా సహాయం చేయడానికి ప్రయత్నించండి.



డాక్టర్ పద్మజ, సైకాలజిస్టు



వాళ్లిద్దరూ ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. పిల్లలు పెద్దవాళ్లు అయ్యాక అతనికి ఆమెపై అనుమానం మొదలైంది. ఆ అనుమానమే వారిద్దరి మధ్య తీవ్ర విభేదాలకు దారితీసింది. ఫలితంగా అతను భార్యను, పిల్లల్ని ఇంట్లోంచి పంపేశాడు. ఎప్పటికైనా తమని కలుపుకుపోతాడా అని ఆమె పిల్లల్ని పెంచి, పెద్ద చేసింది. అనూహ్యంగా అతను వేరొకామెను పెళ్లి చేసుకుంటే ఆమె ఏం చేయాలి? విడాకులు కూడా ఆమె తెలియకుండా ఇచ్చేశానంటే ఏం చేయాలి? తన సమస్య పరిష్కరించాలంటూ ఆమె 'ఐద్వా అదాలత్'కు వచ్చింది. చివరకు ఏమైందో తెలుసుకోవాలంటే ఈ వారం 'ఫ్యామిలీ కౌన్సెలింగ్'లోని 'కేస్ స్టడీ' చదవండి.

అనుమానమే అసలు కారణం

ఫ్యామిలీ కౌన్సెలింగ్

ఐద్వా అదాలత్

ఆమె పేరు రత్న, అతని పేరు రాము.

రత్న రామూ వాళ్లింటి పక్కన ఉండే చుట్టాల ఇంటికి వచ్చినప్పుడు పరిచయం.

రామూ రత్నాని చూడగానే ఇష్టపడ్డాడు. అదే విషయం ఆమెతో వెంటనే చెప్పేశాడు. ఆమెకు పదహారేళ్ల వయస్సు.. ప్రేమ అంటే ఏంటో తెలియని స్థితి. రామూకి మాత్రం పాతికేళ్లకు పైనే ఉంటాయి. అతను చూపే ప్రేమకు రత్న వైపు నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది. దాంతో వాళ్ల వాళ్లు వద్దంటున్నా రామూతో వివాహానికి సిద్ధపడింది రత్న. చివరికి రామూ వైపు కుటుంబ సహకారంతో ఇద్దరికీ పెళ్లయిపోయింది. వారి అనుబంధం అన్యోన్యంగా సాగింది. ఇద్దరు పిల్లలూ పుట్టారు. వారిని పెంచి పెద్ద చేయడానికి రామూ తెచ్చే జీతమే సరిపోదు కాబట్టి, తనూ ఓ చిన్న ఉద్యోగం చూసుకుంది రత్న. అలా ఇద్దరూ చిరు సంపాదనలతోనే జీవనం కొనసాగిస్తున్నారు. పిల్లలిద్దరూ టీనేజీకి వచ్చారు. అకస్మాత్తుగా రామూ రత్నను అనుమానించడం మొదలుపెట్టాడు. తను ఆఫీసు నుంచి వచ్చాక ఇంటి వెనుకవైపు వేరే వాళ్ల చెప్పు ఒకటి వేసేసి, ఏమీ ఎరగనట్లు ఇంట్లోకి వచ్చి, నేరుగా ఇంటి వెనుకవైపుకు వెళ్లి, 'ఈ చెప్పు ఎక్కడిది? ఎవరిది? వాడెవడు? నేను వస్తున్నాననీ గోడ దూకి పారిపోయాడా? పారిపోయే క్రమంలో ఒక చెప్పు వదిలేశాడా?' ఇలా ఆమెను ఊపిరాడకుండా ప్రశ్నించి, అనుమానిస్తూ వేధించేవాడు. ఆమె ఉద్యోగానికి వెళ్లాక.. ఒక్కతే వెళుతుందా? ఎవరితోనైనా వెళతుందా? అని కొన్ని రోజులు వెంబడించేవాడు. దీంతో అతను తన ఉద్యోగానికి వెళ్లకపోవడంతో అతని పైఅధికారి మందలించి, భార్యను పిలుచుకు రమ్మన్నారు. అధికారితో రాము చెప్పిన అబద్ధాలు తెలియక, ఆయన అడిగినపుడు రత్న తెల్లమొహం వేసేది. దీంతో ఇంటికి వచ్చాక రామూ కొట్టేవాడు. ఆమెకు మొహంపై నల్ల పొడలాగా వస్తే... 'నీ నడవడి బాగోకే అలా వచ్చింది. నాకూ నీ నుంచే అంటుకుంది. నీకు ఎయిడ్స్' అంటూ గొడవపడ్డాడు. ఆ తర్వాత కూతురు కాలేజీకి వెళ్లి, ఆమెనీ అనుమానిస్తూ మాట్లాడేవాడు. తల్లీకూతుళ్లిద్దరినీ అనుమానించడం, కొడుకుతో వాళ్లు మంచివాళ్లు కాదనీ, తను లేనప్పుడు ఇంటికి ఎవరు వచ్చి వెళుతున్నారో చెప్పమంటూ వత్తిడి చేసేవాడు. అంతేకాకుండా తను వెళ్లడానికి వీలుకానప్పుడు కొడుకుని స్కూలు మాన్పించి మరీ వాళ్లపై నిఘా వేయించేవాడు. ఆ క్రమంలో ఆ అబ్బాయి మానసికంగా ఒత్తిడికి గురై, చదువు మానేశాడు. ఒకరోజు ఎప్పటిలానే భార్యనూ, కూతుర్ని అనుమానిస్తూ కొడుతుంటే, ముగ్గురూ రామూపై తిరగబడ్డారు. దాంతో రత్ననీ, పిల్లల్నీ ఇంట్లోంచి తరిమేశాడు రాము.

అలా వెళ్లిపోయిన రత్న పుట్టింటికి వెళ్లలేక, తోటి ఉద్యోగినుల సహకారంతో ధైర్యంగా పిల్లల్ని పెంచి, పెద్ద చేసింది. మధ్యలో ఒకసారి అడిగిస్తే, రామూ



పిల్లలకి రెండుసార్లు ఫీజులు కట్టాడు. ప్రస్తుతం అమ్మాయికి కూడా పెళ్లి చేసింది. కొడుకు మాత్రం చదువు ఆగిపోవడంతో ఏదో చిన్న చిన్న పనులు చేస్తూ, స్థిరత్వం లేక, తల్లితో కూడా ఉండకుండా ఎక్కడెక్కడో తిరుగుతున్నాడు. రత్న కూతురికి పిల్లలు పుట్టడంతో వాళ్ల వద్దే ఉంటుంది. అక్కడా ఆమె అనేక అవమానాలకు గురవుతుంది. అయితే వయసులో పెద్దదాన్నయ్యానుగా, భర్త ఇప్పుడిక అనుమానించడనీ, అతనితో ఉందామనుకుంది. అతన్ని అడిగితే 'నీకూ నాకూ సంబంధం లేదు. విడాకులు కూడా తీసుకున్నా!' అన్నాడు రాము. దీంతో రత్న అవాక్కైంది. తర్వాత అతని గురించి ఎంక్వయిరీ చేస్తే వేరొకామెతో సంబంధం కలిగి ఉన్నాడని తెలిసింది. ఈ పరిస్థితుల్లో న్యాయం చేయాలని 'ఐద్వా అదాలత్'కు వచ్చింది రత్న. బాధ్యులు పంపిన లేఖ అందుకున్న రాము తర్వాతి వారం వచ్చాడు.

రాము : ఆమె బాగుందని ప్రేమించి పెళ్లి చేసుకున్నా. కానీ ఆమె నడవడిక సరిగా లేదు. అందుకే విడాకులు తీసుకుని, వేరొకామెను పెళ్లి చేసుకున్నా. ఆమెకూ ఇది రెండే పెళ్లే.

రత్న : అతనికీ నాకూ విడాకులు ఎలా అవుతాయి. నాకసలు విషయం తెలియదుగా?

విడాకులు కాగితాలు తీసుకుని వచ్చేవారం రాముని రమ్మన్నారు బాధ్యులు. పైవారం రాము విడాకులు కాగితాలు తెచ్చాడు. అవి చూశాక నిర్ధారణ చేసుకున్నారు. అయితే విడాకులు ఏకపక్షంగా అయిపోయాయి. దీంతో రత్న షాక్ గురైంది. కొద్దిసేపటికి తేరుకుని, కన్నీళ్లు పెట్టుకుంటూ పిల్లలతో మాట్లాడుకుని, మళ్లీ వస్తానని సమయం కోరింది. రెండు వారాల తర్వాత రాము ప్రస్తుత భార్యతోనూ, రత్న తన సోదరి, బావలతోనూ వచ్చారు.

ఆమెకు తెలియకుండా ఏకపక్షంగా విడాకులు పొందడం సరైంది కాదు. ఆమె న్యాయం కోసం మళ్లీ కోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఆమెను మీరూ చూడక, కొడుకూ చూడక, ఆమె పరిస్థితి దారుణంగా ఉంది.

రత్న : నాకు అతని పెన్షన్‌లో సగం ఇప్పించండి. ఇల్లు బాబు పేరు మీద రాయమనండి.

రాము : నాకు వచ్చేది చాలా తక్కువ. నాకిప్పుడు అరవై ఏళ్లు. నా ఆరోగ్యమూ బాగోవడం లేదు. నా భార్య ఆరోగ్యం బాగోదు. మా మందులకే చాలా ఖర్చవుతుంది. ఏదో చిన్న షాపు పెట్టుకున్నాం గానీ, అదీ సరిగా నడవడం లేదు. ఒక పాతికవేలు ఇస్తాను. ఇల్లు విషయం ఇప్పుడే ఏమీ చెప్పను. నన్ను చివరిదశలో ఎవరు చూస్తే వారికిస్తాను.

అందుకు రత్న ఒప్పుకోలేదు.

బాధ్యులు ఏమన్నారంటే ...

రామూ! ఆమెకు తెలియకుండా ఏకపక్షంగా విడాకులు పొందడం సరైంది కాదు. ఆమె న్యాయం కోసం మళ్లీ కోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు. పైగా మీరు ఆమెను అనుమానించి, ఎయిడ్స్ అని గెంటేశారు. కానీ లాయరుకు ఆమే మిమ్మల్ని ఎయిడ్స్ అని అనుమానించినట్లు, గెంటేసినట్లు అబద్ధం చెప్పారు. ఇవన్నీ చూస్తుంటే రత్నకు చాలా అన్యాయం జరిగింది. ప్రస్తుతం ఆమెను మీరూ చూడక, కొడుకూ చూడక, ఆమె పరిస్థితి దారుణంగా ఉంది. ఆమె దగ్గర ఏమీ లేదు కాబట్టే కూతురు ఇంట్లో అవమానాలు ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో ఆమెకు మీరు న్యాయం చేయాలి. ఆమె కోరింది కూడా న్యాయంగానే ఉంది.

రాము : ఆలోచించుకుని చెప్తాను. కాస్త సమయం ఇవ్వండి.

బాధ్యులు ఒప్పుకోవడంతో రెండు వారాల తర్వాత వచ్చారు.

రాము : నా పెన్షన్‌లో సగం ఎలా ఇస్తాను. మూడు వాటాలు వేయాలి. పెన్షన్ ఇవ్వకుండా నేను నా పళ్ల కోసం లక్ష రూపాయలు దాచుకున్నా. అవి ఇచ్చేస్తా. ఇక నా జోలికి రావద్దని చెప్పండి.

బాధ్యులు : అదేమీ కాదు మీ పెన్షన్ మూడు వాటాలు వేసి, ఆమెకు నెలకు 5 వేలు పంపించండి. ఆ లక్ష రూపాయలు కూడా ఇవ్వండి. ఇవి కూడా ఆమెకు చేసిన అన్యాయాన్ని మాత్రం తీర్చలేనివే. అలాగే ఇల్లు మీ తదనంతరం పిల్లలకు చెందేలా రాసివ్వండి.

రామూ బాధ్యులు చెప్పినదానికి అంగీకరించాడు. ఆమె అకౌంటు నెంబరు ఇస్తే, బ్యాంకులో నెల నెలా ఐదువేలు వేస్తానన్నాడు. ఫిబ్రవరి నెలాఖరుకు ఆమెకు లక్ష రూపాయలు తెచ్చిస్తానన్నాడు.


రత్న కూడా అందుకు అంగీకరించడంతో బాధ్యులు ఆ మేరకు ఒప్పందం రిజిష్టర్‌లో రాసి, ఇద్దరితో సంతకాలు చేయించారు.

- శాంతిశ్రీ

అడ్రస్
కుటుంబ న్యాయ సలహా కేంద్రం
మోటూరు ఉదయం ట్రస్టు
ఎంబి భవన్ హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఫోన్ 9494383220

మీకోసం

చర్మంపై ఉల్లిపాయ రసం రాస్తుంటే చర్మం మృదువుగా, పగలకుండా ఉంటుంది.




జీవన సౌరభం

నమ్మకముంటే మౌనం కూడా అర్థమవుతుంది. నమ్మకం లేకపోతే ప్రతి మాట అపార్థమవుతుంది.

బహుమతి పొందిన ముగ్గు



వై. పవిత్ర, పంత్రంపల్లి, చిత్తూరు.



23 చుక్కలు
1 వచ్చేవరకు



17 చుక్కలు
1 వచ్చేవరకు
సరిచుక్క



ఎ.జ్యోతి, మొగల్రాజపురం. విజయవాడ.

మా చిరునామా:
'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇమెయిల్: jeevanapageps@gmail.com ఆదివారం మినహా ఉ.12 గం. సా.6 గం. మధ్య ఫోన్ నెం. 9490099006కు సంప్రదించండి.

శ్వాసకోశ సమస్యలు.. నివారణ ఇలా!

చలికాలంలో ఎవరికైనా దగ్గు, జలుబు, ఫ్లూ జ్వరం వంటి శ్వాసకోశ సమస్యలు చాలా సహజంగా వస్తుంటాయి. ఇక ఆస్తమా ఉన్నవారికి ఈ సీజన్‌లో ఊపిరాడనివ్వదు. ఈ సమస్యలతో బాధపడేవారు కొన్నిరకాల ఆహారాలను తీసుకుంటే ఆయా సమస్యల నుంచి ఉపశమనం పొంది, హాయిగా ఊపిరి పీల్చుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.



- విటమిన్ డి ఉన్న కోడిగుడ్డు పచ్చసొన, తృణ ధాన్యాలు, పాలు, పెరుగు, చేపలు ఈ సీజన్లో తింటే శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ ఆహారాలు శ్వాసకోశ సమస్యలపై ప్రభావం చూపిస్తాయి. యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉండడం వల్ల దగ్గు, జలుబు, ఫ్లూ జ్వరం, ఆస్తమా వంటివి తగ్గుతాయి. శ్వాస సరిగ్గా ఆడుతుంది.
- రోజూ కనీసం 30 నుంచి 60 నిమిషాల పాటు ఉదయాన్నే ఎండలో ఉండాలి. దీంతో శరీరంలో విటమిన్ డి లెవల్స్ పెరుగుతాయి. శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే క్యారెట్లు, చికెన్ తదితర ఆహారాలను తీసుకున్నా శ్వాస కోశ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. వీటిలో ఉండే విటమిన్ సి, ఎ, ఇ, పాలిఫినాల్స్ శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఇన్‌ఫెక్షన్ల నుంచి మనల్ని రక్షిస్తాయి.
- కొలిన్ ఎక్కువగా ఉండే పల్లీలు, గుడ్లు, లివర్ తిన్నా శ్వాస కోశ సమస్యల నుంచి తప్పించుకోవచ్చు. ముఖ్యంగా ఆస్తమా ఉన్నవారు ఈ ఆహారాలను తింటే బాగా ఉపశమనం పొందవచ్చు.
- రోజూ రాత్రి ఒక గ్లాస్ గోరువెచ్చని పాలల్లో చిటికెడు పసుపు కలిపి, తాగాలి. అలాగే పచ్చి ఉల్లిపాయలను తినాలి. వీటివల్ల శ్వాస ప్రక్రియ సజావుగా సాగుతుంది. శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ★

సెన్సెక్స్ ↑ 181
35,695

నిఫ్టీ ↑ 55
10,727

రూపాయి ↑ 47 పై
అమెరికా డాలరుకు రూ.
69.72



క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ఆధ్వర్యాన విజయవాడలో ఎ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోని శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ కోడెల శివ ప్రసాదరావు ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిటి లివింగ్ కల్చర్‌కి, అక్కడ కల్పించే వసతులకు, అవి అభివృద్ధి చేసే నిర్మాణాల్లో ఉండటానికి అలవాటుపడ్డ జనం, బయటకు వెళ్ళి ఉండటానికి ఇష్టపడట్లేదని అన్నారు. ఈ షో అమ్మకందారులకి, కొనుగోలుదారులకి మంచి వేదికగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, బోండా ఉమామాహేశ్వర రావు, ఎపి క్రెడాయ్ ప్రెసిడెంట్ శివారెడ్డి, ఎపి క్రెడాయ్ జనరల్ సెక్రటరీ సిహెచ్ సుదాకర్, ఎస్‌బిఐ డిజిఎం అరుణ్ కుమార్ సాహు, ఐసిఐసిఐ ఎపి హెడ్ పి రవీంద్రా రెడ్డి, పాల్గొన్నారు. గృహ రుణాలు, గృహోపకరణాలు అందించే 70 కంపెనీలు ఈ షోలో పాల్గొన్నాయని, జనవరి ఆరు వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కేర్‌అండ్‌షేర్ అంబాసిడర్‌గా కబీర్ బేడి



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

దేశంలో సమకాలిన వ్యవస్థకు దూరమైన పిల్లలకు 'స్ట్రీట్2స్కూల్' కార్యక్రమంతో మద్దతిస్తున్న ఇటలీకి చెందిన ఎన్‌జిఒ కేర్ అండ్‌షేర్ ఇటాలియాకు బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటుడు కబీర్ బేడీని ఎంచుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ ప్రెసిడెంట్ టోమసొ కారరో ఈ విషయాన్ని తెలిపారు. బడికి దూరమైన పేద పిల్లలకు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అం దించడానికి తమ సంస్థ కృషి చేస్తుంద న్నారు. తెలుగు రాష్ట్రాల్లోని మురికి వాడలు, దళిత, గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు సాయం అందిస్తుంద న్నారు. ప్రస్తుతం తాము 1500 మంది పిల్లలకు స్పాన్సర్ చేస్తున్నామన్నారు. విజయవాడ కేంద్రంగా తెలుగు రాష్ట్రాల్లో పని చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కబీర్ బేడి, ఆ సంస్థ ప్రతినిధులు స్వాతి మోహంతి, కళామణి పాల్గొన్నారు.

కావాల్సినన్ని రూ.2వేల నోట్లున్నాయి..

న్యూఢిల్లీ : భారత్‌లో అతిపెద్ద కరెన్సీగా ఉన్న రూ.2,000 నోటును రద్దు చేస్తున్నారనే రిపోర్టులపై కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. 2016 నవంబర్‌లో నోట్ల రద్దు తర్వాత రూ.2వేల నోటును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ నోట్లు కావాల్సిన దాని కన్నా ఎక్కువే ప్రభుత్వం వద్ద ఉన్నాయని ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ శుక్రవారం ట్వీట్ చేశారు 2వేల నోటు ముద్రణకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం కావాల్సినంత నోట్లు చెలామణిలో ఉన్నాయన్నారు. ఈ నోటు ముద్రణను ఆపేశారని వస్తున్న వార్తలపై ఆయన నేరుగా సమాధానం ఇవ్వలేదు. అయితే పన్ను ఎగవేతదారులు, నల్లధనం రూపంలో 2వేల నోట్లను దాచుకుంటున్నారని, దాని కోసమే రూ.2వేల నోటు ముద్రణను నిలిపేశారని, ఆ తర్వాత ఆ నోట్లను మళ్లీ బ్యాంకులే తీసుకునేందుకు చర్యలు చేపట్టినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మాత్రం ఇప్పటి వరకు వివరణ ఇవ్వలేదు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రూ.18 లక్షల కోట్ల నగదు చెలామణిలో ఉన్నది. దాంట్లో 37 శాతం, అంటే 6.73 లక్షల కోట్లు రూ.2వేల నోట్ల రూపంలో ఉన్నాయని ప్రభుత్వ గణంకాలు పేర్కొంటున్నాయి. బ్యాంకుల నుంచి వెళ్లిన ఈ పెద్ద నోట్లు అదేస్థాయిలో బ్యాంకులకు తిరిగి చేరటంలేదు. అటువంటి నోట్లన్నీ నల్లధనంగా పోగుపడుతున్నాయన్న ఆందోళనలు పెరుగుతున్న విషయం తెలిసిందే.

గృహ రుణాల్లో ఏపి అగ్రస్థానం

- 40 శాతం వాటా మాదే
- దేశంలోనే టాప్ 10లో విజయవాడ, విశాఖ
- ఎస్‌బిఐ అమరావతి సర్కిల్ సిజిఎం వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొత్తం గృహ రుణాల్లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) 40 శాతం పైగా వాటాతో అగ్రస్థానంలో ఉందని ఆ బ్యాంకు అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ (సిజిఎం) మనీ పల్వేసన్ అన్నారు. ఈ రంగంలో మెరుగైన వృద్ధి రేటు నమోదవుతుందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ మొత్తం ఎస్‌బిఐ కార్యకలాపాల్లో ఎపి రీజియన్ వాటా కీలకంగా ఉందన్నారు. ఇక్కడ రూ.26,367 కోట్ల గృహ రుణాలు జారీ చేశామన్నారు. ఎస్‌బిఐకి ఉన్న 17 సర్కిళ్లలో ముంబయి, బెంగళూరు, చెన్నయ్ సర్కిళ్ల తర్వాత హోమ్ లోన్ల విభాగంలో తమ సర్కిల్ నాలుగో స్థానంలో ఉందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్‌లో ఈ రంగానికి రూ.3398 కోట్ల రుణాలు అందించామన్నారు. 2017-18లో ఈ రంగంలో మెరుగైన వృద్ధిని సాధించామని, ప్రస్తుత ఏడాదిలోనూ కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా దేశంలోని టాప్ 10 నగరాల గృహ రుణాల్లో విజయవాడ, విశాఖపట్నం నగరాలు నమోదయ్యాయని అన్నారు. రాజమండ్రి, తిరుపతి, కర్నూల్ తదితర 10 పట్టణాల్లో కూడా మంచి డిమాండ్ ఉందన్నారు. గత మూడేళ్ల నుంచి ఈ రంగంలో 20 శాతం వృద్ధిని కనబర్చుతున్నామని తెలిపారు.

వ్యవ'సాయం'లోనూ టాప్

మొత్తం రుణాల్లో వ్యవసాయ రంగానికి రూ.25,702 కోట్లు జారీ చేశామన్నారు. ఇందులో క్రాప్ రుణాలు 24.14 శాతం వాటాతో రూ.6,204 కోట్లుగా ఉన్నాయన్నారు. దేశంలోని ఇతర ఎస్‌బిఐ సర్కిళ్ల వ్యవసాయ రుణాలతో పోల్చితే అమరావతి సర్కిల్ అగ్రస్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1379 శాఖలు, 3679 ఎటిఎం కేంద్రాలు కలిగి ఉన్నామన్నారు.

వచ్చే రెండు నెలల్లో కొత్తగా 258 ఎటిఎం కేంద్రాలను అందుబాటులోకి తేనున్నామన్నారు. 16,366 సిబ్బంది సేవలందిస్తున్నాం న్నారు. ఈ సర్కిల్‌లో 13 జిల్లాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం యానం ఉన్నాయి. ఈ సమావేశంలో జనరల్ మేనేజర్ రఘురాం శెట్టి, జిఎం (ఒఎస్‌డి) లక్ష్మన్ రావు, సిడిఒ రామ్ మోహన్ సక్సేనా పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌బిఐ అమరావతి సర్కిల్ సిజిఎం మనీ పల్వేసన్

రూ.1.80 లక్షల కోట్ల వ్యాపారం..

2018 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంకు మొత్తం అడ్వాన్సులు రూ.85,143 కోట్లు, డిపాజిట్లు రూ.95,194 కోట్లకు చేరాయన్నారు. మొత్తంగా రూ.1.80 లక్షల కోట్ల వ్యాపారం కలిగి ఉన్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ నాటికి అడ్వాన్సులు 18.45 శాతం పెరిగి రూ.10, 348 కోట్లుగా, డిపాజిట్లు 10.71 శాతం పెరిగి రూ.7080 కోట్లుగా నమోదయ్యాయయని అన్నారు. ఎస్‌ఎంఇలకు రూ.13,360 కోట్ల అప్పులిచ్చామని చెప్పారు. రూ.14,728 కోట్ల వ్యక్తిగత రుణాల పోర్టుపోలియో కలిగి ఉన్నామన్నారు. స్వయం సహాయక సంఘాలకు రూ.5593 కోట్ల రుణాలిచ్చామన్నారు.

దేశ వ్యాప్తంగా విస్తరిస్తాం ఎయిర్‌వింగ్స్ సిఎండి వెల్లడి

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

బాహ్య ప్రాంతంలో ముఖ్య నేతలు, ఈవెంట్లకు ఎయిర్ కండీషనింగ్ సేవలందించే ఎయిర్‌వింగ్స్ నూతన టెక్నలాజీ ఉత్పాదనలను అందుబాటులోకి తెచ్చింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఎయిర్‌వింగ్స్ సిఎండి వెంకటేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ తాము అందుబాటులోకి తెచ్చిన ఎసిలు సులభంగా ఏర్పాటు చేయడానికి వీలుంటుందన్నారు. తాము జనబాహుళ్యం కలిగిన వివిఐపి సభలు, కార్పొరేట్ ఈవెంట్స్, ప్రదర్శనలు, వివాహాలకు రూఫ్‌టాప్ ఎసిలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎక్కువగా దక్షిణాదిలోనే ఈ సేవలు అందిస్తున్నామన్నారు. దేశ వ్యాప్త విస్తరణకు రూ.7 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనునా న్నిమన్నారు. ఇందుకోసం ఫ్రాంచైజీ పద్ధతిని ఎంచుకోవాలని చూస్తున్నామన్నారు.

మార్కెట్లకు ఉపశమనం

ముంబయి : వరుసగా రెండు రోజులు భారీ నష్టాలు ఎదుర్కొన్న దేశయ స్టాక్ మార్కెట్లకు శుక్రవారం ఉపశమనం లభించింది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ పుంజుకోవడంతో మదుపర్లలో విశ్వాసం పెరిగింది. అదే విధంగా ఇప్పటికే సూచీల ధరలు భారీగా తగ్గడంతో కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో బిఎస్‌ఇ సెన్సెక్స్ 181 పాయింట్లు లేదా 0.51 శాతం పెరిగి 35,695కు చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 55 పాయింట్లు రాణించి 10,727 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో యస్ బ్యాంకు, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, వేదాంత ఎంటర్‌ప్రైజెస్, ఎస్‌బిఐ సూచీలు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు - వర్గీకరణ



టి.ఎం. దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

ఇండియన్ ఎకానమి



మన రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను నిర్దిష్టంగా వర్గీకరించింది. రాష్ట్రాలకు నిర్దేశించిన నిధులు మినహా, మిగిలిన నిధులు (కాన్కరెంట్ లిస్ట్) కేంద్రానికి చెందుతాయి. మన రాజ్యాంగం కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు విధించి, వసూలు చేసిన పన్నులు, సుంకాలను నిర్దేశించింది.

1. కొన్ని పన్నులు విధించి, వసూలు చేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంది.
2. కేంద్రం విధించి, వసూలు చేసుకునే కొన్ని పన్నుల రాబడిని రాష్ట్రాలతో పంచుకోవాల్సి ఉంటుంది.
3. కొన్ని పన్నులు కేంద్రం విధించి, వసూలు చేసినా అవి రాష్ట్రాలకు మాత్రమే చెందుతాయి. మూడో వర్గానికి చెందిన ఈ నిధులకు కేంద్రం రాష్ట్రాలకు గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌గా మంజూరు చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య విత్తవనరుల బదిలీ ఫెడరల్ వ్యవస్థ ముఖ్యలక్షణం.

రాజ్యాంగం ఏడో షెడ్యూల్ ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పన్నుల జాబితా.

కేంద్ర ప్రభుత్వం విధించే పన్నులు

1. వ్యవసాయరంగం తప్పించి, ఇతర ఆదాయాలపై పన్ను.
2. కార్పొరేషన్ పన్ను.
3. కస్టమ్స్ సుంకం.
4. ఆల్కహాల్, కాస్మోటిక్స్ తప్ప ఇతర ఎక్సైజ్ సుంకాలు.
5. ఎస్టేట్ డ్యూటీ, వారసత్వం పన్ను.
6. వ్యవసాయభూమి తప్పించి వ్యక్తులు, సంస్థలకు చెందిన ఇతర ఆస్తులపై పన్ను.
7. స్టాంపు డ్యూటీ మినహాయించి స్టాక్ ఎక్స్ఛేంజ్, భావి మార్కెట్ లావాదేవీలపై పన్ను.
8. విత్త సాధనాల (ఫైనాన్షియల్ డాక్యుమెంట్స్) స్టాంప్‌డ్యూటీ.
9. న్యూస్‌పేపర్లు, అడ్వర్టయిజ్‌మెంట్లు కొనుగోలు, అమ్మకం పన్ను.
10. రైల్వేటిక్కెట్లు, ఫ్రైట్ ఛార్జీల పన్ను.
11. రోడ్డు, రైలు, విమానం, జలరవాణాకు ప్రయాణికులు చెల్లించే అంతిమపన్ను.
12. అంతరాష్ట్ర వాణిజ్యంలో అమ్మకాలు, కొనుగోళ్ల పన్ను.

రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులు

1. భూమిశిస్తు
2. న్యూస్‌పేపర్ మినహాయించి ఇతర వస్తువుల అమ్మకం, కొనుగోళ్ల పన్ను
3. వ్యవసాయ ఆదాయాల పన్ను
4. భూమి, నిర్మాణాల పన్ను
5. వ్యవసాయ భూముల వారసత్వం పన్ను
6. మద్యం విక్రయం, మాదకద్రవ్యాల అమ్మకం పన్ను
7. స్థానిక ప్రాంతాల్లో ప్రవేశించే వస్తువుల పన్ను
8. ఖనిజం వెలికితీత హక్కులపై పన్ను
9. విద్యుత్తు వినియోగం, అమ్మకం పన్ను
10. వాహనాలు, జంతువులు, నౌకల అమ్మకం పన్ను
11. విత్తసాధనాలు మినహాయించి, ఇతర వస్తువుల అమ్మకం పన్ను
12. జలరవాణా పన్ను
13. వినోదం పన్ను
14. సుంకాలు
15. ప్రొఫెషనల్ టాక్స్ (వృత్తి, వాణిజ్యం పన్ను)
16. క్యాపిటేషన్ టాక్స్‌లు
17. న్యూస్ పేపర్లలో అడ్వర్టయిజ్‌మెంట్‌లు ఇతర ప్రకటనల పన్ను

కాన్కరెంట్ జాబితా (ఉమ్మడి జాబితా)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోటార్ వాహనాలు నాన్ జ్యుడీషియల్ స్టాంపులపై విధించే పన్నులు, నాన్ కరెంట్ జాబితాలో వ్యవసాయ భూములపై విధించే ఎక్సైజ్ సుంకం కూడా కాన్కరెంట్ జాబితాలో ఉంది. కాన్కరెంట్ జాబితా అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటికీ అధికారం ఉంటుంది. రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలోకి రాని ఇతర పన్నులపై కేంద్రానికి పూర్తి అధికారం ఉంది.

విత్తసంఘం (ఫైనాన్స్ కమిషన్)

అధికరణం (ఆర్టికల్) 280లో రాష్ట్రపతి ప్రతి ఐదు సంవత్సరాలకూ విత్త సంఘాన్ని ఏర్పాటుచేసి కేంద్ర, రాష్ట్రాల మధ్య విత్త వనరుల బదిలీ, పంపిణీకి (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఫైనాన్షియల్ రిసోర్స్/ డివాల్యూషన్ ఆఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ ఫైనాన్షియల్ రిసోర్స్) చెందిన అంశాల విశ్లేషణ, సూచనలు చేసే అంశాన్ని చర్చిస్తుంది.

విత్త సంఘం ప్రతి ఐదేళ్లకు రాష్ట్రపతి ఏర్పాటు చేసే చట్టబద్ధమైన సంస్థ (స్టాట్యుటరీ బాడీ) రాష్ట్రాల మధ్య కేంద్ర ప్రణాళికేతర విత్త నిధులు పంపిణీకి సూచనలు చేస్తుంది. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రాలకు పన్నుల రాబడి బదిలీకి అనుసరించాల్సిన పంపిణీ నిష్పత్తిని ఈ సంఘం సూచిస్తుంది.

అధికరణం 280 కింద రాష్ట్రపతి ఏర్పాటుచేసే విత్తసంఘం ఈ కింది విధులు నిర్వర్తిస్తుంది.

1. పన్నుల వల్ల సమకూరిన నికర రాబడి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పంపిణీ, అందులో రాష్ట్రాల వాటా నిర్ణయించడం.
2. కేంద్ర, రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్స్, ఇన్ ఎయిడ్ మంజూరుకు నియమాలు రూపొందించడం.
3. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన ఆర్థిక సంబంధాలకు చెందిన ఇతర అంశాల విశ్లేషణ.

ఐదేళ్లకు ఒకసారి ఏర్పాటు చేసే విత్త సంఘం మారుతున్న అవసరాలు, పరిస్థితుల దృష్ట్యా కేంద్రం నిధులు మంజూరు చేసే అవకాశం కల్పించడం వల్ల కేంద్రం నుంచి రాష్ట్రాలకు బదిలీ అయ్యే విత్త వనరులలో వ్యాకోచత్వం ఏర్పడుతుంది. విత్తసంఘం సూచనలను మూడు విధాలుగా వర్గీకరిస్తారు. అవి..

ఎ. ఆదాయ పన్ను, కేంద్ర ఎక్సైజ్ సుంకం, (రాష్ట్ర అమ్మకం పన్ను ఆధారంగా) అదనపు ఎక్సైజ్ సుంకం
బి. గ్రాంట్స్-ఇన్ -ఎయిడ్
సి. రాష్ట్రాలకు కేంద్ర రుణాలు

ఆదాయ పన్ను

రాజ్యాంగం 70వ ప్రకరణం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఆదాయపన్ను విధించి, వసూలు చేసి, రాష్ట్రాలకు బదిలీ చేస్తుంది ఈ పంపిణీ.

1. మొత్తం ఆదాయం పన్ను వసూళ్లలో రాష్ట్రాల వాటా
2. పంపిణీ చేసే వనరుల్లో రాష్ట్రాల వాటా నిర్ణయించే నియమాలు.

గ్రాంట్స్ ఇన్ ఎయిడ్

రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే అభివృద్ధి, సంక్షేమం విధులకు అవసరమైన విత్త వనరుల రాబడి, వ్యయం మధ్య వ్యత్యాసాన్ని కేంద్రం గ్రాంట్స్ ఇన్‌ఎయిడ్ ద్వారా సమకూర్చుతుంది. కేంద్ర, రాష్ట్ర విత్త సంబంధాల్లో గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ ప్రత్యేకస్థానం కలిగి ఉంటుంది. గ్రాంట్స్ ఇన్‌ఎయిడ్ కేంద్ర ప్రభుత్వానికి అంతర్ రాష్ట్ర ఆర్థిక వ్యత్యాసాలు చక్కదిద్ది, రాష్ట్రాల కార్యకలాపాలు నియంత్రించే అధికారం ఇవ్వడంతోపాటు విభిన్న రాష్ట్రాలు చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అనుసంధానం చేసే అవకాశం కల్పిస్తుంది. ఈ దిశలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాల్సిన విధులు నిర్దేశించడం, రాష్ట్ర అంశాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోకపోవడంతోపాటు ప్రణాళికాసంఘం అర్థిక సమన్వయం సాధించడానికి కేంద్ర నిధులలో 75 శాతం రాష్ట్రాలకు పంచాలని డిమాండ్ చేస్తున్నాయి.

నిధుల పంపిణీలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య స్పర్ధ

రాజకీయ సిద్ధాంతపరమైన అభిప్రాయాల్లో తేడాల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య స్పర్ధలు, విభేదాలు తలెత్తకుండా నిధులు బదిలీ చేసే విధంగా రాజ్యాంగ రూపకర్తలు నిబంధనలు రూపొందించారు. ఈ నిధుల మంజూరులో కేంద్రం తన పార్టీ ఆధీనంలో ఉన్న రాష్ట్రాలపై మొగ్గు చూపించడం, నిధులు బదిలీలో బాధ్యతా రాహిత్యం, క్రమశిక్షణ లోపించడం, రాజకీయ ఒత్తిడులు, కేంద్ర అధికార దుర్వినియోగం మొదలైన దుశ్చర్యలు చోటుచేసుకున్నాయి.

జె.కె.థావరాజన్ అధ్యక్షతన కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రిపోర్టు ఆఫ్ టాక్సేషన్ ఎంక్వయిరీ కమిటీ, తమిళనాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజమన్నార్ కమిటీ, వెస్ట్‌బెంగాల్ ప్రభుత్వం అమలు చేసిన డాక్యుమెంట్ ఆన్ సెంటర్, స్టేట్ రిలేషన్ (1978) రాష్ట్రాలకు రాజకీయ ఆర్థిక స్వయం ప్రతిపత్తిని కల్పించే విధంగా కేంద్ర అధికారాలు, విత్త నిధుల పరిధిని గణనీయంగా తగ్గించారు. ★

విత్త సంఘాలు - అధ్యక్షులు

విత్తసంఘం	కాలం	అధ్యక్షులు
మొదటి విత్తసంఘం	1951-56	కె.సి.నియోగి
రెండో విత్తసంఘం	1956-61	కె.ఎ.సంతానం
మూడో విత్తసంఘం	1961-66	ఎ.కె.చందా
నాల్గో విత్తసంఘం	1966-71	పి.వి.రాజమన్నార్
ఐదో విత్తసంఘం	1969-74	మహావీర త్యాగి
ఆరో విత్తసంఘం	1974-79	కాసు బ్రహ్మానందరెడ్డి
ఏడో విత్తసంఘం	1979-85	జె.ఎం.శ్రీలత్
ఎనిమిదో విత్తసంఘం	1985-90	వైబి.చవాన్
తొమ్మిదో విత్తసంఘం	1990-95	ఎన్.కె.పి.సాల్వే
పదో విత్తసంఘం	1995-2౩	కె.సి.పంత్
పదకొండో విత్తసంఘం	2000-05	ప్రొఫెసర్ ఎ.ఎం.ఖుస్రో
పన్నెండో విత్తసంఘం	2005-10	డా.సి.రంగరాజన్
పదమూడోవిత్తసంఘం	2010-15	డా.విజయ్‌కేల్కర్
పద్నాలుగోవిత్తసంఘం	2015-20	వై.వేణుగోపాల్‌రెడ్డి

ఉద్యోగాలు

సౌత్ వెస్ట్రన్ రైల్వేలో 963 ఖాళీలు

హుబ్లిలోని సౌత్ వెస్ట్రన్ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) వివిధ డివిజన్/యూనిట్లలో ఖాళీగా ఉన్న 963 ట్రేడ్ అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

డివిజన్ల వారీ ఖాళీలు: హుబ్లి డివిజన్-287, క్యారేజ్ రిపేర్ వర్క్‌షాప్ (హుబ్లి)-176, బెంగళూరు డివిజన్-280, మైసూర్ డివిజన్-177, సెంట్రల్ వర్క్‌షాప్ (మైసూర్)-43.

ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ప్రోగ్రామింగ్ అండ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్, టర్నర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, స్టెనోగ్రాఫర్ తదితర విభాగాలు.

అర్హత: పోస్టును బట్టి పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత.

వయసు: 15-24 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు: రూ.100 (ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళలకు ఉచితం).

ఎంపిక: అకడమిక్ మార్కుల ఆధారంగా.

దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 16, 2019.

వెబ్‌సైట్: www.rrchubli.in

ఎయిమ్స్-జోధ్‌పూర్‌లో 37 పోస్టులు

జోధ్‌పూర్ (రాజస్థాన్)లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 37 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు: 1. అప్పర్ డివిజన్ క్లర్క్ (యూడీసీ) : 3, **2. డేటా ఎంట్రీ ఆపరేటర్ (డీఈఓ) :** 2, **3. లోయర్ డివిజన్ క్లర్క్ (ఎల్‌డీసీ) :** 32 **అర్హత:** ఇంటర్, డిగ్రీ, ప్రాథమిక కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్ సామర్థ్యం ఉండాలి.

వయసు: పోస్టును బట్టి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీలకు రూ.1000 ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళా అభ్యర్థులకు రూ.200.

ఎంపిక: రాత పరీక్ష ఆధారంగా.

దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 27, 2019

వెబ్‌సైట్: www.aiimsjodhpur.edu.in

ఏపీపీఎస్సీ 308 డిగ్రీ లెక్చరర్లు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 308 డిగ్రీ లెక్చరర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

డిగ్రీ లెక్చరర్లు : 308

అర్హతలు: సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీతో పాటు నెట్/స్లెట్ లేదా పీహెచ్‌డీ ఉత్తీర్ణత.

దరఖాస్తు ప్రారంభ తేదీ: ఫిబ్రవరి 5, 2019.

ఫీజు చెల్లించుటకు చివరి తేదీ: ఫిబ్రవరి 25, 2019.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 26, 2019.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : https://psc.ap.gov.in


నాటకోత్సవం
గుంటూరులో నిర్వహించిన 'కృష్ణరాయబారం' పద్యనాటకంలోని ఓ సన్నివేశం

అభ్యుదయశక్తులు ఏకమవ్వాల్సిన సమయమిదే

సినీ నటులు, నిర్మాత డాక్టర్ మాదాల రవి

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

రాష్ట్రంలో, దేశంలో అభ్యుదయ శక్తులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని సినీ నటులు, నిర్మాత డాక్టర్ మాదాల రవి అన్నారు. గుంటూరు నగరంలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మూడ్రోజులు నిర్వహించే గుంటూరు కళాపరిషత్ 23వ వార్షికోత్సవ నాటకోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కళా పరిషత్ అధ్యక్షులు వల్లూరు తాండవకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవి మాట్లాడారు.కళ.. కళ కోసమే కాదు.. కళ ప్రజల కోసం.. అని ప్రజానాట్యమండలి కళాకారులు ఏళ్ల తరబడి ఇందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల్ని చైతన్యబాటలో నడిపించేందుకు నాటకాలు దోహదపడతాయని, ప్రజా నాట్యమండలి రాష్ట్రంలో ఎందరో అభ్యుదయ కళాకారులను తయారు చేసిందని గుర్తు చేశారు. నేటి సినిమాల్లో అశ్లీలత, ద్వంద్వార్థాలు పెరిగాయని, చిన్న పిల్లతోనూ బూతు పాటలకు నృత్యాలు చేయిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మోడీ నోట్ల రద్దుకు బదులు టివీల్లో వస్తున్న సీరియల్స్‌ని నిషేదిస్తే సాహిత్యానికి, మానవ సంబంధాలకు విలువ ఉంటుందని అన్నారు.

ఇన్నేళ్ల స్వతంత్ర భారతంతో విద్య, వైద్యం వ్యాపారమయమై సామాన్యునికి అందని రీతిలో అభివృద్ధి చెందాయని విమర్శించారు. తన తండ్రి మాదాల రంగారావు సినిమాను సమాజ చైతన్యానికి ఒక సాధనంగా భావించాడే తప్ప ఆదాయ వనరుగా చూడలేదని గుర్తు చేశారు. గుంటూరు కళా పరిషత్ 23 ఏళ్లుగా కళామతల్లి సేవలో నిర్విఘ్నంగా కృషి చేయడంపై సంతోషం, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి బి.పూర్ణ, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు 'అన్న' నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం తొలి ప్రదర్శనగా 'కృష్ణరాయబారం' పద్య నాటకాన్ని ప్రదర్శించారు.

కేంద్రంపై పెల్లుబికిన ఆగ్రహం

- వామపక్షాలు, జనసేన ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీలు, ప్రదర్శనలు
- ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేసి నిరసనలు
- పలు జిల్లాల్లో అరెస్టులు




విజయవాడ లెనిన్ సెంటరులో జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ ఢిల్లీలో సిపిఎం, సిపిఐ, ప్రత్యేక హోదా సాధన సమితి, విద్యార్థి, యువజన సంఘాలు చేట్టిన ఆందోళనపై పోలీసుల లాఠీఛార్జిని ఖండిస్తూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెలువెత్తాయి. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మ దహనం, రాస్తారోకో వంటి నిరసన కార్యక్రమాలు జరిగాయి. జనసేన నాయకులు, కార్యకర్తలు కూడా ఈ ఆందోళనలో భాగస్వాములయ్యారు. పలుచోట్ల వైసిపి శ్రేణులు కూడా పాల్గొన్నాయి. దిష్టిబొమ్మ దహనాన్ని పోలీసులు పలుచోట్ల అడ్డుకొనే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో అరెస్టులకు పాల్పడ్డారు. పోలీసు స్టేషన్‌కు తరలించి, అనంతరం సొంతపూచీ కత్తుపై విడుదల చేశారు.

విజయవాడ లెనిన్ సెంటరులో సిపిఎం, సిపిఐ, జనసేన ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. నల్లరిబ్బన్లు, బ్యాడ్జీలు ధరించి, నల్లజెండాలు చేతబూని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా తమ హక్కని ఆంధ్రులంతా నినదిస్తుంటే, తెలుగు ప్రజల మనోభావాలకు ఏ మాత్రమూ విలువ ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం దౌర్జన్యాలకు దిగుతుండడం హేయమన్నారు. హోదా ఇవ్వకుండా తాత్సారం చేస్తూ తెలుగు ప్రజల పట్ల చులకన భావం ప్రదర్శిస్తోన్న బిజెపికి బుద్ధి చెప్పాలన్నారు. జనసేన కృష్ణాజిల్లా జాయింట్ కో ఆర్డినేటర్ పోతిన వెంకట మహేష్ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న బిజెపి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిపిఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ చెంబుడు నీళ్లు, పిడికెడు మట్టితో రాష్ట్ర ప్రజలను అవమానించిన మోడీకి ప్రజలు తగిన విధంగా బుద్ధిచెపుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు.సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు అంద్ర మాల్యాద్రి పాల్గొన్నారు. కృష్ణా జిల్లా చల్లపల్లి, మొవ్వ మండలం కూచిపూడి, కోడూరు, తిరువూరులో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. నూజివీడు, చాట్రాయిలో ధర్నా నిర్వహించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. అనంతరం మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య పాల్గొన్నారు. గుంటూరులో సిపిఎం, సిపిఐ, జనసేన ఆధ్వర్యంలో ర్యాలీ, మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సత్తెనపల్లిలో సిపిఎం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ, మోడీ దిష్టిబొమ్మ దహనం వంటి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. చిలకలూరిపేట, నరసరావుపేట, యడ్లపాడు, వినుకొండలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. ఆనందపురం, గోపాలపట్నం, అనకాపల్లిలో ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనకాపల్లిలో సిపిఎం, సిపిఐ, ఎన్‌పిఆర్‌డి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. చోడవరం, దేవరాపల్లి, కె.కోటపాడు, మునగపాక, పాడేరు, పెదబయలు, అరకులోయ కేంద్రాల్లో మోడీ దిష్టిబొమ్మను దహనం చేయగా, రాంబిల్లిలో రాస్తారోకో, డుంబ్రిగుడలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. విజయనగరంలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకోవడానికి విఫలయత్నం చేశారు. అనుమతి లేకుండా దిష్టిబొమ్మను దగ్ధం చేశారంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ సహా పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. పార్వతీపురంలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పూసపాటిరేగ, బొబ్బిలిలో రాస్తారోకో చేశారు. శ్రీకాకుళంలో ర్యాలీ నిర్వహించారు. మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రకాశం జిల్లా చీరాల, ముండ్లమూరు, మార్కాపురం, కనిగిరిలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన, ఒంగోలులో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, పిడిఎస్‌యు ఆధ్వర్యాన మోడీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో రాస్తారోకో నిర్వహించారు. తిరుపతిలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేసినందుకు సిపిఎం, డివైఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరులో సిపిఎం, సిపిఐ, జనసేన, వైసిపి, ఎస్‌టియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం ఎదుట రాస్తారోకో నిర్వహించారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, తాళ్లరేవు చెరువుగట్టులో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అమలాపురంలో ప్రదర్శన కూడా నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు, ఆచంటలో సిపిఎం, సిపిఐ, జనసేన ఆధ్వర్యాన మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. తాడేపల్లిగూడెం టౌన్, తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం, ఉండి మండలం చెరుకువాడ, చింతలపూడి, నరసాపురం, భీమవరం, తణుకులోనూ నిరసన కార్యక్రమాలు జరిగాయి. నెల్లూరులో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. సూళ్లూరుపేట, నాయుడుపేట, ఓజిలి మండలాల్లోనూ నిరసన కార్యక్రమాలు జరిగాయి. కడప జిల్లాలో కడపతోపాటు పలు ప్రాంతాల్లో మానవహారాలు, ర్యాలీలు, నిరసన ప్రదర్శనలు, ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మ దహనం వంటి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రొద్దుటూరులో కళ్లకు గంతలు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రాయచోటిలో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. వైవియు యూనివర్సిటీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దహనం, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతపురం, తనకల్లు, గుంతకల్లు, రాయదుర్గం, పామిడి, కదిరి, హిందూపురం, పెనుకొండ తదితర ప్రాంతాల్లో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కర్నూలులో కలెక్టరేట్ ఎదుట సిపిఎం, సిపిఐ, జనసేన ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. గాంధీ విగ్రహం ఎదుట ప్రధాని నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ నేపథ్యంలో సిపిఎం, సిపిఐ, విద్యార్థి, యువజన సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.


అడిషనల్ డిజి హరీష్‌కుమార్‌తో మాట్లాడుతున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

నిరసనలకు ఆటంకం కల్పించొద్దు

ఆందోళనలు అడ్డుకోవడం దురదృష్టకరం

అడిషనల్ డిజికి సిఐటియు, ఎఐటియుసి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు శాంతియుతంగా చేసే నిరసనలు, ఆందోళనలకు ఆటంకం కల్పించకుండా కింది స్థాయి అధికారులకు ఆదేశాలివ్వాలని సిఐటియు, ఎఐటియుసి నాయకులు శాంతి భద్రతల అడిషనల్ డిజి హరీష్ కుమార్ గుప్తాకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కార్మిక సంఘాలు తమ సమస్యలపై ఆందోళనలు చేసే హక్కును పరాయి పాలకులు గుర్తించినా ప్రస్తుత పోలీస్ వ్యవస్థ గుర్తించకపోవడం అన్యాయమని, జోక్యం చేసుకుని పరిస్థితులను సరిచేయాలని కోరారు. ఆందోళనలు, నిరసనలు జరగకుండా చూడటం పోలీసుల డ్యూటీగా మారడం దురదృష్టకరమని తెలిపారు. ఈ నెల 8,9న సార్వత్రిక సమ్మెకు ఏ ఆంక్షలూ పెట్టకుండా ప్రదర్శనలు, నిరసనలను అనుమతించేలా తక్షణం అధికారులను ఆదేశించాలని కోరారు. అనంతరం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు మాట్లాడుతూ పౌరులందరికీ స్వేచ్ఛ, సమానత్వం, వాక్, పత్రికా స్వాతంత్ర్యాన్ని భారత రాజ్యాంగం ప్రసాదించిందని, ప్రభుత్వ విధానాలపై శాంతియుత నిరసన తెలిపే హక్కును రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. నిరసనలకు అవకాశం లేకపోతే ప్రజాస్వామ్య విస్పోటనానికి గురౌతుందని ఇటీవల సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు హైదరాబాదులో ఆందోళనలు, ప్రదర్శనలు, ధర్నాలపై ఆంక్షలు లేవని, పోలీసులు అనుమతించేవారని చెప్పారు. రాష్ట్ర విభజన తరువాత ఎపిలో శాంతియుత ఆందోళనలపై తీవ్రమైన ఆంక్షలు పెట్టారని, ఎన్నో సార్లు అధికారుల చుట్టూ తిరిగితే తప్ప అనుమతివ్వడం లేదని తెలిపారు. విజయవాడలో ప్రదర్శనలకు అనుమతిచ్చినా జిల్లాల నుంచి కార్మికులు, ఉద్యోగులు విజయవాడకు రాకుండా అన్ని చోట్లా ఆటంకాలు కల్పిస్తున్నారని, ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధిస్తున్నారని అన్నారు. నేరస్థుల పట్ల వ్యవహరించే పద్ధతిలో కార్మికులతో, ఉద్యోగులతో వ్యవహరించడం చట్టాన్ని అతిక్రమించడమేనన్నారు.


సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కార్మిక, ఉద్యోగ సమస్యల కోసం అన్ని కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8, 9 తేదీల్లో చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని గఫూర్, ఓబులేసు పిలుపునిచ్చారు. కార్మిక చట్టాలను సవరిస్తూ, కార్పొరేట్లను దోచిపెట్టే ప్రభుత్వ విధానాలను వ్యతిరేకంగా నిరసన తెలపనున్నట్లు చెప్పారు. 8న రోడ్ల మీదికొచ్చి నిరసన తెలపాలని, 9న మానవహారాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సిఎం ధర్మపోరాట దీక్షకు ఒక న్యాయం, మాకో న్యాయమా? అని ప్రశ్నించారు. విజయవాడలోనూ ప్రదర్శన నిర్వహించి తీరుతామన్నారు.

పోలవరానికి చట్టపరమైన పర్యావరణ అనుమతులు లేవు

కేంద్ర ప్రభుత్వ మాజీ ఇంధన కార్యదర్శి ఇఎఎస్ శర్మ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



'పోలవరం సాగునీటి ప్రాజెక్టుకు చట్టపరమైన పర్యావరణ అనుమతులు లేవు. అయినా నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారు. డిజైన్ పూర్తిగా మారిపోయింది. కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులు తీసుకోవాలి. కేంద్రం గతంలోనే 'స్టాప్ ద వర్క్' అంటూ పలుమార్లు చెప్పింది. ప్రతి ఏటా అబేయన్స్‌లో ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెట్టేసి ఆ ఏడాదికి గట్టెక్కేందుకు ప్రయత్నించింది తప్ప అనుమతులు తీసుకోలేదు. యుపిఎ ప్రభుత్వంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇలాగే వ్యవహరించింది. అందుకే తాజాగా సుప్రీంకోర్టు తాజాగా దీనిపై అభ్యంతరాలు చెబుతూ తీర్పునిచ్చినట్లుంది. ముఖ్యంగా పోలవరం ప్రస్తుత డిజైన్ వల్ల ఒడిశా ముంపునకు గురౌతుంది. ఛత్తీస్‌గఢ్‌పైనా ప్రభావం ఉంది. దీంతో ఛత్తీస్‌గఢ్, ఒడిషాలో ఎపి ప్రభుత్వం స్వయంగా వెళ్లి పబ్లిక్ హియరింగ్‌ను నిర్వహించాలి. కానీ ఎపి సర్కార్ భారీ బండ్ కడతామంటూ చెబుతోంది. ఇది కట్టినా గానీ ముంపు తప్పదు' అని తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ మాజీ ఇంధన కార్యదర్శి ఇఎఎస్ శర్మ శుక్రవారం ప్రజాశక్తికి వివరాలను వెల్లడించారు.

వైద్యరంగాన్ని కాపాడుకోవాలి

డాక్టర్ అలపర్తి లక్ష్మయ్య

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

కేంద్ర ప్రభుత్వం వైద్యరంగంలో ప్రమాదకర విధానాలతో సామాన్యులకు వైద్యం అందే పరిస్థితి లేకుండా పోతోందని ప్రముఖ వైద్యులు డాక్టర్ అలపర్తి లక్ష్మయ్య పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) గుంటూరు నగర కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లు (ఎన్ఎంసి) 2017-18, ఐఎంసి 2018 సవరణ బిల్లులకు వ్యతిరేకంగా ఐఎంఎ హాల్లో శుక్రవారం నిరసన సభ నిర్వహించారు. డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ వినియోగదారుల భద్రతా బిల్లు (సిపి) వల్ల వైద్యులు, రోగులకూ తీవ్ర ఇబ్బందులు వస్తాయని విశదీకరించారు. ఎన్ఎంసి బిల్లు అప్రజాస్వామికంగా, అమానమీయంగా, పేదలకు వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నారు. ఐఎంఎ నగర అధ్యక్షులు డాక్టర్ పి విజయ మాట్లాడారు

4 శాతం పెరిగిన పొగాకు ఎగుమతులు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

భారతదేశం నుండి ఇతర దేశాలకు పొగాకు ఎగుమతులు క్రమంగా పెరుగుతున్నాయని, గతేడాది 4 శాతం మేరకు పెరిగాయని పొగాకు బోర్డు చైర్మన్ కె.సునీత తెలిపారు. పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవాన్ని గుంటూరులో ఐటిఎలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ పొగాకు సాగులోనూ ప్రకృతి సేద్య విధానాలను అవలంభించాలని రైతులకు సూచించారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగం తగ్గించాలన్నారు. నాణ్యమైన పొగాకును ఉత్పత్తి చేసేందుకు రైతులకు తగిన రీతిలో చైతన్య పరుస్తున్నామని, ప్రస్తుతం వివిధ దేశాల్లో భారత్ పొగాకు గణనీయమైన డిమాండ్ వస్తోందని పేర్కొన్నారు. మార్కెట్‌లో ధరల స్థిరీకరణ పాటిస్తున్నామని, కనీస మద్దతు ధరలు అమలు అవుతున్నాయని తెలిపారు. రైతులకు తగిన రీతిలో బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయన్నారు. ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జనరల్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ పొగాకు సాగులో పురుగు మందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని, అప్పుడే డిమాండ్ వస్తుందని చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అధిక దిగుబడులు సాధించిన పలువురు రైతులను, అధికారులు, సిబ్బందిని సన్మానించారు.

సమ్మె జయప్రదానికి జీపుయాత్రలు, ర్యాలీలు

పలు జిల్లాల్లో పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 8,9వ తేదీల్లో దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన శుక్రవారం జీపుయాత్రలు, ర్యాలీలు, ప్రదర్శనలు, ఆందోళనలు నిర్వహించారు. పలు జిల్లాల్లో పోస్టర్లు ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జీపుజాతా గుంటూరు నగరానికి చేరుకున్న సందర్భంగా స్థానిక పట్నంబజార్‌లో కార్మికులతో సిఐటియు గుంటూరు తూర్పు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకుమాను నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, మంగళగిరి అంబేద్కర్ సెంటర్‌లో సిఐటియు గుంటూరు తూర్పు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి అంజిబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు మాట్లాడారు. విజయవాడ లెనిన్ సెంటర్ నుండి ఆటో జాతా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు నగరంలో జరిగే ఈ జాతాను సిఐటియు రాష్ట్ర కోశాధికారి ఎ.వి.నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు వెంకట సుబ్బయ్య జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెకు ఉద్యోగులు, కార్మికులు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. విశాఖ నగరంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి జగ్గునాయుడు, అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి కుమార్, ఎఐటియుసి నాయకులు పడాల రమణ తదితరులు పాల్గొన్నారు. పెదగంట్యాడలో పోస్టర్ ఆవిష్కరించారు. భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో ఆటో ప్రచారం నిర్వహించారు. సిపిఐ ఆధ్వర్యాన తగరపువలస కూడలిలో పోస్టర్ ఆవిష్కరించారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలోని సిఐటియు కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఎనిమిదిన మండల కేంద్రాల్లో ప్రదర్శనలు, తొమ్మిదిన కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టాలని నిర్ణయించారు. సమ్మెకు సంఘీభావంగా రైతులు, కూలీలు తొమ్మిదో తేదీన గ్రామీణ ప్రాంతంలో బంద్ చేపట్టాలని కోరుతూ ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు విజయనగరం జిల్లా గంట్యాడ, జామి, మెంటాడ, బొండపల్లి మండలాల్లో కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. సమ్మెను జయప్రదం చేయాలని సాలూరులో సిఐటియు ఆధ్వర్యాన, బలిజిపేటలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. రాజమహేంద్రవరం కంబాల చెరువు సెంటర్ నుంచి మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. అమలాపురంలో ఎఐటియుసి, సిఐటియు, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యాన బైకుర్యాలీ నిర్వహించారు.

పెద్దాపురం ఎడిబి రోడ్డులో లారీ యూనియన్ కార్యాలయంలో యూనియన్ కార్యదర్శి గేదెల శ్రీనివాస్ అధ్యక్షతన మోటారు కార్మికుల సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా శేషబాబ్జి మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా సిఐటియు, ఇతర కార్మిక సంఘాలు ప్రచారం చేపట్టాయి. సిఐటియు చేపట్టిన జీపుయాత్ర పలుమండలాల్లో సాగింది. ఆకివీడులో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో సిఐటియు, ఐఎఫ్‌టియు ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు చేపట్టిన ప్రచార జీపుయాత్ర చింతలపూడిలో పర్యటించింది. భీమవరంలో రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. తణుకులో జీపు యాత్ర సాగింది. స్థానిక వై జంక్షన్‌లోని పౌరసరఫరాల సంస్థ గొడౌన్ వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. టి.నరసాపురంలో సిఐటియు ఆధ్వర్యాన జీపుయాత్ర పర్యటించింది. గుంటూరు జిల్లాలో జీపుజాతాలు నిర్వహించారు. నెల్లూరులో ఇండస్ట్రియల్ కారిడార్ కమిటీ అధ్యక్షులు ఎన్.యాదగిరి, కార్యదర్శి ఎం. మోహన్ రావు పిలుపునిచ్చారు. అనంతపురం, గుంతకల్లు, హిందూపురం, ఎస్కేయూ ప్రాంతాల్లో పోస్టర్లను విడుదల చేశారు. సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా వ్యాప్తంగా విస్తృతస్థాయి సమావేశాలు జరిగాయి. నగరంలోని కెకె భవన్‌లో ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో సమ్మెను జయప్రదం చేయాలని ప్రజాసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.


మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్

కార్పొరేట్లకు మోడీ అనుకూలం : గఫూర్

ఉద్యోగ కార్మిక న్యాయమైన కోర్కెల పరిష్కారానికి ఈ నెల 8, 9 తేదీల్లో జరిగే దేశవ్యాప్త సమ్మెను మధ్యతరగతి ఉద్యోగులు తోటి కార్మికులతో కలిసి విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ఎ గఫూర్ పిలుపు ఇచ్చారు. నగరంలోని దుర్గాపురం బిఆర్‌టిఎస్ రోడ్‌లోని నండూరి ప్రసాదరావు శ్రామిక భవన్‌లో బెఫి రాష్ట్ర కార్యదర్శి ఆర్ అజయ్ కుమార్ అధ్యక్షతన సార్వత్రిక సమ్మె విజయవంతానికి మధ్యతరగతి ఉద్యోగులతో సదస్సు శుక్రవారం జరిగింది. బిఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, బ్యాంకు, పోస్టల్ యూనియన్ల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో గఫూర్ పాల్గొని మాట్లాడుతూ బిజెపి సారధ్యంలోని మోడి ప్రభుత్వ హయాంలో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా విధానాలు వేగంగా అమలు జరుగుతున్నాయన్నారు. ఈ విధానాలతో ప్రభుత్వ రంగం కుంటుపడుతోందన్నారు. ప్రభుత్వ ఆధీనంలోని బ్యాంక్‌లు, బీమా సంస్థలు, బిఎస్ఎన్ఎల్ వంటి రంగాలు ప్రైవేటీకరణకు లోనయి బలహీనపడు తున్నా యన్నారు. కీలక రంగాలు ప్రభుత్వ రంగంలో ఉండటం వల్ల దేశానికి మంచి జరుగుతుందనీ, కానీ కేంద్ర ప్రభుత్వ విధానాలు దానికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

పుస్తక ప్రచారంలో ప్రముఖులు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రతి ఒక్కరికీ పుస్తక విజ్ఞానం అవసరమని తెలియచేస్తూ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రెస్‌క్లబ్ వద్ద నుండి పుస్తక ప్రియుల పాదయాత్ర శుక్ర వారం సాయంత్రం జరిగింది. పాదయాత్రను జిల్లా కలెక్టర్ కె.లక్ష్మీకాంతం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నగరంలోని పలువురు ప్రముఖులు, విద్యార్థులు, పుస్తక ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుస్తకాలంటే తమకెంతో ఇష్టమని తెలియజేశారు. పాదయాత్ర ప్రెస్‌క్లబ్ వద్ద ప్రారంభమై గాంధీనగర్, బీసెంటు రోడ్డు మీదుగా స్వరాజ్యమైదాన్‌లోని పుస్తక మహోత్సవ్ ప్రాంగణం వరకు సాగింది. పాదయాత్రలో పద్మభూషన్ అవార్డు గ్రహీత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, నగర ప్రముఖుగు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకట నారాయణ, కె.లక్ష్మయ్య, గౌరవాధ్యక్షులు బెల్లపు బాబ్జి, ఎమెస్కో బుక్ సెంటర్ అధినేత విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగులకు జనసేన సంఘీభావం

ప్రజాశక్తి - తూర్పుగోదావరి/కర్నూలు

తూర్పుగోదావరి జిల్లాలో సహకార ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరింది. పెద్దాపురం డిసిసిబి బ్రాంచి కార్యాలయం వద్ద ఉద్యోగులు దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ విరమణ వయసు 60 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఎంపిడిఓ కార్యాలయం వద్ద సహకార సంఘం ఉద్యోగుల చేపట్టిన సమ్మె శిబిరాన్ని వైసిపి తణుకు నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కారుమూరి నాగేశ్వరరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. నరసాపురంలో సమ్మె శిబిరాన్ని జనసేన నేతలు సందర్శించి సంఘీభావం తెలిపారు. కర్నూలులో నంద్యాల డివిజన్‌కు చెందిన సహకార ఉద్యోగులు కర్నూలు కెడిసిసి బ్యాంకు ఎదుట సమ్మె చేపట్టారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శి ఖాజాహుస్సేన్, సిఇఒలు, సహకార ఉద్యోగులు పాల్గొన్నారు.

8 మంది సభ్యులతో లోక్‌పాల్ సెర్చ్ పానెల్

న్యూఢిల్లీ : లోక్‌పాల్ సెర్చ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం శుక్రవారం సుప్రీం కోర్టుకు తెలిపింది. సుమారు ఎనిమిది మంది సభ్యులతో 2018 సెప్టెంబరులో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. అవినీతి నిరోధక వ్యవస్థ లోక్‌పాల్ తన కార్యకలాపాలను కొనసాగించేందుకు వీలుగా సొంత నిబంధనలు రూపొందించుకుంటుందని తెలిపింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజన్ ప్రకాష్ దేశాయ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. లోక్‌పాల్ కమిటీ సభ్యుల పేర్లతో కూడిన జాబితాకు సంబంధించిన సెప్టెంబరు 27న సిబ్బంది, శిక్షణ సంస్థ నోటిఫై చేస్తూ పేర్లను వెల్లడించింది.

IN KASHMIR, WE SHOOT THEM. IN KERALA, WE CALL THEM DEVOTEES



'కాశ్మీర్లో వారిని కాల్చి చంపుతాం. కేరళలో వారినే భక్తులంటాం' అనే శీర్షికతో 'టెలిగ్రాఫ్ ప్రచురించిన ఫోటో ఇది. వివిధ ఆందోళనల సందర్భంగా రాళ్లు విసిరే కాశ్మీరీ యువతపై పెద్ద ఎత్తున నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అణచివేత చర్యలకు దిగుతున్న విషయం తెలిసిందే. శబరిమల దేవాలయంలోకి ఇద్దరు మహిళల ప్రవేశానంతరం బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ గుండాలు రాళ్లు, బాంబులు విసురుతూ హింసాకాండకు దిగుతున్నా వారిని భక్తులంటూ వెనకేసుకురావడాన్ని ప్రస్తావిస్తూ టెలిగ్రాఫ్ ఈ ప్రశ్న వేసింది.

అయోధ్య విచారణకు ప్రత్యేక బెంచ్ : సుప్రీం

న్యూఢిల్లీ : అయోధ్యలోని వివాదాస్పద రామజన్మభూమి-బాబ్రీమసీదు కేసు విచారణకు ఈ నెల 10న తగిన బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని, విచారణ తేదీని కూడా ఆ రోజే వెల్లడిస్తామని చీఫ్ జస్టిస్ రంజన్ గోగోయ్, జస్టిస్ ఎస్‌కె కౌల్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది అయితే ఈ వివాదంపై తమ వాదనలు వినిపించడానికి ప్రయత్నించిన సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, రాజీవ్ ధావన్‌లకు సమయం ఇవ్వలేదు. ఈ అంశంపై 30 సెకన్ల పాటు విచారణ కూడా జరగలేదు. అయోధ్యలోని వివాదాస్పద స్థలంపై 2010లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ 14 పిటిషన్‌లు దాఖలు కాగా, విచారణ చేపట్టేందుకు ఇప్పుడు సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేయనుంది. 2.77 ఎకరాల భూమిని మూడు సమాన భాగాలుగా విభజించాలని అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. జనవరి మొదటి వారంలో ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తామని గత అక్టోబర్‌లో సుప్రీం పేర్కొంది.

కేరళలో ఆగని హింసాకాండ

- పార్లమెంట్‌లో వామపక్ష ఎంపిలు ధర్నా
- కేరళ కాంగ్రెస్ ఎంపిలపై సోనియా, రాహుల్ ఆగ్రహం
- పార్లమెంట్ ముట్టడికి ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ యత్నం



పార్లమెంట్ ఎదుట ధర్నా చేస్తున్న వామపక్షాల ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేరళలో బిజెపి, కాంగ్రెస్‌లు హింసాకాండను సృష్టిస్తున్నాయని, ఆందోళనలు రెచ్చగొడుతున్నాయని సిపిఎం, సిపిఐ ఎంపిలు ధ్వజమెత్తారు. గురువారం కేరళలో బిజెపి, కాంగ్రెస్ సృష్టించిన హింసాకాండను, విధ్వంసాన్ని నిరశిస్తూ శుక్రవారం పార్లమెంట్ ఆవరణంలో సిపిఎం, సిపిఐ ఎంపిలు ఆందోళన చేశారు. "బిజెపి, కాంగ్రెస్ గూండాయిజం నశించాలి. మహిళ వ్యతిరేక సంఘపరివార్ డౌన్ డౌన్. మహిళల పట్ల లింగ వివక్ష విడనాడాలి. మహిళల హక్కులు కాపాడాలి" అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఎంపి ఎంబి రాజేష్ మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపిలు ఒకే నాణేనికి రెండు ముఖాల లాంటివని, ఆ పార్టీలు మహిళల పట్ల వివక్ష చూపుతున్నాయని విమర్శించారు. మహిళల హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాన ప్రతిపక్షానికి లేదా? అని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ మహిళలకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించడం దారుణమన్నారు. మహిళలు దేవాలయాల్లోకి వెళ్లకూడదనే బిజెపి, కాంగ్రెస్‌లు కేంద్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్షాలుగా ఉండటం ఈ దేశ ప్రజల దురదృష్టమని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో భయోత్పతాన్ని సృష్టించారని, మహిళలకు రక్షణగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. బిజెపి, కాంగ్రెస్ కుట్రలను కేరళ ప్రజలు తిప్పికొడతారని, అందులో భాగంగానే 55 లక్షలకు పైగా మహిళలు మానవ హారం నిర్మించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎంపిలు పి.కరుణాకరన్, టి.కె రంగరాజన్, ఎలమారం కరీం, కెకె రాగేష్, జర్నాదాస్ బైద్య, కె.సోంప్రసాద్, జితిన్ చౌదరి, శంకర్ ప్రసాద్ దత్త, ఎండి బద్రుద్దోజాఖాన్, సిపిఐ ఎంపి బినోయ్ విశ్వం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభలో సిపిఎం, సిపిఐ ఎంపిలు వాకౌట్

గురువారం కేరళలో బిజెపి, కాంగ్రెస్‌లు సృష్టించిన హింసాకాండపై చర్చించాలని శుక్రవారం రాజ్యసభలో సిపిఎం ఎంపి కెకె రాగేష్ 267 వ నిబంధన కింద నోటీసులిచ్చారు. కేరళలో చెలరేగిన హింసపై చర్చించాలని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యానాయుడుకి వాయిదా తీర్మాన నోటీసులు ఇచ్చారు. అయితే చర్చకు వెంకయ్య నిరాకరించి, వాయిదా తీర్మాన నోటీసులను తిరస్కరించారు. చైర్మన్ వైఖరిని నిరశిస్తూ సిపిఎం, సిపిఐ ఎంపిలు వాకౌట్ చేశారు. కేరళలోని సంఘపరివార్ హింసను సృష్టించిందని, దేశ రాజధానిలో కూడా జర్నలిస్టులపై దాడి చేశారని నోటీసులో పేర్కొన్నారు.

కేరళ కాంగ్రెస్ ఎంపిలకు సోనియా, రాహుల్ క్లాస్

కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఎంపిలకు యుపిఎ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీలు క్లాస్ పీకారు. శబరిమల ఆలయంలోకి ఇద్దరు మహిళలు ప్రవేశాన్ని నిరశిస్తూ కాంగ్రెస్ ఎంపిలు "బ్లాక్ డే" నిర్వహించాలని లోక్‌సభలో నల్లరిబ్బన్లు కట్టుకునేందుకు ప్రత్నించారు. మహిళల హక్కులు, లింగ సమానత్వానికి పార్టీ కట్టుబడి ఉందని, మీరు దీనికి విరుద్ధంగా ప్రవర్తిస్తే సహించమని సోనియా వారిని హెచ్చరించారు. ఏదైనా ఉంటే కేరళలో అక్కడి రాజకీయ అవసరాల కోసం చేసుకోండి, ఇక్కడ మాత్రం చేయొద్దని అన్నారు. దీంతో కాంగ్రెస్‌తో పాటు యుడిఎఫ్ ఎంపిలు వెనక్కి తగ్గారు. మరోవైపు యుడిఎఫ్ ఎంపిలంతా ప్రధాన మంత్రిని కలిసి, సుప్రీం కోర్టు తీర్పుపై ఆర్డినెన్స్ తీసుకురావాలని అభ్యర్థించేందుకు ప్రయత్నించారు. ఆ విషయం తెలిసిన రాహుల్ గాంధీ యుడిఎఫ్ ఎంపిలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శబరిమల అంశంపై ప్రధాన మంత్రిని కలవొద్దని ఆదేశించారు. దీంతో యుడిఎఫ్ ఎంపిలు వెనక్కి తగ్గారు.

హింసను వ్యతిరేకిస్తూ పార్లమెంట్ ముట్టడికి యత్నం

కేరళలో బిజెపి, ఆరెస్సెస్ నేతృత్వంలో చెలరేగిన హింసను నిరశిస్తూ ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాలు పార్లమెంట్ ముట్టడికి యత్నించాయి. అయితే ఆందోళన కారులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. శుక్రవారం పార్లమెంట్ వైపుగా ర్యాలీగా వెళ్తున్న ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలను రైల్ భవన్ వద్ద పోలీసులు అడ్డుకొన్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళన కారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు ఆందోళన కారులను అరెస్టు చేసి స్థానిక మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం దావలే, ఐద్వా ఢిల్లీ అధ్యక్ష, కార్యదర్శులు మెమునా మొల్లా, ఆశా శర్మలతో పాటు 50 మంది ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నేతలున్నారు. ఢిల్లీలోని కేరళ భవన్ వద్ద గురువారం రాత్రి సంఘపరివార్ గుండాలు జర్నలిస్టులపై దాడి చేయడాన్ని ఖండిస్తూ డియుజె ఆధ్వర్యంలో కేరళ భవన్ వద్ద జర్నలిస్టులు నిరసన తెలిపారు.

ఆలయంలోకి శ్రీలంక మహిళ

తిరువనంతపురం : అన్ని వయస్సుల మహిళలు శబరిమల ఆలయంలోకి ప్రవేశించవచ్చంటూ సుప్రీం కోర్టు తీర్పు చెప్పిన అనంతరం మూడు రోజుల క్రితం ఇద్దరు మహిళలు ఆలయంలోకి ప్రవేశించగా, తాజాగా శ్రీలంక మహిళ ఒకరు గురువారం రాత్రి ఆలయ ప్రవేశం చేశారు. పోలీసులు కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. గురువారం రాత్రి 11గంటల సమయంలో గుడి మూసేయడానికి పది నిముషాల ముందు శశికళ (46) ఆలయంలోకి ప్రవేశించారు. వెంట ఆమె భర్త కూడా వున్నారు. ఆలయంలో ఆమె వున్నట్లు సిసిటివి కెమెరాల ఫుటేజీలు కూడా చూపిస్తున్నాయి. అయితే హిస్టరెక్టమీ ఆపరేషన్ ద్వారా తన గర్భాశయాన్ని తొలగించినందున తాను రుతుస్రావ వయసులో వున్న మహిళల కేటగిరిలోకి రానని ఆమె చెప్పారు. కాగా సుప్రీం తీర్పు నేపథ్యంలో మహిళలు ప్రవేశించడాన్ని నిరసిస్తూ గురువారం కేరళ అంతా అట్టుడికింది. వెయ్యిమందికి పైగా అరెస్టయ్యారు. 801 కేసులను నమోదు చేశారు. తాజా హింస చోటు చేసుకున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో శుక్రవారానికి కూడా పరిస్థితి ఉద్రిక్తంగానే వుంది. పాలక్కాడ్ పట్టణంలో, కాసర్‌గోడ్ జిల్లాలోని మంజేశ్వరం తాలుకాలో నిషేధాజ్ఞలు విధించారు. బిజెపి కార్యకర్తలపై దాడికి సంబంధించి సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ)కి చెందిన ముగ్గురిని త్రిస్సూర్ పోలీసులు అరెస్టు చేశారు. మొత్తంగా 99 ఆర్‌టిసి బస్సులు దగ్ధమయ్యాయని కార్పొరేషన్ ఎండి తెలిపారు. ఇదిలావుండగా మలబార్ దేవస్థానం బోర్డు సభ్యుడు శశికుమార్ ఇంటిపై శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు బాంబులు విసిరారు. ఇది ఆర్‌ఎస్‌ఎస్ పనే అని సిపిఎం విమర్శించింది.

ఆర్డినెన్స్ ఆలోచనే ప్రమాదకరం : సిపిఎం

శబరిమల ఆలయంలోకి అన్ని వయస్సుల మహిళల ప్రవేశాన్ని అనుమతిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చెల్లకుండా చేసేలా ఆర్డినెన్స్ తీసుకురావడానికి ప్రధానిని కలవాలని యుడిఎఫ్ ఎంపీలు తీసుకున్న నిర్ణయం చాలా ప్రమాదకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కొడియెరి బాలకృష్ణన్ పేర్కొన్నారు. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్‌తో కలిసి యుడిఎఫ్ ఆర్‌ఎస్‌ఎస్‌కు సహాయకారిగా పనిచేస్తోందని, సంఘ పరివార్ శక్తులను సంతృప్తి పరిచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ఈ నిర్ణయంతో అయోధ్య కేసులో కూడా ఇలాంటి ఆర్డినెన్స్ తీసుకురావడానికి ఆర్‌ఎస్‌ఎస్‌కు ఒక అవకాశం లభిస్తుందని బాలకృష్ణన్ పేర్కొన్నారు. అయోధ్య కేసులో బిజెపి ప్రభుత్వం తీసుకురాబోయే ఆర్డినెన్స్‌ను ముస్లింలీగ్ వ్యతిరేకించగలదా అని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ వైఖరి ఎలా వుంటుందని ఆయన ప్రశ్నించారు. ఇక్కడ ముస్లింలీగ్ తన గొయ్యిని తానే తవ్వుకుంటోంది. కాంగ్రెస్ కూడా హిందూత్వ పట్ల మెతక ధోరణి అనుసరిస్తోందని దీంతో స్పష్టమైందని అన్నారు.

'భారత్‌లో భద్రత లేదన్న వారిపై బాంబులేస్తా..!' : బిజెపి నేత

లక్నో : భారత్‌లో తమకు భద్రత లేదని చెబుతున్న వారిపై బాంబులేస్తానని యుపి బిజెపి ఎమ్మెల్యే విక్రమ్‌సైనీ అనుచిత వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ దేశంలో తమకు భద్రత లేదని చెబుతున్న వారంతా 'దేశద్రోహులే'నని, చట్ట ప్రకారం వారిని కఠినంగా శిక్షించాలన్నారు. దేశంలో భద్రత లేదంటున్న వారందరిపైనా బాంబులేయాలని, మన దేశాన్ని, మన విలువలను గౌరవించలేని వారు దేశం వదిలి ఇతర దేశాల్లో స్థిరపడవచ్చని ఆయన సూచించారు. స్వదేశంపై భక్తి భావన లేనపుడు ఇక్కడ వుండటం దేనికి? ఇక్కడ మీకు భద్రత లేదనుకుంటే, భద్రత ఉందనుకున్న చోటికి పొండి, ఎవరు అడ్డుకున్నారు?' అని ఆయన ప్రశ్నించారు. దేశంలో కొట్టి చంపే ఘటనలు, గోగూండాల దాడులు పెరుగుతున్న నేపథ్యంలో తమ పిల్లలు దేశంలో భద్రత లేదని భయపడుతున్నారంటూ ప్రముఖ నటుడు నసిరుద్దీన్ షా చేసిన వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన విక్రమ్ సైనీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అజయ్ మాకెన్ రాజీనామా



న్యూఢిల్లీ : ఢిల్లీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి సీనియర్ నేత అజయ్ మాకెన్ గురువారం సాయంత్రం రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతోనే తాను తప్పుకుంటున్నానని, తన రాజీనామాను అంగీకరించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని కలిసి ఆయన విజ్ఞప్తి చేసినట్లు సీనియర్ నేతలు వెల్లడించారు. ఆయన రాజీనామాను రాహుల్ ఆమోదించినట్లు సమాచారం. ఆయన స్థానంలో ఢిల్లీకి మూడుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన షీలా దీక్షిత్‌ను నియమించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగే ఉద్దేశంతో పార్టీ పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. 2015 అసెంబ్లీ ఎన్నికల అనంతరం నాలుగేళ్ల పాటు పదవి బాధ్యతలు చేపట్టానని, రాహుల్, పార్టీ నేతలు అపారమైన మద్దతునిచ్చారని పేర్కొంటూ ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ఆత్మహత్యల విచారణకు కమిటీ : హెచ్‌ఆర్‌డి

న్యూఢిల్లీ : జవహర్ నవోదయ విద్యాలయాలలోని 49మంది విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణకు ఒక కమిటీని నియమించినట్లు హెచ్‌ఆర్‌డి మంత్రిత్వశాఖ ప్రకటించింది. జెఎన్‌విఎస్ కాలేజీలో 2013 నుండి 2017 వరకు దళిత విద్యార్థులతో సహా 49మంది విద్యార్థులు మృతి చెందడంతో జాతీయ హక్కుల సంఘం హెచ్‌ఆర్‌డి మంత్రిత్వ శాఖకు ఒక నోటీసును పంపింది. దీనిపై స్పందించిన హెచ్‌ఆర్‌డి విచారణకు డాక్టర్ జితేంద్రా నాగ్‌పాల్ నేతృత్వంలో ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని డిసెంబర్ 31న నియమించినట్లు పేర్కొంది. అలాగే జెఎన్‌విలోని ప్రతి 630 మంది విభాగానికి కలిపి ఇద్దరు కౌన్సిలర్స్‌ను నియమించేందుకు ఒక ప్రతిపాదనను ఆమోదం కోసం సంబంధిత శాఖకు పంపినట్లు తెలిపింది.

మ్యాగీ కేసు విచారణపై స్టే ఎత్తివేసిన సుప్రీం

న్యూఢిల్లీ : మ్యాగీ నూడుల్స్‌కి సంబంధించి నెస్లే ఇండియాపై నమోదైన మూడేళ్ళ నాటి కేసుపై 'స్టే'ను సుప్రీం కోర్టు ఎత్తివేసింది. అక్రమ వాణిజ్య పద్ధతులకు పాల్పడినందుకు, తప్పుడు లేబుల్స్ ముద్రించినందుకు, వాణిజ్య ప్రకటనల్లో తప్పు దారి పట్టించినందుకు రు.640కోట్ల మేరకు నష్టపరిహారం చెలించాలని కోరుతూ నెస్లే ఇండియాపై జాతీయ వినియోగదారుల కమిషన్ (ఎన్‌సిడిఆర్‌సి)లో కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసును సుప్రీం కోర్టు గురువారం పునరుద్ధరించింది. నెస్లే ఇండియా తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ, మ్యాగీలో నిర్దేశిత ప్రమాణాల మేరకే సీసం వుందని అంగీకరించారు. దానిపై జస్టిస్ డి.వై.చంద్రచూడ్ స్పందిస్తూ, "సీసం వున్న మ్యాగీని ఎవరైనా ఎందుకు తినాలి?" అని ప్రశ్నించారు. ఇతర ఉత్పత్తుల్లో కూడా కొంత మొత్తంలో సీసం వుంటుందని సింఘ్వి దీనికి బదులిచ్చారు. కాగా, మ్యాగీ నూడుల్స్‌ను పరీక్షకు పంపిన మైసూర్‌లోని కేంద్ర ఆహార సాంకేతిక పరిశోధనా సంస్థ (సిఎఫ్‌టిఆర్ఐ) నుండి వచ్చే నివేదికను బట్టి ఎన్‌సిడిఆర్‌సిలో కార్యకలాపాలు సాగుతాయని చెప్పారు.

సెప్టెంబర్‌లో తొలి రాఫెల్ విమానం

- దేశ భద్రతను దృష్టిలో పెట్టుకొనే ఒప్పందం
- హెచ్ఎఎల్‌లో లోపాలు ఉన్నాయి..అందుకే ఇవ్వలేదు
- డసో, హెచ్ఎఎల్ మధ్య ఎలాంటి ఒప్పందం జరగలేదు
- లోక్‌సభలో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్
- కాంట్రాక్ట్ అనిల్ అంబానీకి ఎందుకు వెళ్లింది?: రాహుల్ గాంధీ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సెప్టెంబర్‌లో తొలి రాఫెల్ యుద్ధ విమానం దేశంలోకి వస్తుందని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి శుక్రవారం లోక్‌సభలో వాడీవేడీ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత్ కొనుగోలు చేసిన తొలి రాఫెల్ యుద్ధ విమానం సెప్టెంబరులో వైమానిక దళానికి అందుబాటులోకి వస్తుందని, మిగిలిన ఎయిర్ క్రాఫ్ట్‌లు 2022 నాటి కల్లా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారం పూర్తవడానికి 14 నెలల సమయం పట్టిందన్నారు.. దేశ భద్రతను, ప్రాధాన్యాలను దృష్టిలో పెట్టుకునే ఒప్పందాలు చేసుకుంటామని అన్నారు. పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్‌లు రక్షణ సంబంధిత అంశాల్లో దూకుడుగా ఉంటే, అప్పట్లో యుపిఎ ప్రభుత్వం కేవలం 18 యుద్ధ విమానాలను మాత్రమే కొనుగోలు చేసి, భారత్‌ను ఎటూ కదల్లేని స్థితికి తెచ్చిందని ఆరోపించారు. ఉత్తర, పశ్చిమ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో తగిన సామగ్రిని సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ఈ ఒప్పందం అత్యవసరంగా గుర్తించామని తెలిపారు. ఈ దశలో పతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో ఆమె అసహనం వ్యక్తం చేస్తూ, తన సమాధానం వినేందుకు కూడా ప్రతిపక్ష సభ్యులు ఆసక్తి చూపడం లేదని అన్నారు. "ఏ ఏ(అనిల్ అంబానీని ఉద్దేశిస్తూ)" కోసమే యుద్ధ విమానాల కొనుగోలు చేశామని కాంగ్రెస్ భావిస్తే, ప్రతి "ఏఏ" వెనుక ఒక "క్యూ(ఖత్రోచీని ఉద్దేశిస్తూ)", "ఆర్‌వి(రాబర్ట్ వాద్రాను ఉద్దేశిస్తూ)" ఉన్నారని వ్యాఖ్యలు చేశారు.

"రాఫెల్ మీ హక్కు. దాన్ని మీరే తయారు చేయాలి" అని బెంగళూరు హెచ్ఎఎల్ వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెప్పడాన్ని ప్రస్తావిస్తూ, హెచ్ఎఎల్‌కు ఎందుకు ఇవ్వలేదో రాహుల్ గాంధీ తెలుసుకోవాలని, తేజస్ విషయంలో హెచ్ఎఎల్ వేగంగా పనిచేయలేకపోయిందని అన్నారు. "రాఫెల్ వ్యవహారంలో కాంగ్రెస్ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోంది. జాతీయ భద్రతను కాంగ్రెస్ గాలికొదిలేసింది. ప్రధాని పట్ల అభ్యంతరకర పదజాలం వాడారు. వాయుసేన అధిపతిని సైతం అబద్దాలకోరుగా చిత్రీకరిస్తున్నారు. మెక్రాన్‌తో రాహుల్ గాంధీ మాట్లాడలేదని కాంగ్రెస్ పేర్కొంది. మా హయాంలో హాల్ సామర్థ్యాన్ని మెరుగుపరిచాం. చాపర్ల కొనుగోలు సమయంలో హెచ్ఎఎల్‌ను పక్కన పెట్టారు. డసో, హెచ్ఎఎల్ మధ్య ఎలాంటి ఒప్పందం జరగలేదు. హెచ్ఎఎల్ ఏడాదికి ఎనిమిది విమానాలకు మించి తయారు చేయలేదు. మీ హయాంలో హెచ్ఎఎల్‌ను పక్కన పెట్టి అగస్టాతో ఎందుకు ఒప్పందం చేసుకున్నారు" అని ప్రశ్నించారు.

రాఫెల్ కాంట్రాక్ట్ అంబానీకి ఎందుకు వెళ్లింది?: రాహుల్ గాంధీ



రాఫెల్‌పై రక్షణ శాఖ మంత్రి వ్యాఖ్యలకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్పందించారు. అసలు రాఫెల్ యుద్ధ విమానాల తయారీ కాంట్రాక్టు అనిల్ అంబానీకి ఏ విధంగా వెళ్లిందని ఆయన ప్రశ్నించారు. విమానాల ధరలు రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఏమీ లేదని ఆయన అన్నారు. రాఫెల్ ఒప్పందంలో ప్రధాని మోడీ జోక్యం చేసుకుని తన స్నేహితుడైన అనిల్ అంబానీకి కాంట్రాక్ట్ వచ్చే విధంగా చేశారని ఆయన ఆరోపించారు. "రాఫెల్ విమానాల ధర రహస్యంగా ఉంచాల్సిందేమీ కాదని మేక్రాన్ చెప్పారు. నేను మిమ్మల్ని లేదా పారికర్‌ను నిందితులుగా చూపించడం లేదు. ప్రధాని మోడీ ఈ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి. నా ప్రశ్న ఒక్కటే. అనిల్ అంబానీకి ఈ కాంట్రాక్ట్ ఎలా వెళ్లింది. అంబానీకి కాంట్రాక్ట్ ఇవ్వాలని ఎవరు నిర్ణయించారు? రాఫెల్ వివరాలను రహస్యంగా ఉంచాల్సిన అవసరమేంటి? భారత ప్రజల సొమ్ము వివరాలను వాళ్లకే తెలియజేడం లేదు. హెచ్ఎఎల్‌కు దక్కకుండా అనిల్ అంబానీ ఈ కాంట్రాక్ట్‌ను ఎలా పొందారు? అని రాహుల్ ప్రశ్నించారు. అనంతరం పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాఫెల్ ఒప్పందం వివాదంపై క్రిమినల్ దర్యాప్తునకు ఆదేశిస్తామని అన్నారు. "రాఫెల్ ఒప్పందంలో అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ డిఫెన్స్‌కే విదేశీ భాగస్వామ్యం ఇవ్వాలని భారత ప్రభుత్వం డసో ఏవియేషన్‌ను ఆదేశించినట్లు ఆ కంపెనీ అంతర్గత ఈ మెయిళ్ల ద్వారా బహిర్గతమైంది. అయినప్పటికీ ప్రభుత్వం దీనిపై మాట్లాడట్లేదు. మొన్నటి సభలో అరుణ్ జైట్లీ చాలా సేపు మాట్లాడారని, కానీ రాఫెల్‌పై తాము వేసిన ప్రశ్నలకు మాత్రం సమాధానం చెప్పలేదని రాహుల్ ఎద్దేవా చేశారు. రాఫెల్ చర్చకు భయపడి మోడీ దూరంగా వెళ్లిపోతున్నారని ఆరోపించారు.

గణనీయంగా తగ్గిన మలేరియా మరణాలు

ఆరోగ్యశాఖ మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ : 2017తో పోలిస్తే 2018లో మలేరియా మరణాలు 194 నుండి 54కు తగ్గాయని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా లోక్‌సభలో శుక్రవారం వెల్లడించారు. అదేవిధంగా 2016తో పోలిస్తే 2017 నాటికి ముప్పై లక్షల మలేరియా కేసులు తగ్గాయని ఆయన తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన ప్రపంచ మలేరియా నివేదిక 2018 ప్రకారం భారత్‌లో 2016 కన్నా 2017లో గణనీయంగా మలేరియా కేసులు 24 శాతం మేర తగ్గాయని తెలిపారు. మెరుగైన పర్యవేక్షణ, ముందస్తు రోగ నిర్ధారణ, పూర్తి స్థాయిలో చికిత్స, దోమ తెరలు పంపిణీ వంటి చర్యలు చేపట్టడం ద్వారా కేసులు తగ్గినట్లు ఆయన తెలిపారు.

విమానంలో యువకుని మృతి

కోల్‌కతా : విమానం టేకాఫ్ అవుతుండగా ఒక టీనేజ్ యువకుడు మృతి చెందిన ఘటన స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. సుమన్‌పాల్ (16) అనే టీనేజర్‌ను వైద్యం నిమిత్తం కుటుంబసభ్యులు గురువారం బెంగుళూరుకు తీసుకెళుతున్నారు. అయితే విమానం టేకాఫ్ అవుతుండగా ఒక్కసారిగా యువకుడు స్పృహ కోల్పోవడంతో పైలెట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిసి)కి సమాచారం అందించారు. అనంతరం అతనిని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, డిసెంబర్ 22 32 ఏళ్ల వ్యక్తి కూడా విమానం ప్రయాణిస్తుండగా మృతి చెందిన సంగతి తెలిసిందే.

మూగబోనున్న ఆకాశవాణి నేషనల్ ఛానల్

- నిర్వహణ వ్యయం తగ్గింపులో భాగంగా మూసివేత
- మూత పడనున్న మరో 5 ప్రాంతీయ అకాడమీలు

న్యూఢిల్లీ : ఆకాశవాణి జాతీయ ఛానల్ ప్రసారాలు హేతుబద్ధీకరణ, నిర్వహణ వ్యయం తగ్గింపులో భాగంగా ఆల్ ఇండియా రేడియో (ఎఐఆర్) జాతీయ ఛానల్‌ను మూసివేయాలని ప్రభుత్వ రంగ ప్రసార సంస్థ ప్రసార భారతి నిర్ణయించింది. ఎఐఆర్ జాతీయ ఛానల్ మూసివేతకు సంబంధించి ఏడాది కాలంగా పలుమార్లు సంప్రదింపులు, చర్చలు జరిపిన అనంతరం తుది నిర్ణయం తీసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ మేరకు ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ జనరల్ తరుపున గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రసార భారతి తన నిర్ణయాన్ని డిసెంబరు 24న ఎఐఆర్ డైరెక్టరేట్‌కు తెలిపింది.

జాతీయ ఛానల్ మూసివేత నిర్ణయం ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉందని ప్రసార భారతి వర్గాలు వెల్లడించాయి.

జాతీయ ఛానల్‌కు సంబంధించిన ట్రాన్స్‌మీటర్లు బలహీనంగా ఉండటం కూడా దాని మూసివేతకు ఒక కారణమని ఆయన చెప్పారు. నాగపూర్‌లో ఉన్న ఒకే ఒక ట్రాన్స్‌మీటరు ఒక మెగావాట్ సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. కేవలం దీని ద్వారా మాత్రమే అత్యధిక మంది శ్రోతలు కార్యక్రమాలను వినలేరన్నారు. ప్రస్తుత డిజిటల్ రేడియో యుగంలో అటువంటి ఆ టెక్నాలజీ సరిపోదని ఆయన చెప్పారు. మంచి ట్రాన్స్‌మీటర్లను ఎందుకు ఉపయోగించలేదని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ పటిష్టమైన శ్రోతల ప్రాతిపదిక లేని ఛానల్‌లో పెట్టుబడులు పెట్టడం సరైంది కాదని ప్రసార భారతికి చెందిన సీనియర్ నిర్వాహకులు భావించారని చెప్పారు. ఏదేమైనా ప్రస్తుతం కొన్ని ఎఐఆర్ కార్యక్రమాలను అవుట్‌సోర్స్ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. ఉదాహరణగా చెప్పాలంటే ఎఐఆర్ వెబ్‌సైట్‌ను ప్రైవేటునిర్వాహకులు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ముంబయిలోని నలుగురు కార్మికులకు బెయిల్

- అర్బన్ నక్సల్స్ పేరుతో అరెస్టు

ముంబయి : గత ఏడాది తమ హక్కుల కోసం పోరాడుతున్న పలువురు కార్మిక నేతలపై 'అర్బన్ నక్సల్స్' పేరుతో పోలీసులు అరెస్టు చేయగా...ఇటీవల వారిలో నలుగురు బెయిల్‌పై విడుదలయ్యారు. ఇటీవల ఆదానీ చేతిలోకి వచ్చిన రిలయన్స్‌కు చెందిన సంస్థలో పనిచేస్తున్న కార్మిక నేతలను.. వారి చట్టాల, హక్కుల కోసం ఇతర కార్మికులను కూడగట్టి సమ్మె, నిరసనలు చేపడతారన్న భయంతో, బడా సంస్థల అధినేతలకు అడ్డుకాకుండా వారిని బీమా కొరేగావ్ అల్లర్లకు కారణమయ్యారంటూ దర్యాప్తు పేరుతో ఉగ్రవాద వ్యతిరేక స్క్వాడ్(ఎటిఎస్) అరెస్టు చేసింది. బెయిల్ రావడానికి కఠినతరమైన చట్టవిరుద్ధ చర్యల నిరోధక చట్టం కింద కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే గత నెలలో ప్రత్యేక కోర్టు వారికి బెయిల్ మంజూరు చేసింది. కాగా ఇప్పటి వరకు వారిపై ఎటువంటి చార్జ్‌షీట్ లేకుండానే సుమారు ఏడాది పాటు జైలు జీవితాన్ని అనుభవించారు. అంతక ముందు వీరిపై చార్జ్‌షీటు దాఖలు చేసేందుకు మరింత సమయం కావాలని పోలీసు ప్రయత్నాలను ముంబయి హైకోర్టు తోసిపుచ్చింది. ఖైదీలుగా ఉన్న మరో నలుగురు కార్మికులు కూడా తమ బెయిల్ పిటిషన్ తీర్పుపై వేచి చూస్తున్నారు. బీమా కొరేగావ్‌తో సంబంధాలను కలిగి ఉన్నారన్న కారణంతో కాకుండా ఇతర అంశాల నిమిత్తం సుదీర్ఘంగా కార్మికులను జైలులో ఉంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెలువడ్డాయి. అయితే కార్మికులకు బెయిల్ మంజూరు కావడం సానుకూల అభివృద్ధి అయినప్పటికీ, ఎంతో కష్టతరమైంది. వారిని విడిచిపెట్టడానికి 50 వేల రూపాయల షూరిటీని పూచీకత్తుగా కోర్టు పేర్కొంది. వారు జైలులో కొనసాగుతున్నప్పటి నుండి వారి కుటుంబాలు సంక్షోభంలో ఉండగా వారి విడుదలకు అవసరమైన డబ్బును సమకూర్చడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

బ్రెగ్జిట్ తరువాత డెగ్జిట్...!

ఇయు నుండి తప్పుకోవాలని జర్మన్ మితవాద పార్టీ డిమాండ్

బెర్లిన్: ఇయు కూటమి నుంచి బ్రిటన్ నిష్క్రమించిన తరువాత జర్మనీ కూడా తప్పుకోవాలని ఆ దేశానికి చెందిన మితవాద పార్టీ ఆల్టర్నేటివ్ ఫర్ జర్మనీ (ఎఎఫ్‌డి) డిమాండ్ చేస్తోంది. ఇయు నుంచి జర్మనీ నిష్క్రమణను డెగ్జిట్ అని అది పిలుస్తోంది. ఐరోపా ఇస్లామికీకరణకు గురవుతోందని ఆరోపిస్తున్న ఎఎఫ్‌డి ఇయు నుంచి జర్మనీ కూడా బయటకు రావాలని పట్టుబడుతోంది. ఇయులో పారదర్శకత, ప్రజాస్వామ్యానికి పాతరేశారని, యూరోపియన్ పాలకవర్గాలు, బ్యూరోక్రసీ ప్రయోజనాలకోసమే ఈ కూటమి పనిచేస్తోందని ఎఎఫ్‌డి విమర్శించింది. అందువల్లే సభ్యదేశాల సమస్యలను పట్టించుకోవడం లేదని తెలిపింది. వచ్చేఐదేళ్లలో ఇయులో పునర్వ్యవస్థీకరణ సంస్కరణలు సమగ్రంగా అమలు చేయాలని, లేకుంటే తాము కూటమి నుండి తప్పుకోవటం తప్ప మరో మార్గం లేదని ఎఎఫ్‌డి స్పష్టం చేసింది.

। ప్రజాగ్రహం

సూడాన్ అధ్యక్షుడు ఒమర్ అల్ బషీర్ గద్దె దిగాలని డిమాండ్ చేస్తూ, రాజధాని ఖార్తూమ్‌లో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహిస్తున్న ఆందోళన కారులు . నిత్యవసరాల ధరలు నింగినంటడం, నిరుద్యోగం , పేదరికం పెరిగిపోవడంతో ఆగ్రహించి ప్రజలు డిసెంబర్19 నుంచి నిరసనలు కొనసాగిస్తున్నారు.



మాక్రాన్ విధానాల పట్ల 75 శాతం మంది అసంతృప్తి



పారిస్ : ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ విధానాల పట్ల దేశంలోని మూడొంతుల మంది ప్రజలు తీవ్ర అసంతృపితో వున్నారు. ఒడెక్సా నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయాలు వెలడయ్యాయి కేవలం 25శాతం మంది మాత్రమే మాక్రాన్ ప్రభుత్వం పట్ల సంతోషంగా వున్నారని ఈ సర్వే వెల్లడించింది. 2018 ఏప్రిల్‌లో 59శాతం మంది ప్రజలు మాక్రాన్ పట్ల అసంతృప్తిగా వుంటే ఇప్పటికొచ్చేసరికి అది 75శాతానికి చేరింది. జనవరి ప్రారంభంలో ఈ సర్వే నిర్వహించారు. కింది స్థాయి కార్మికులు, రైతులే కాదు, ఎగువ మధ్య తరగతి ఆదాయవర్గాలు కూడా మాక్రాన్ ప్రభుత్వ విధానాల పట్ల తీవ్ర అసంతృప్తితో వున్నారు.. ప్రధానిని వ్యతిరేకిస్తున్నవారు 54శాతం మంది వుండగా హోం మంత్రిని వ్యతిరేకిస్తున్న వారు 53శాతంగా వున్నారు. ఇదిలావుండగా, ఇంధన ధరల పెంపునకు వ్యతిరేకంగా మొదలైన ఆందోళనలు మరిన్ని రంగాలకు విస్తరించాయి.

చైనాతో వాణిజ్య యుద్ధంపై ట్రంప్ అబద్ధాలాడారు

వాషింగ్టన్ : చైనాతో సాగించిన వాణిజ్య యుద్ధం, టారిఫ్‌ల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కోట్ల డాలర్లలో నష్టపోయిందని ఒక నివేదిక వెల్లడించింది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం దేశ ఖజానాకు కోట్లాది డాలర్లు అదనంగా చేరాయని అంటున్నారు. చైనా, ఇతర విదేశీ దిగుమతులను లక్ష్యంగా పెట్టుకుని టారిఫ్‌లను విధించడాన్ని సమర్ధించుకుంటూ ట్రంప్ గురువారం ట్వీట్ చేశారు. అమెరికా పట్ల సక్రమంగా వ్యవహరించని చైనా, ఇతర దేశాలపై విధించిన టారిఫ్‌లతో ఖజానాకు కోట్లాది డాలర్లు సమకూరాయని ఆయన చెప్పుకున్నారు. ఇక్కడ ట్రంప్ చెబుతున్నది నిజమే అయినప్పటికీ 2018లో ఖర్చయిన మొత్తంతో పోలిస్తే వచ్చిన మొత్తం బకెట్‌లో ఒక నీటి బొట్టంత అని సిఎన్‌బిసి వ్యాఖ్యానించింది. గత ఆర్థిక సంవత్సరం చివరి రోజైన సెప్టెంబరు 30 నాటికి, మొత్తం టారిఫ్‌ల వల్ల వసూలైనది700కోట్ల డాలర్లు కన్నా తక్కువగానే వుంది. ఏడాది మొత్తంగా ఖజానాకు జమ అయిన 3,300 లక్షల కోట్ల డాలర్ల మొత్తంలో ఇది కేవలం 0.2శాతంగా వుంది. చైనా ఉత్పత్తులపై విధించిన టారిఫ్‌ల కారణంగా నెలకు వంద కోట్ల డాలర్లు వరకు కేవలం టెక్నాలజీ పరిశ్రమ నష్టపోయిందని రాయిటర్స్ ఒక నివేదికలో పేర్కొంది. వ్యవసాయ రంగమూ బాగా దెబ్బతింది.కేవలం సోయాబీన్ రైతులే 290కోట్ల డాలర్ల వరకు నష్టపోయారు.

వచ్చే వారం చైనాలో అమెరికా వాణిజ్య బృందం పర్యటన

అమెరికా ప్రతినిధి బృందం వచ్చే వారం చైనాలో పర్యటించనుంది. వాణిజ్య యుద్ధాన్ని తాత్కాలికంగా విరమించడానికి ఇరు దేశాల అధ్యక్షులు అంగీకరించడంతో ముఖాముఖి చర్చలకు గానూ మొదటిసారిగా ఈ బృందం బీజింగ్ వస్తోంది.

త్వరలోనే కిమ్-ట్రంప్‌ల మలి భేటీ?

కిమ్ లేఖ అందిందన్న ట్రంప్



వాషింగ్టన్: ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్ రాసిన లేఖ తనకు అందిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. సమీప భవిష్యత్తులో తామిరువురి మధ్య మలి దఫా భేటీ వుంటుందని ఆయన బుధవారం నాడిక్కడ చెప్పారు. వైట్‌హౌస్‌లో జరిగిన ఈ మీడియా సమావేశంలోకిమ్‌జోంగ్ ఉన్ నుండి వచ్చిన లేఖను చూపారు.. త్వరలోనే తమ మధ్య మరో భేటీ వుంటుందని, బహుశ ఇది సమీప భవిష్యత్‌లోనే జరిగే అవకాశాలున్నాయని అన్నారు. కొత్త సంవత్సర సందేశంలో కిమ్ మాట్లాడుతూ తాను అణు నిరాయుధీకరణ ప్రక్రియను కొనసాగిస్తానని, ట్రంప్‌తో మలి విడత చర్చలకు సిద్ధంగా వున్నానని చెప్పిన విషయం తెలిసిందే.

షట్‌డౌన్ ఎత్తివేతకు ఆమోదం

ట్రంప్ మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణానికి నో
ప్రతినిధుల సభలో బిల్లుకు డెమెక్రాట్లుఓకే

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కాదని ప్రతినిధుల సభ సభ్యులు యూఎస్ షట్‌డౌన్ ఎత్తేసేందుకు వీలుగా బిల్లును ఆమోదించారు. అమెరికా–మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ట్రంప్ చేస్తున్న డిమాండ్‌ను పక్కన పెట్టి.. ఎలాంటి నిధులు ఇవ్వకుండానే సభ బిల్లును ఆమోదించింది. గత నవంబరులో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు ఆధిక్యం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో, రిపబ్లికన్లు వ్యతిరేకించినప్పటికీ డెమోక్రాట్ల మెజార్టీ ఉండటంతో బిల్లులు ఆమోదించారు. అయితే సెనేట్‌లో రిపబ్లికన్లదే పైచేయి. ఒకవేళ యూఎస్ కాంగ్రెస్ గోడకు నిధులు కేటాయించకుండా బిల్లును ఆమోదించినట్టయితే ట్రంప్ వీటో అధికారాలతో దాన్ని రద్దు చేస్తానని హెచ్చరిస్తున్నట్టు సమాచారం. మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించేంత వరకు ద్రవ్య వినిమయ బిల్లుపై సంతకం పెట్టేదిలేదని ట్రంప్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే నిధుల కేటాయిపునకు డెమోక్రాట్లు అంగీకరించడం లేదు. తాజాగా ప్రతినిధుల సభకు స్పీకర్‌గా ఎంపికైన డెమోక్రాట్ నేత నాన్సీ పెలోసి మరోసారి ఆ విషయాన్ని స్పష్టంచేశారు. ఇరు వర్గాలు వెనక్కి తగ్గకపోవడంతో గత రెండు వారాలుగా అమెరికాలో పాక్షిక షట్‌డౌన్ కొనసాగుతోంది. పలు ప్రభుత్వ కార్యక్రమాలకు నిధులు అందడం లేదు. ఎంతో మంది ఫెడరల్ ఉద్యోగులు జీతాలు లేకుండా పనిచేయాల్సి వస్తోంది.

అమెరికన్ కాంగ్రెస్‌లో రికార్డు సంఖ్యలో మహిళలు

వాషింగ్టన్ : అమెరికన్ కాంగ్రెస్‌కు రికార్డు సంఖ్యలో మహిళా ఎంపీలు ఎన్నికయ్యారు. కాంగ్రెస్‌కు ఎన్నికైన మొదటి ఇద్దరు ఆదివాసీ మహిళల్లో న్యూ మెక్సికోకి చెందిన దేబ్రా హాలాండ్ ఒకరు కాగా, కాన్సాస్‌కి చెందిన షారిస్ డేవిడ్స్ రెండో మహిళ. సుదీర్ఘకాలంగా రంగంలో వున్న డెమొక్రటిక్ అభ్యర్థిని ఓడించి న్యూయార్క్‌కి చెందిన అలెగ్జాండ్రియా ఒకేషియా కార్టెజ్ (29) కాంగ్రెస్‌కు ఎన్నికైన అత్యంత పిన్న వయస్కురాలుగా నిలిచారు. ఈ రికార్డు ఇప్పటివరకు రిపబ్లికన్ ప్రతినిధి అయిన ఎలిస్ స్టెఫానిక్(30) పేరుతో వుంది. ఈ ఏడాది అమెరికా కాంగ్రెస్ అనేక కొత్త పరిణామాలకు వేదికగా మారింది. నవంబరులో ఎన్నికైన కాంగ్రెస్ సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. తొలిసారిగా ఇద్దరు ముస్లిం మహిళలు ఎన్నికయ్యారు. వీరిలో ఒకరు సోమాలీ అమెరికన్ జాతీయురాలు కాగా,. ఇక రెండో మహిళ అయిన త్లాయిబ్ పాలస్తీనియన్ అమెరికన్. ఆమె డెట్రాయిట్‌లోని పాలస్తీనా శరణార్థుల కుటుంబంలో జన్మించింది.



స్పీకర్‌గా నాన్సీ పెలోసీ

వాషింగ్టన్: గురువారం మధ్యాహ్నం అమెరికన్ కాంగ్రెస్ ప్రతినిధుల సభ స్పీకర్‌గా డెమొక్రాటిక్‌పార్టీ నేత నాన్సీ పెలోసీ ఎన్నికయ్యారు. ఆమె ఈ పదవిని చేపట్టడం ఇది రెండోసారి. ప్రోటోకాల్ ప్రకారం అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ తరువాత అత్యంత ప్రముఖులుగా ఆమె నిలుస్తారు. ఒక వేళ ట్రంప్ అధ్యక్ష బాధ్యతల నుండి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడితే రాజ్యాంగం ప్రకారం పెన్స్ అధ్యక్ష బాధ్యతలను స్వీకరిస్తారు. ఉపాధ్యక్షుడు ఆ బాధ్యతలను స్వీకరించలేని పరిస్థితిలో వుంటే ప్రతినిధుల సభ స్పీకర్ అధ్యక్ష బాధ్యతలను నిర్వర్తిస్తారు. 116వ కాంగ్రెస్ ప్రమాణ స్వీకార సమయంలోనే పెలోసీ స్పీకర్‌గా ఎన్నికైన విషయం తెలిసిందే. మొత్తం పోలయిన 430 బ్యాలెట్లలో కాలిఫోర్నియా డెమొక్రాట్ ప్రతినిధి పెలోసీకి 220 ఓట్లు లభించాయి. పెలోసీ తరువాతి స్థానంలో సెనెట్ ప్రోటెమ్ స్పీకర్‌గా ఎన్నికైన రిపబ్లికన్ నేత చుక్ గ్రాస్లీ నిలుస్తారు. గ్రాస్లీ ఆ బాధ్యతలను స్వీకరించలేకపోతే తరువాతి స్థానంలో ట్రంప్ కేబినెట్ మంత్రులు నిలుస్తారు.

బ్రెగ్జిట్ డీల్‌కు ఆమోదం కష్టమే!

ఒప్పందాన్ని తిరస్కరించొద్దంటున్న మంత్రులు

లండన్: ఐరోపా కూటమితో బ్రిటన్ ప్రధాని థెరిస్సా మే కుదుర్చుకున్న బ్రెగ్జిట్ ఒప్పందానికి పార్లమెంటు ఆమోదం తెలిపే అవకాశాలు లేవు. ఒప్పందం లేకుండానే నిష్క్రమిస్తే దేశానికి తిప్పలు తప్పవని మంత్రులు హెచ్చరించారు. రెండేళ్ల బ్రెగ్జిట్ చర్చల ప్రక్రియ మార్చి 29తో ముగుస్తుంది. ఈ లోగా ఏదో ఒక ఒప్పందం కుదిరితే సరే. లేకుంటే ఒప్పందం లేకుండానే ఇయు నుంచి బ్రిటన్ బయటకు రావాల్సి ఉంటుంది. థెరిస్సా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తున్న అధికార పార్టీ ఎంపీలు కొందరు రెండో రిఫరెండమ్‌కు వెళ్లాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నంతలో ఇదే మెరుగైన ఒప్పందం ఇదేనని మంత్రులు వాదిస్తున్నారు. నోడీల్ వల్ల ఉత్పత్తి ఖర్చులు , ఎగుమతి సుంకాలు పెరిగిపోయి బ్రిటిష్ రైతులు, ఆహార సంస్థలు తీవ్ర ఇబ్బందులెదుర్కోవాల్సి ఉంటుందని పర్యావరణ మంత్రి గోవ్ చెప్పారు.అంతేకాదు సరిహద్దుల్లో తనిఖీలు పెరిగితే రేవుల్లో సరుకుల ఎగుమతులు దిగుమతలు మందగిస్తాయని ఆయన తెలిపారు. ఈ ఒప్పందంపై ఈ నెల14 న ఓటింగ్ జరగనున్నది. థెరిస్సా ఒప్పందానికి ప్రధాన అడ్డంకి 'బ్యాక్‌స్టాప్'కు వ్యతిరేకత. స్టాప్ గ్యాప్ అనేది ఉత్తర ఐర్లండ్‌కు, ఐరోపా కూటమిలోని ఐర్లండ రిపబ్లిక్‌కు మధ్య రాకపోకలు, సరుకుల రవాణా, సుంకాల విధింపు, తనిఖీలకు సంబంధించినది. థెరిస్సా ఒప్పందాన్ని బ్రిటిష్ ఎంపీలు ఎక్కువ మంది వ్యతిరేకించడానికి ఈ 'బ్యాక్ స్టాప్' అంశమే ప్రధాన కారణం. ఐరిష్ సముద్రంలో ఉన్న ఈ దీవిలో ఉత్తర ఐర్లండ్‌కు, ఐర్లండ్ రిపబ్లిక్‌కు మధ్య వాణిజ్య సుంకాలు, తనిఖీలు, భద్రతా పరంగా స్పష్టంగా సరిహద్దు రేఖ ఉండాలనేది బ్రిటన్ వాదన. ఈ రెండు దీవుల మధ్య సరిహద్దులు, తనిఖీలు, సుంకాలతో విభజన తీసుకొస్తే అది ఆ ప్రాంతంలో అశాంతికి దారితీస్తుంది కాబట్టి ఇయు జోన్‌లోని వాణిజ్య నిబంధనలే ఈ దీవి వరకు అమలు చేయాలని ఇయు వాదిస్తోంది. ఈ సమస్య ఇప్పుడే తెమిలేది కాదు కాబట్టి బ్రెగ్జిట్ గడువు దగ్గర పడుతున్నందున మిగతా వాటిపై ఒక ఒప్పందానికి వచ్చి ఈ అంశం వరకు తరువాత చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చంటూ ఇయుతో థెరిస్సా రాజీ పడ్డారు. దీనివల్ల బ్రిటన్ నిష్క్రమణ తరువాత కూడా తన దేశ సరిహద్దులు, వాణిజ్య సుంకాల నియంత్రణకు సంబంధించిన స్వేచ్ఛను కోల్పోతుంది.

మొదటి పేజీ తరువాయి



త్వరలో జెఎసి

ఈ నెల 13 తరువాత సమ్మెకు సిద్ధంగా ఉండాలని ఇయు ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు కోరారు. సమ్మె నోటీసుకు మద్దతుగా 8,9 తేదీల్లో ధర్నాలకు ఎన్ఎంయు పిలుపునివ్వడం అభినందనీయమని, అదే విధంగా సమ్మెలోనూ జెఎసితో కలిసిరావాలని ఆయన కోరారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఎన్ఎంయుకు లేఖ ద్వారా తెలపనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ సుందరయ్య, కార్మిక పరిషత్ నాయకులు వి వరహాలనాయుడు, వైఎస్ఆర్ఎంయు నాయకులు సిబిఎస్ రెడ్డి, యునైటెడ్ వర్కర్స్ నాయకులు ప్రకాశ్, బహుజన వర్కర్స్ నాయకులు పాల్, వర్కర్స్ యూనియన్ నాయకులు జి శ్రీనివాసరాజు, ఓస్వా నాయకులు కొండారెడ్డి, ఇయు నాయకులు ఎం హనుమంతురావు, ఆవుల ప్రభాకర్, జివి నరసయ్య తదితరులు పాల్గొన్నారు. గురువారం జరిగిన వేతన సవరణ కమిటీ సమావేశంలోనూ వేతన సవరణపై యాజమాన్యం అడుగు ముందుకేయని విషయం తెలిసిందే. 50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని కార్మికసంఘాలు కోరుతుండగా, యాజమాన్యం మాత్రం 15కు మించి ఇవ్వలేమని తెలిపింది. ఈ విషయంపై ముఖ్యమంత్రితో చర్చించాల్సి ఉందని, 18న మరోసారి సమావేశమై ఫిట్‌మెంట్ విషయంపై చర్చిస్తామని ఎమ్‌డి గుర్తింపు సంఘాన్ని కోరారు.

అన్ని సంఘాలను కలుపుకుని సమ్మె

అన్ని సంఘాలను కలుపుకుని సమ్మె చేపడతాం. సిఎంతో చర్చించేందుకు ఈ నెల 18 వరకూ సమయం కావాలని ఎమ్‌డి కోరారు. అంతలోపు రవాణా శాఖ మంత్రికి, సిఎంను కలిసి విన్నవిస్తాం. ఆర్టీసిలో సమ్మె నోటీసు ఇచ్చినా ఇవ్వకపోయినా ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమ్మె నిషేధం జిఓ ఇవ్వడం మామూలే. అందుకు భయపడేదిలేదు. సమ్మె చేయాల్సిన పరిస్థితి వస్తే ఎస్మా చట్టం ప్రయోగించినా భయపడం.

– పలిశెట్టి దామోదరరావు, ఇయు ప్రధాన కార్యదర్శి

ఎస్మా ప్రయోగించినా సమ్మె

ఎస్మా చట్టాన్ని ప్రయోగించినా సమ్మె చేసి తీరుతాం. సమ్మె నిషేధం పేరుతో ఉద్యమాలను అణచివేయాలని చూడటం తగదు. వేతన సవరణ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి. గతంలో యాజమాన్యం ఎన్ఎంయుతో ఐదు సార్లు జరిపిన సమావేశాల వివరాలను బయటపెట్టాలి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టీసి సిబ్బంది వేతనాలు ఉండాలి.

– సిహెచ్ సుందరయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి

వేతన సవరణ బాధ్యత గుర్తింపు సంఘందే

వేతన సవరణలో ప్రధాన బాధ్యత గుర్తింపు సంఘందే. ఇచ్చిన హామీ ప్రకారం 50 శాతం ఫిట్‌మెంట్ సాధించి తీరాలి. సమ్మె నోటీసు ఒక సంఘంగా ఇచ్చి, ఇప్పుడు జెఎసి అనడం సరికాదు. ఇయుకు సంఘీభావంగా 8,9న నిరసనలు తెలపాలని రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. జెఎసిలో కలిసే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

– చల్లా చంద్రయ్య, ఎన్ఎంయు అధ్యక్షులు

జగన్‌పై దాడి కేసు ఎన్ఐఎకు అప్పగింత

సంబంధించి ఈ నెల 1వ తేదే ఎన్ఐఎ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. హైదరాబాద్ లోని ఎన్ఐఎ పిఎస్‌లో ఎఫ్ఐఆర్ నెంబరు 01/2019 ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 307, సేఫ్టీ ఆఫ్ ఆఫ్ సివిల్ యావియేషన్ యాక్ట్,1982 సెక్షన్ 3ఎ (1)(ఎ) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జగన్ న్యాయవాది హర్షం

జగన్‌పై కోడికత్తితో జరిగిన దాడి కేసు విచారణను ఎన్ఐఎకు అప్పగించడం పట్ల జగన్ తరపు అడ్వకేట్ సుదాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తులో తెర వెనుక ఎవరెవరు ఉన్నారు? జగన్‌ను హత్య చేయించాలనే ఆలోచన ఎవరిది? తదితర వాస్తవ విషయాలు ఎన్ఐఎ దర్యాప్తులో బయటపడతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఎపికి బిజెపి ద్రోహం

మొదటి పేజీ తరువాయి

తాను జైట్లీకి స్పష్టం చేసినట్లు ఏచూరి వెల్లడిం చారు. పార్లమెంట్‌లోనూ, వెలుపలా ఆందోళనలు, ప్రజా ఉద్యమాల ద్వారానే డిమాండ్లు సాధించుకోగలమని ఆయన స్పష్టం చేశారు.

హోదా ఏపి ప్రజల హక్కు : బినయ్ విశ్వం, సిపిఐ రాజ్యసభ ఎంపి

ప్రత్యేక హోదా ఏపి ప్రజలందరి హక్కు అని, దానికోసం కోసం జరిగే ఉద్యమానికి తమ మద్దతు ఉంటుందని సిపిఐ రాజ్యసభ ఎంపి బినయ్ విశ్వం అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను రెండుగా విభజించారని, అప్పుడు ఏపికి యూనివర్శిటీలు, రైల్వే జోన్, స్టీల్ ప్లాంట్, పారిశ్రామిక ప్రోత్సహకాలు వంటి అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. కానీ ఇచ్చిన హామీలను ఉల్లం ఘించారని విమర్శించారు. మోడీ సర్కార్‌కు ఏపి ప్రజలు వార్నింగ్ నోటీసులు ఇచ్చారని, హామీలను అమలు చేసే వరకు ఉద్యమం ఆగదని హెచ్చరించారు. శాంతి యుతంగా ఉద్యమించేవారిపై పోలీసులతో దాడి చేయించడమేంటని మండిపడ్డారు. సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ ప్రత్యేక హోదాపై కొన్ని పార్టీలకు చిత్తశుద్ధి లేదని, హోదా కోసం దెబ్బలు తిన్న ఈ పోరాటం అసలైన పోరాటమని, కొంతమంది నకిలీ పోరాటం చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా చంద్రబాబు అబ్బసొత్తుకాదు, మోడీ తాత సొత్తు కాదని ఎద్దేవా చేశారు. ఏపిలో బిజెపి పేరుతో పోటీ చేసేవారికి డిపాజిట్లు కూడా రావని అన్నారు.

పోరాటాన్ని కొనసాగిస్తాం

సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి.మధు, రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసన పోరాటం జరుగుతోందని అన్నారు. రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్, గిరిజన, సెంట్రల్ యూనివర్శిటీలు వంటి సమస్యలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి ప్రభుత్వం మెడలు వంచి సాధించేందుకు పోరాటాలు కొనసాగుతాయని తెలిపారు. ప్రత్యేక హోదా సాధన సమితి నేత చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్యాకేజీలు తమ రాష్ట్రానికి న్యాయం చేయవని, హోదానే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తాము పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు పుణ్యవతి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరావు, ఆర్థిక విశ్లేషకులు పెంటపాటి పుల్లారావు, సిఐటియు నేత ఆర్.లక్ష్మయ్య, హోదా సాధన సమితి నాయకులు ప్రొఫెసర్ జార్జి విక్టర్, ప్రొఫెసర్ సదాశివ రెడ్డి, ప్రొఫెసర్ అప్పలనాయుడు, జివి సత్యన్నారాయణ రాజు, కర్ణాటక తెలుగు సంఘం నేత బొందు రామస్వామి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామన్న, సూర్యారావు, ఎస్ఎఫ్ఐ నేతలు ప్రసన్న కుమార్, పవన్ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లెనిన్ బాబు పాల్గొన్నారు.

దాడి గర్హనీయం : చంద్రబాబు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా కోసం పోరాడుతున్నవారిపై ఢిల్లీ పోలీసులు దాడి చేయడం గర్హనీయమని ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు అన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పోకడలకు నిదర్శనమని పేర్కొన్నారు. అమరావతిలో శుక్ర వారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో టిడిపి ఎంపీలతో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఒకే రోజు 15 మంది టిడిపి ఎంపిలను, రెండు రోజుల్లో 45 మంది ఎంపిలను సస్పెండ్ చేశారని, బిజెపికి ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేదని విమర్శించారు. ప్రజలు దీన్ని ఖండించాలని కోరారు. ఇప్పటికే బిజెపికి ఐదు రాష్ట్రాల్లో ఓటమి ఎదురైనా మూర్ఖంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్ ఖండన

ప్రత్యేకహోదా కోసం ఢిల్లీలో ప్రదర్శన, ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ, సిపిఎం నాయకులపైనా, కార్యకర్తలపైనా పోలీసులు లాఠీ చార్జీ చేయడాన్ని ఖండిస్తున్నట్లు వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధుతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు.

27 మంది ఆర్థిక నేరగాళ్లు దేశం దాటారు..!

న్యూఢిల్లీ: గడిచిన ఐదేండ్ల కాలంలో దాదాపు 27 మంది ఎగవేతదారులు, ఆర్థిక నేరగాళ్లు దేశం దాటి పారిపోయారని కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా లోక్‌సభకు తెలియజేశారు. 27 మంది ఆర్థిక నేరగాళ్లలో దాదాపు 20 మందిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాల్సిందిగా ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించినట్లు ఆయన వెల్లడించారు. భారత్ అధికారుల అభ్యర్థన మేరకు.. దేశం విడిచి పారిపోయిన ఎనిమిది మందిపై ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసినట్లు లోక్‌సభకు ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో ఆయన పేర్కొన్నారు. ఆరు కేసుల్లోని నిందితులను భారత్ తిరిగి పంపించాల్సిందిగా కోరుతూ అభ్యర్థనలు పెట్టినట్లు తెలిపారు. బ్యాంకులకు రూ.9వేల కోట్ల మేర రుణాలు ఎగ్గొట్టి లండన్‌లో తలదాచుకుంటున్న విజయ్ మాల్యాను భారత్‌కు తిరిగి పంపించేందుకు బ్రిటన్‌కు చెందిన స్థానిక కోర్టు అంగీకరించినట్లు ఆయన లోక్‌సభకు తెలియజేశారు.

రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు

వైసిపి నేతలు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం కేసు విచారణను హైకోర్టు ఎన్ఐఏకి అప్పగించడాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు స్వాగతించారు. హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని వ్యాఖ్యానించారుశుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శాసన మండలి విపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక టిడిపి నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, డిజిపి కలసి కేసును నీరుగార్చే ప్రయత్నం చేశారని వైఎస్ఆర్‌సిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆరోపించారు.. డిజిపి చేసిన తప్పులను ఎన్ఐఏ ముందుంచుతామని ఆర్కే స్పష్టం చేశారు.

వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే : మాజీ ఎంపీ మిథున్‌రెడ్డి

రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పారీ ఒంటరిగానే పోటీ చేస్తుందని మాజీ ఎంపీ మిథున్‌రెడ్డి స్పష్టం చేశారు. పొత్తుల కోసం ప్రాకులాడాల్సిన అవసరం వైఎస్ఆర్‌సిపి ఎంతమాత్రం లేదని తేల్చి చెప్పారు. ఓట్ల కోసం చంద్రబాబు నాయుడు ఎంతకైనా దిగజారుతార్న ఆయన గోడ గడియారాల పంపిణీలోనూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆగస్టు నుంచి తమ పార్టీ నేత తిప్పారెడ్డి 60 వేల గోడ గడియారాలు పంపిణీ చేశారని తెలిపారు. పరిటాల శ్రీరామ్ వివాహ వేడుకలకు హాజరైన కేసిఆర్‌కు మీ పార్టీ నేతలు పోటీపడి ఫ్లెక్సీలు కట్టింది నిజం కాదా అని నిలదీశారు. ఆ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు..సదావర్తి భూములను కాజేయాలని ఎలాగైతే ప్రయత్నించారో అలాగే అగ్రిగోల్డ్ ఆస్తులను కాజేయాలని చూస్తున్నారన్నారు.

ప్రయివేటీకరణతో ప్రభుత్వ రంగాలు బలహీనం

సిఐటియు ప్రధాన కార్యదర్శి గఫూర్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో



మోడీ ప్రభుత్వ హయాంలో కార్పొరేట్ల అనుకూల, ప్రయివేటీకరణ విధానాలు వేగంగా అమలు చేసారన్నారని, వీటి వల్ల ప్రభుత్వ బ్యాంకులు, బీమా సంస్థలు, బిఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ రంగాలు బలహీనపడుతున్నాయని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎ గఫూర్ అన్నారు. ఈ నెల 8,9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు విజయవాడలోని నండూరి ప్రసాదరావు శ్రామిక భవనంలో బిఎస్ఎన్ఎల్, ఇన్సూరెన్స్, బ్యాంకు, పోస్టల్ యూనియన్ల ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ కీలక రంగాలు ప్రభుత్వ రంగంలో ఉండటం వల్లే దేశానికి మంచి జరుగుతుందన్నారు. కార్మిక చట్టాలు యాజమాన్యాలకు అనుకూలంగా మారుస్తున్న మోడీ ప్రభుత్వం కార్మిక సంక్షేమాన్ని విస్మరించి నష్టం చేసిందన్నారు. 12 కనీస డిమాండ్లపై నాలుగేళ్లుగా చర్చించ లేదన్నారు. ఉద్యోగుల, కార్మికుల న్యాయమైన డిమాండ్లపై జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెను మధ్య తరగతి ఉద్యోగులు తోటి కార్మికులతో కలిసి ముందుండి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై కూడా ఈ సమ్మె వేదిక గా పోరాడాలన్నారు. బెఫి రాష్ట్ర కార్యదర్శి ఆర్ అజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.అశోక్ బాబు, ఆలిండియా ఉపాధ్యక్షులు రమాదేవి, ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘం నాయకులు సిహెచ్ కళాధర్ పాల్గొన్నారు.

మోడీ ప్రతీకారం తీర్చుకుంటున్నారు : లోకేశ్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి దావోస్ పర్యటనలపై ఆంక్షలతో మోడీ ప్రతీకారం తీర్చుకుంటున్నారని, ఏపీ ప్రభుత్వాన్ని వేధిస్తున్నారని శుక్రవారం రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఎందుకు మోడీ ప్రభుత్వం ఏపీ ప్రభుత్వాన్ని వేధిస్తోందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే దేశానికి వచ్చినట్లు కాదా అంటూ లోకేశ్ ప్రశ్నించారు. చంద్రబాబు దావోస్ పర్యటన పర్యటనపై అర్థం లేని ఆంక్షలు విధిస్తూ మోడీ ప్రతీకారం తీర్చుకుంటున్నారని లోకేశ్ అన్నారు. వేధింపులకు తెలుగు వారు చేసిన తప్పేమిటని ఆయన ప్రశ్నించారు.

నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర అధ్యక్షులు శ్రీహరిరావు మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి బడ్జెట్‌లో సరిపడా కేటాయింపులు చేయడంలేదని విమర్శించారు. ఐఎమ్ఎ కార్యదర్శి ఫణీంద్ర మాట్లాడుతూ నగర అధ్యక్ష కార్యదర్శులు టి.వి. రమణమూర్తి, సి.హెచ్. మనోజ్ కుమార్ కార్యనిర్వాహక సభ్యులు రసిక్ సంఘ్వీ, రామ్‌ప్రసాద్, రవీంద్ర తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

మొదటి పేజీ తరువాయి

మతవాదాన్ని ప్రజలు గుర్తించాలి. బీజేపీ నయా ఉదారవాదం తన శత్రువుగా కార్మికవర్గం తెలుసు కోవాలి. మన ప్రచారం నయా ఉదారవాద పద్ధతులను వాటిని నడిపిస్తున్న ప్రభుత్వాలను బట్టబయలు చేయాలి. కేంద్రంలోనూ, రాష్ట్రాల లోనూ నిరంతరం సామ్రాజ్యవాదులకు, ఎంఎన్ సీలకు అనుకూలంగా పరిపాలిస్తూ దేశాన్నీ దేశాభివృద్ధిని నాశనం చేస్తున్న ప్రభుత్వాల ఆలోచన అందరికీ అర్థం అయ్యేలా మన ప్రచారం ఉండాలి. బీజేపీ దేశాన్ని ధ్వంసం చేయకముందే గద్దెదించాలి. నయాఉదారవాద పద్ధతులు, దానిని నడిపిస్తున్న ప్రభుత్వం ఏదో ఒకటికాదు. రెండింటినీ మనం బహిర్గతం చేయాలి. వారిని పూర్తిగా బట్టబయలు చేయాలి. ప్రజలు ముందుకు వచ్చి బీజేపీ మతవాదాన్ని, ఏకపక్ష విధానాన్ని కూలదోసేలా ప్రజలను చైతన్యపర్చడానికి మనం శ్రమించాలి. మన భావజాలమే మనకున్న పెద్ద ఆయుధం. ఆ భావజాలమే పునాదిగా ఏర్పడిన మన సంస్థలే మనకు దారి చూపుతాయి. ఆదారిలోనే మనం ప్రయాణించి మొత్తం శ్రామికవర్గానికి, మనకు అందనంత దూరంలో ఉన్న వారిని కూడా ఈ సమ్మె పిలుపుతో చేరి, ఈ పిలుపు వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశం కూడా వారిని చేరేలా వారు మనతో కలిసేలా చేయాలి. ఈ సమీక్ష నుంచి తగిన పాఠాలు నేర్చుకుందాం. మరింత శక్తితో, ప్రయత్నంతో, నమ్మకంతో మన ప్రయత్నాలు ప్రారంభిద్దాం. మనం తప్పకుండా ముందుకు వెళ్తాం. సాధిస్తాం.

తెలుగుకు ఓ పవర్ ఉంటుంది

కంగనా రనౌత్



కంగనా రనౌత్

"దేశం కోసం రక్తం ధారపోసిన వారి గురించి పట్టించుకోవడం లేదు. వారు మన చరిత్ర. అలాంటి వారికి గౌరవం ఇవ్వాలి. అలా చరిత్ర మరుగున పడిపోయిన ఎందరో వీరులున్నారు. ఇటువంటి కథను వెలుగులోకి తెచ్చి నేటి తరానికి తెలియజెప్పాలనే ఝాన్సీరాణి కథను సినిమాగా చేయాలని అనుకున్నాను. మేకింగ్‌లో చాలా సమస్యలను ఎదుర్కొన్నా. షూటింగ్ ప్రారంభంలోనే నా నుదుటికి గాయమైంది. తర్వాత దర్శకురాలిగా మారాల్సి వచ్చింది. నిర్మాత కమల్ ఈ విషయాన్ని చెప్పినప్పుడు కూడా నేను ఇంత పెద్ద సినిమాను హ్యాండిల్ చేయగలనా! అనే సందేహం కలిగింది. అలాంటి సమయంలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకున్నా" అని కంగనా రనౌత్ అన్నది. ఆమె టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'మణికర్ణిక'. జీ స్టూడియోస్, కమల్ జైన్ నిర్మాణంలో జాగర్లమూడి క్రిష్, కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈనెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో తెలుగు వెర్షన్ ట్రైలర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. "తెలుగులో ట్రైలర్ ఇంతకు ముందే చూశాను. సౌండింగ్ డిఫరెంట్‌గా అనిపించింది. అయితే క్యారెక్టర్స్‌కు తెలుగు వాయిస్ అందించిన ప్రతి ఒక్కరూ న్యాయం చేశారు. విజయేంద్ర ప్రసాద్ కూడా ట్రైలర్ మీద వర్క్ చేశారు. తెలుగుకు ఓ పవర్ ఉంటుంది. అందుకే నేను 'బాహుబలి'ని తెలుగు, హిందీలో కూడా చూశాను. నేను ఈ సినిమాను డైరెక్ట్ చేయడమనేది ప్లానింగ్ ప్రకారం జరగలేదు. అనుకోకుండా జరిగింది. ఆగస్టులో రావాల్సిన ఈ సినిమాను అనుకున్న సమయంలో పూర్తి చేయలేకపోయాం. ఆ సమయంలో క్రిష్‌గారు మరో సినిమాలో ఉన్నారు. కాబట్టి జనవరిలో పూర్తి చేయాలని నేను డైరెక్ట్ చేశాను. క్రిష్ గొప్పగా తెరకెక్కించారు. ఆయన్ను నేను ఫాలో అయ్యానంతే. టీం సహకారంతో సినిమాను పూర్తి చేశాను. తదుపరి కూడా నేను డైరెక్ట్ చేయాలనుకుంటున్నాను. ఆ సినిమాకు విజయేంద్ర ప్రసాద్‌ని కథను అందించమని చెప్పాను. తప్పకుండా మేం కలిసి పనిచేస్తాం" అని కంగనా చెప్పింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ 'ఒకప్పుడు మేం హిందీ సినిమాల్లోకి ఎప్పుడూ వెళ్దామా? అని ఎదురు చూస్తే.. బాలీవుడ్ వాళ్లు హాలీవుడ్‌లోకి ఎప్పుడు వెళ్దామా? అని ఎదురుచూసేవాళ్లు. ఎల్.వి.ప్రసాద్ నుండి రాంగోపాల్ వరకు మన తెలుగు ఖ్యాతిని చాటినవాళ్లు ఎందరో ఉన్నారు. ఇప్పుడు మణికర్ణికను కథ, స్క్రీన్‌ప్లే విజయేంద్ర ప్రసాద్, దర్శకుడు జాగర్లమూడి క్రిష్ అని తెలిశాక చాలా సంతోషంగా అనిపించింది' అని అన్నారు.

తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'విజయేంద్రప్రసాద్ ఎప్పటికప్పుడూ రికార్డ్స్ బ్రేక్స్ చేసే కథలను అందిస్తూ దేశమంతా కంగారు పుట్టించేలా 'బాహుబలి'ని అందించారు. ఇప్పుడు 'మణికర్ణిక'ను అందించారు. కంగనా పెద్ద ఎత్తు లేకపోయినా నటనపరంగా ఆకాశమంత ఎత్తు ఎదిగింది. సినిమా సినిమాకూ కొత్తగా కనపడుతూ వచ్చింది. క్రిష్ నెల రోజుల్లో మూడు సినిమాలను రిలీజ్ చేస్తున్నాడు. అతను వదిలిపెట్టిన బాణంలాంటి ఈ సినిమాను కంగనారనౌత్ పూర్తి చేసింది. ఎంటైర్ యూనిట్‌కు అభినందనలు" అన్నారు.

నిర్మాత కమల్ జైన్ మాట్లాడుతూ 'ప్రస్తుతం చాలా బయోపిక్స్ రూపొందుతున్నాయి. వాటి సక్సెస్ శాతం కూడా ఎక్కువగానే ఉంది. ఇప్పటి వరకు వచ్చిన బయోపిక్స్‌కు మణికర్ణికను మదర్ ఆఫ్ బయోపిక్స్ అని చెప్పొచ్చు. ఈ సినిమాను చేసే సమయంలో చాలా స్ట్రగుల్స్‌ను ఫేస్ చేశాం. వాటన్నింటినీ దాటి చేసిన సినిమా ఇది' అని తెలిపారు.

మళ్లీ అదే సీన్



పండగలు ఎన్ని ఉన్నా సంక్రాంతి అంటే సినిమా వాళ్లకు పెద్ద పండగ. వాళ్లు చేస్తున్న సినిమాల్లో ఉత్తమంగా ఉన్నవి ఈ వేడుకకు విడుదలయ్యేలా సన్నాహాలు చేసుకుంటారు. థియేటర్ల కోసం ముందు నుంచే పోటీపడుతుంటారు. సాధారణంగా ఒకటో రెండో పెద్ద చిత్రాలు, మిగిలిన చిన్న చిత్రాలు ఉంటాయి. భారీ చిత్రాలు ఒకేసారి విడుదల చేస్తే నష్టపోయేది పంపిణీదారుడు, నిర్మాత. ఇలా ప్రతి సంక్రాంతికి నష్టపోతూనే వచ్చారు. నిర్మాతలు, పంపిణీదారుల మధ్య ఐక్యతాలోపం వల్ల జరుగుతూ వచ్చింది. అందుకే 2017, 2018లో సినిమా పెద్దలు ఓ అవగాహనకు వచ్చి ఇలా విడుదల చేయడం మానేశారు. కానీ ఈ ఏడాది 2106లో సీనే పునరావృతం అయింది. అప్పట్లో సోగ్గాడే చిన్నినాయన', 'నాన్నకు ప్రేమతో', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'డిక్టేటర్' ఒకేసారి విడుదలయ్యాయి. ఇవి అన్నీ పెద్ద సినిమాలే. థియేటర్లు లేక ఇబ్బంది ఎదురయ్యాయి. పంపిణీదారులు తీవ్రంగా నష్టపోయారు. మళ్శీ ఇప్పుడు అలాంటి పరిస్థితే కనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 1600 థియేటర్లు ఉన్నాయి. 'వినయ విధేయ రామ' వెనక అల్లు అరవింద్.. 'ఎఫ్2' సినిమాను సురేష్ బాబు విడుదల చేస్తున్నారు. కానీ 'ఎన్టీఆర్' బయోపిక్, 'పేట' చిత్రాలను ఎవరు రిలీజ్ చేస్తారు? థియేటర్లను ఎవరెవరు పంచుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.

ఈ సంక్రాంతికి నాలుగు రోజులు భారీ చిత్రాలు సందడి చేయనున్నాయి. అందులో 'ఎన్టీఆర్' జీవితాన్ని వెండితెరపై తొలిసారిగా ఆవిష్కరించారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తీశారు. 'ఎన్టీఆర్ కథానాయకుడు', 'ఎన్టీఆర్ మహానాయకుడు'. ముందుగా రామారావు సినీ జీవితానికి సంబంధించిన భాగాన్ని 'కథానాయకుడు'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అది ఈనెల తొమ్మిదిన రాబోతుంది. తర్వాతది రాజకీయ ప్రస్థానంపై తీసిన 'మహానాయకుడు'. అది ఫిబ్రవరి ఏడో తేదీన రానుంది. ఇందులో ఎన్టీఆర్‌ని ఎలా చూపించబోతున్నారనే కుతూహలం ప్రేక్షకుల్లో ఉంది. ఇప్పటికే ఉన్నది ఉన్నట్లు చూపించడమనేది బయోపిక్‌లు సాధ్యం కాదని రచయిత బుర్రా సాయిమాధవ్ తేల్చిచెప్పేశాడు. జరిగిన కొన్ని సంఘటనల్లో వాస్తవమెంతో కూడా ఎవరికీ తెలీదు. కనుక సమాజానికి ఎంత మేరకు చూపించాలో అంతే సినిమాపరంగా చూపించాల్సి ఉంటుందని అందుకు 'గాంధీ, సావిత్రి' బయోపిక్‌లను ఉదహరించారు. ఈయన మాటలను బట్టి ఊహించనవి ఇందులో ఉంటాయో ఉండవో అన్న అనుమానాలు ఉన్నాయి. ఈసారి బాలకృష్ణ చేసిన చిత్రానికి కొన్ని విమర్శలు కూడా తోడయ్యాయి. బయోపిక్‌లో తనను విలన్‌గా చూపిస్తే ఊరుకునేదిలేదని నాదెండ్ల భాస్కరరావు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. దానికితోపాటు తాజాగా నాగబాబు ఫేస్‌బుక్‌లో ఓ లెటర్‌ను కూడా పెట్టడం మరింత ఆసక్తిగా మారింది. దానికీ కారణం లేకపోలేదు. ఓ సందర్భంలో బాలకృష్ణ ఇంటర్వ్యూలో నాగబాబు ఎవరు? అన్నట్లుగా మాట్లాడడంతో ఆయన అదును కోసం ఎదురుచూసి రిలీజ్ సమయంలో లెటర్ రాసినట్లు తెలుస్తోంది. 'కట్టు కథలు కొన్ని.. కల్పనలు ఇంకొన్ని చుట్టనేల మూట కట్టనేల నిజం కక్కలేని బయోపిక్కులొద్దయా!

విశ్వదాభి రామ వినరా మామా.. ' అంటూ బయోపిక్‌పై సెటైర్లు విసిరారు. ఇందులో చంద్రబాబును ఎలా చూపిస్తారో తెలియదు గానీ రామ్‌గోపాల్ వర్మ తీస్తున్న 'లక్ష్మీస్ ఎన్టీఆర్' లో మాత్రం ఆయన్ను విలన్ చేశారు. అదే అసలు రూపం అటూ ఆయన చెబుతున్నాడు.

'పేట'తో సక్సెస్ సాధించేనా!



ఒకప్పుడు రజనీకాంత్ సినిమా విడుదలవుతుందంటే తెలుగు సినిమాలన్నీ వాయిదా వేసుకునే స్థితి నెలకొనేది. ఆయన చిత్రాలు భారీ వసూళ్లతో గత రికార్డుల్ని తిరగరాసేవి. కానీ ఈ మధ్య అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. ఓపెనింగ్స్ కూడా గతంలో ఉన్నంత క్రేజ్ లేదు. 'కొచ్చాడయాన్' సినిమా మొదలు తాజాగా వచ్చిన '2.0' మూవీ వరకూ ఇదే పరిస్థితి ఏర్పడింది. చెప్పుకోవడానికి '2.0' వరల్డ్‌వైడ్‌గా రూ.700 కోట్లపైనే కలెక్షన్స్ రాబట్టింది గానీ ఒక్క బాలీవుడ్‌లో తప్ప ఇంకెక్కడా ఈ చిత్రం పెట్టిన పెట్టుబడిని రివకరీ చేయలేకపోయింది. దక్షిణాదిలో ఈ చిత్రానికి పరాజయం తప్పలేదు. 'రోబో2' సమయంలో వర్మ కూడా పిల్లల సినిమాతో పోల్చుతూ ఆ తర్వాత తన చిత్రాన్ని వాయిదా వేసుకున్నాడు. విడుదలకు ముందు ప్రమోషన్‌కు వచ్చిన రజనీకాంత్ తన 2.0కు అనవసరంగా పబ్లిసిటీకి ఖర్చు పెడుతున్నారనీ నిర్మాత ఎన్‌విఎస్‌ప్రసాద్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. కేవలం 3డి వర్షన్‌లో విడుదల చేయడం వల్ల కొద్దిగా ఆసక్తిగా అనిపించిందని ఇది పిల్లల సినిమా అని విశ్లేషకులు తేల్చేశారు. అలాంటి సమయంలో తమిళంలో తీసిన 'పెట్టా' పేరును తెలుగులో 'పేట'గా విడుదల చేస్తున్నారు. తెలుగులో థియేటర్ల కొరత తనకు ఎదురవుతుందని తెలుగు నిర్మాత వల్లభనేని అశోక్ వెల్లడించడం విశేషం. ఇప్పటికే కొంతమంది డిస్ట్రిబ్యూటర్లను, ఎగ్జిబిటర్లను సంప్రదించామనీ, త్వరలో వారి నుంచి మంచి స్పందన వస్తుందని వెల్లడించారు. మిగిలిన సినిమాలకున్న సపోర్ట్ తన చిత్రానికి లేదని తేల్చిచెప్పారు. అయినా ఉన్నంతలోనే అతి కొద్ది థియేటర్లలో విడుదలచేస్తామనీ, ఇంతముందు 'అర్జున్ రెడ్డి' చిత్రానికి అదే పరిస్థితి నెలకొందనే భరోసాతో కన్పిస్తున్నారు. ఈ చిత్రం బాషా, నరసింహా తరహాలో ఉంటుందని క్లూ ఇస్తున్నాడు.

బోయపాటి ఫార్మెట్



వినయ విధేయ రామ

ప్రేమ, కుటుంబ సంబంధాలు ఉంటూనే యాక్షన్, హింస ఎక్కువగా చూపే బోయపాటి శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వినయ విధేయ రామ'. రామ్ చరణ్, కియార అద్వాని హీరో హీరోయిన్లు. ఈ చిత్రం ఆరంభం నుంచి చాలా సాఫ్ట్‌గా పోస్టర్లు విడుదల చేస్తూ చక్కని కుటుంబ కథా చిత్రంగా ముద్ర వేశారు. కానీ విడుదల దగ్గరపడుతున్న కొద్దీ అందులో హింస ఎంత మోతాదులో ఉందో చూపిస్తూ ట్రైలర్ విడుదలైంది. దాన్ని బట్టి మరలా బోయపాటి తన ఫార్మెట్‌తోనే సినిమా తీశాడా! అనిపిస్తుంది. కుటుంబం అన్నాక సెంటిమెంట్లు మామూలే. తమ కుటుంబానికి అన్యాయం చేసిన వ్యక్తుల్ని నరికి పోగులు పెట్టేంతగా హీరోయిజం చూపినట్లుగా కన్పిస్తుంది. అందుకే విధేయ రామ కాస్త విధ్వంస రామగా కన్పిస్తాడని కొందరు అభిప్రాయ పడుతున్నారు.



ఎఫ్2

'రంగస్థలం' తర్వాత రామ్‌చరణ్ నుంచి వస్తున్న ఈ చిత్రం అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కానీ హింసపాళ్లు ఎక్కువగా ఉంటే ఈనాటి తరం ఎంతమేరకు ఆమోదిస్తారనేది కొద్దిరోజుల్లో తెలియనుంది.

నవ్వించే అల్లుళ్లుగా

ఇప్పటి వరకూ చర్చించిన మూడు చిత్రాల కంటే అసలు సిసలు పండగ వాతావరణంతో కూడిన చిత్రం తమదేనని 'ఎఫ్2' చిత్ర యూనిట్ చెబుతోంది. కుటుంబం అంతా హాయిగా చూసే అసలైన పండుగ ఈ చిత్రమట. పైగా సంక్రాంతి అంటే కొత్త అళ్లుల్ల సందడి. అలాంటి అళ్లల్లుగా తాము వస్తున్నట్లు వెంకటేష్, వరుణ్ తేజ్ చెప్పేశారు. అందరినీ నవ్వించి మెప్పిస్తామనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వెంకటేష్‌కు ఫ్యామిలీ హీరో అనే పేరుంది. అమాయకత్వంతో కూడిన ప్రేమ, హాస్యాన్ని పలు చిత్రాల్లో పండించాడు. వరుణ్‌తేజ్ 'ఫిదా'తో తనేమిటో నిరూపించుకున్నాడు. 'అంతరిక్షం' వంటి ప్రయోగాత్మక చిత్రం వచ్చినా పండుగనాడు కుటుంబకథాచిత్రంగా రావడంతో ఆసక్తిగా మారింది.

సంతోషకరమైన అమ్మాయిని చేశావ్



విరాట్, అనుష్క

బాలీవుడ్ నటి అనుష్క శర్మ, విరాట్ కోహ్లీ వివాహ బంధంతో ఒక్కటయ్యాక ఒకరిపై మరొకరికి ఉన్న ప్రేమను నిత్యం తెలుపుతూనే ఉన్నారు. తాజాగా తనను సంతోషకరమైన అమ్మాయిలా విరాట్ కోహ్లీ మార్చారని పేర్కొంది అనుష్క. ప్రస్తుతం ఆస్ట్రేలియా, ఇండియాకు మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో భాగంగా అనుష్క తన భర్తతో ఆస్ట్రేలియాలోనే ఉంది. ఈ సందర్భంగా ఆమె విరాట్‌తో ఉన్న ఓ ఫొటోను పోస్టు చేస్తూ తన ప్రేమను వ్యక్తం చేసింది. కొత్త సంవత్సరానికి అక్కడే ఉండి ఆస్ట్రేలియా ప్రధాని ఇంట్లో సంబరాలు జరుపుకున్నారు. గత ఏడాది చివరిగా ఆమె చేసిన చిత్రం 'జీరో'. బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. త్వరలో వెబ్‌సైట్ చిత్రాల్లో నటించేందుకు సన్నాహాలు చేస్తుంది.

బిగ్ బాస్-3కి హోస్ట్‌గా వెంకీ!



రియాల్టీ షోలకు బుల్లితెరపై ఆదరణ లభిస్తోంది. తెలుగులో కూడా ప్రత్యేక ముద్ర వేసుకుంది. అందుకే 'బిగ్ బాస్'ను ఎన్‌టిఆర్‌తో నిర్వాహకులు ఆరంభించారు. ఆయన సందర్భోచితంగా వ్యవహరిస్తూ షోని ఆద్యంతం రక్తి కట్టించాడు. కొంత కాలం గ్యాప్ తర్వాత బిగ్‌బాస్-2కి హోస్ట్ ఎవరనేది ఆసక్తికరంగా మారింది. ఫైనల్‌గా కథానాయకుడు నాని రంగంలోకి దించారు. ఈ షోకు అతను ఎంత ఎఫెర్ట్ పెట్టినా అందరినీ అలరించలేకపోయాడనే విమర్శ నెలకొంది. ఇప్పుడు 2019లో బిగ్ బాస్ రియాల్టీ షో మూడో సీజన్ తెరమీదకు రాబోతోంది. దీనికి హోస్ట్ ఎవరనేది రెండో భాగంలో క్లూ ఇచ్చినట్లయింది. బిగ్ బాస్-2 అవార్డుల ప్రదానోత్సవానికి వెంకటేష్ ముఖ్య అతిథిగా వచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు నిర్వాహకులు విక్టరీ వెంకటేష్‌ని సంప్రదించారని తెలుస్తోంది. మొత్తం మీద మరోసారి తెలుగు టీవీ అభిమానులను బిగ్‌బాస్-3తో అలరించేందుకు స్టార్‌మా రెడీ అవుతోంది.



ప్రధాని మోడీగా వివేక్

ప్రస్తుతం బయోపిక్‌ల తరం నడుస్తోంది. హిందీ మొదలుకొని అన్ని భాషల్లోనూ జీవిత కథా చిత్రాలు శరవేగంగా తెరకెక్కుతోన్నాయి. తాజాగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ జీవితం ఆధారంగా ఓ చిత్రం రూపొందనుంది. ఇందులో మోడీగా నటుడు వివేక్ ఒబెరాయ్ నటించబోతున్నాడు. ఈ చిత్రానికి 'పీఎం నరేంద్ర మోడీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఒమాంగ్ కుమార్ దర్శకత్వం వహించనున్నారు. ఆయన గతంలో 'సర్‌బ్‌జిత్' విజయం సాధించింది. మరో సినిమా 'మేరీ కోమ్' ఈనెలలో విడుదల కాబోతుంది. నరేంద్రమోడీ జీవితం తీయనున్న సినిమా మొదటి పోస్టర్‌ను ఈనెల ఏడోతేదీన ఆవిష్కరించనున్నారని సినిమా విశ్లేషకుడు తరుణ్ ఆదర్శ్ తెలిపారు. ఈ చిత్రం 23 భాషల్లో విడుదల కానుందని మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవిష్ తెలిపారు. కుమార్ సందీప్ నిర్మించనున్నారు.



సభ్యులకు పెన్షన్ ప్రకటించిన సందర్భంగా మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా)పాలక మండలికి అభినందనలు తెలుపుతున్న వీరమాచినేని ప్రసాద్, కవి, రమేష్ నాయుడు, ధూళిపాళ రవీంద్ర, శంకర్ తదితరులు

అందుకే నటినయ్యా



కియార అద్వాని

"తెలుగులో 'భరత్ అనే నేను' చేయడానికి ముందే బాలీవుడ్‌లో రెండు చిత్రాల్లో నటించాను. కాబట్టి బాలీవుడ్ నటీమణులు ముందు దక్షిణాదిలో పేరు తెచ్చుకున్నాక తిరిగి అక్కడికి వెళ్ళిపోతారనే విషయాన్ని నేను నమ్మను. 'బాహుబలి' విడుదలయ్యాక ఇండియా సినిమా చరిత్ర మారిపోయింది. నా ఆలోచన కూడా అప్పడే మారింది. సినిమాకు భాష అనేది ప్రాతిపదిక కాదు" అని నటి కియార అద్వానీ చెప్పింది. తాజాగా రామ్‌చరణ్ సరసన ఆమె నటించిన చిత్రం 'వినయ విధేయ రామ'. సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకులకు ముందుకు ఈ చిత్రం రానున్న సందర్భంగా శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడింది.

- 'ధోనీ' చిత్రం తర్వాత అందరూ సాక్షిధోనీ అని పిలిచేవారు. ఆ సినిమా అంతగా మార్చేసింది. హిందీ ఆడియన్స్ కూడా తెలుగు సినిమాలు డబ్ అయినప్పుడు చూస్తుంటారు. అలా 'భరత్ అనే నేను' బాలీవుడ్ ఇండస్ట్రీలో చాలా మంది చూడ్డంతో నాకు ప్లస్ అయింది. ఏదో ఒక్క భాషలోనే నటించాలనే నిబంధనేమీ పెట్టుకోలేదు. ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్, అమోజాన్, విదేశీ భాషా సినిమాలు వచ్చేశాయి. అదే గ్లోబల్ ప్రేక్షకుల్ని దగ్గర చేస్తుంది.
- 'భరత్ అనే నేను' సినిమాకి ముందు నమ్రతా నన్ను వేరే సినిమాల కోసం అడిగారు. కానీ అప్పుడు డేట్స్ కుదరక సాధ్యపడలేదు. ఎప్పుడైతే 'భరత్ అనే నేను' ఆఫర్ వచ్చిందో ఎలాగైనా చేసేయాలనుకున్నా.
- 'వినయ విధేయ రామ' చిత్రం గొప్ప అనుభూతిని కలిగించింది. నా కెరీర్‌లో ఇంత పెద్ద సినిమా ఎప్పుడూ చేయలేదు. 15 మంది టాప్ యాక్టర్స్‌తో నటించడం చెప్పలేని ఆనందాన్నిచ్చింది. సెట్స్ దగ్గరి నుండి ప్రతిదీ ఎక్కువే అనిపించింది.
- న్యాచురల్ ఎలిమెంట్స్‌ని ప్రెజెంట్ చేయడం వేరు. ఏదైతే నమ్మడానికి వీల్లేకుండా ఉంటాయో, వాటిని నమ్మేంతగా ఫీలయ్యేంతగా మెస్మరైజ్ చేస్తూ స్క్రీన్‌పై ఎలివేట్ చేయడం చాలా కష్టం. అది బోయపాటి లాంటి ఫిల్మ్ మేకర్స్‌కే సాధ్యమవుతుంది. ఆయన కథ చెప్పినప్పుడే సినిమా చూసేశాననే ఫీలింగ్ వచ్చింది. చాలా రోజుల తర్వాత ఒక ఫ్యామిలీ స్టోరీ విన్నాననిపించింది. అందుకే వెంటనే ఒప్పేసుకున్నా.
- నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. అందుకే నటినయ్యా. అటు డ్యాన్స్, కామెడీ పెర్ఫార్మెన్స్ చేయడానికి మంచి అవకాశమున్న సినిమాలో పని చేసే అవకాశం దొరికినప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. 'వినయ విధేయ రామ' చేసినందుకు కూడా అదే ఫీలింగ్.
- చరణ్‌తో నా కెమిస్ట్రీ ఆసక్తిగా ఉంటుంది. నా పాత్ర పేరు సీత. కుటుంబంలో అందరి ముందు చాలా వినయంగా ఉంటూ, రామ్ ఏది చెప్తే అదీ అన్నట్టుగా ఉంటాను. బయట మాత్రం చాలా డామినేటింగ్‌గా ఉంటాను. మా కాంబినేషన్‌లో ఉండే సీన్స్ బాగుంటాయి.
- సినిమాలో నేను ఎంత టైమ్ స్క్రీన్‌పై కనిపిస్తాను అనేకన్నా, కనిపించినంత సేపూ నేను ప్లే చేసిన క్యారెక్టర్‌కి క్వాలిటీ ఉందా లేదా! నా ప్రెజెన్స్‌ని ఆడియెన్స్ ఫీల్ అయ్యారా? లేదా? అని ఆలోచిస్తా.
- డ్యాన్స్ అంటే ఇష్టం కాబట్టి చరణ్ లాంటి డ్యాన్సర్‌తో స్టెప్స్ వేస్తూ, చాలా ఎంజాయ్ చేశా. నాకు 'రామా లవ్స్ సీత' ఇప్పటి వరకు నేను చేసిన సాంగ్స్‌లో మోస్ట్ ఫేవరేట్. 800 మంది డ్యాన్సర్స్‌తో చాలా గ్రాండ్‌గా పిక్చరైజ్ చేశారు ఆ పాటని. నా డాన్స్‌ను చూసి చరణ్ కూడా మెచ్చుకున్నారు. యాక్షన్ సినిమా అయినా ఇందులో నేనేమీ యాక్షన్ సీన్ చేయలేదు.
- 'అర్జున్ రెడ్డి' సినిమా చూశాను. విజయ్‌దేవరకొండ ఫ్యాన్ అయిపోయాను. అద్భుతమైన నటుడు ఆయనలో కన్పించాడు. ఆయన చేసిన సినిమా రీమేక్‌లో నటిస్తున్నందుకు చాలా ఆనందంలో ఉన్నాను. సినిమాలో లాస్ట్‌సీన్ నుండి షూటింగ్ మొదలు పెట్టారు. నేటివిటీకి తగ్గట్టు చిన్న చిన్న మార్పులు దర్శకుడు సందీప్ చేశాడు. అందుకే సినిమా ఢిల్లీ బ్యాక్ డ్రాప్‌లో ఉంటుంది. రామ్ చరణ్ ఇంస్టాగ్రామ్ అంటే చాలా ఇష్టం. ఆయనకీ సీక్రెట్ ఇంస్టాగ్రామ్ అకౌంట్ కూడా ఉంది. కానీ చాలా మందికి ఆ విషయం తెలీదు. నాకు సీక్రెట్ అకౌంట్స్ ఏమీలేదు.

జర్నీ



శీతల విహారం.. కాబిని పర్యాటకం

మంచుతెరల సాక్షిగా పచ్చని ప్రకృతి అందాలు ఆస్వాదించాలనుకునే వారికి కాబిని పర్యాటకం సరైన ఎంపిక. ఈ ప్రాంతాన చల్లని పిల్లగాలులు చేసే జలదరింపుతోపాటు అణువణువునా.. ప్రకృతి ఆత్మీయ పలకరింపులే కనిపిస్తాయి. ముచ్చటగొలిపే వన్యప్రాణుల ఆవాసంగా నిలిచే ఈ అభయారణ్యంలో జీప్ సఫారీని జీవితంలో మరిచిపోలేము. ఇక.. సందర్శకులకు అతి సమీపంగా, గుబురు వృక్షాల మధ్యలోంచి వస్తూ.. ఏనుగు గుంపులు చేసే సందడి అంతా ఇంతా కాదు. ఈ ఏనుగుల సందర్శన పర్యాటకులకు ఓ పెద్ద థ్రిల్. ఇలా.. అరుదైన జీవరాశుల విశేషాలతో పాటు పరవళ్లు తొక్కే సహజసిద్ధమైన నదీ ప్రవాహాల ఆత్మీయ పలకరింపే ఈ వారం కాబిని 'జర్నీ'!

కర్ణాటకలోని నాగర్‌హోల్ అటవీ ప్రాంతంలో ఉన్న పర్యాటక ప్రదేశమే కాబిని. ఇది బెంగళూరు నగరానికి 163 కిలోమీటర్ల దూరంలో ఉంది. సుమారు 55 ఎకరాల మేర విస్తరించి ఉన్న దట్టమైన అడవీ ప్రాంతమిది. చుట్టూ ఎత్తు పల్లాల నేలలు, సరస్సులు, ప్రవాహాలతో ప్రకృతిసిద్ధమైన రమణీయ ప్రదేశంగా రూపుదిద్దుకుంది. వన్యప్రాణులకు ఆవాసంగా ఈ ప్రాంతాన్ని గుర్తించారు. ఈ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని కాబిని నది ప్రవహిస్తుండటంతో దీనిని కాబిని పర్యాటక స్థలంగా పిలుస్తున్నారు. కాబిని డ్యామ్ కోసం ఇక్కడ ఓ పెద్ద సరస్సును కృత్రిమంగా ఏర్పాటు చేశారు. ఈ డ్యామ్ నాగర్‌హోల్ ప్రాంతాన్నీ, బండిపుర అటవీ ప్రాంతాన్నీ వేరు చేస్తుంది. ఇక్కడి స్వచ్ఛమైన నీటి అలలు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. ఈ నది కేరళలోని వయనాడ్ జిల్లాలో పుడుతుంది. మనన్తవది నది, పనమారం నదుల సంగమమే కాబిని. కాబిని నదినే 'కపిల' నది అని కూడా అంటారు. కాబిని నది తర్వాతి దశలో తిరుమకుదలు నరసిపుర వద్ద కావేరి నదితో కలిసి ప్రవహిస్తుంది. ఈ డ్యామ్ 2,284 అడుగుల (696 మీటర్లు) పొడవు, 190 అడుగుల (58 మీటర్లు) ఎత్తు ఉంటుంది. ఈ సీజన్ కాబిని పర్యాటకానికి ఎంతో అనువుగా ఉంటుంది.



కురువా ద్వీప్ అందాలు

కాబిని నది వద్ద ఏర్పడిన డెల్టా (నదీ ముఖద్వారం వద్ద ఏర్పడే రెండు నదీ పాయల మధ్య ప్రదేశం) ప్రాంతమే కురువా ద్వీపం. ఎప్పుడూ పచ్చని చెట్లతో ఈ ద్వీపం కళకళలాడుతుంది. వివిధ రకాల వృక్ష జంతు జాతులనూ ఇక్కడ గమనించవచ్చు. అరుదైన కొన్ని పక్షులకు ఈ కురువా ద్వీపం ఆవాస స్థలం. అసాధారణ మూలికలు, ఆర్కిడ్స్ పూలు ఈ ద్వీపంలో కనబడతాయి. అరుదైన జంతుజాలాన్ని తనివి తీరా చూడాలనుకునే పర్యాటకుల తాకిడితో ఈ ద్వీపం ఎంతో ప్రాచుర్యం పొందింది. కురువా ద్వీపంలో ఉన్న అద్భుతమైన ప్రకృతి సౌందర్యానికి ప్రపంచవ్యాప్త పర్యాటకులూ ముగ్ధులవుతుంటారు. అంతేకాదు, ఫైబర్ బోట్స్, తెప్పలను అద్దెకు అందించడం ద్వారా ఈ ద్వీపాన్ని సందర్శించే అవకాశం ఇక్కడి పర్యాటక శాఖ కల్పిస్తోంది. ఈ ద్వీపంలో ఉన్న సహజ వనరులను కాపాడేందుకు ఏడాదిలో కొన్ని సందర్భాల్లో మాత్రమే అనుమతి ఇస్తారు. ఈ ద్వీపంలోకి ప్రవేశించడానికి అటవీశాఖ అనుమతి తప్పనిసరి.

నాగర్‌హోల్ నేషనల్ పార్క్

కాబిని నదికి వెళ్ళేమార్గంలోనే ఉన్న నాగర్‌హోల్ నేషనల్ పార్క్‌ను తప్పకుండా సందర్శించాలి. నాగర్‌హోల్ అటవీ ప్రాంతం మొత్తం పెద్ద వృక్షాలతో గుబురుగా కనిపిస్తుంది. వేకువజామున ఇక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. చిన్న చిన్న మొక్కలు తిని, జీవించే జంతుజాలంతో ఈ ప్రదేశం నిండి ఉంటుంది. ఆకులు, పండ్లతో కూడిన ఆహారం ఎక్కువగా లభించడం వల్ల ఏనుగులు ఎక్కువగా తారసపడతాయి. ఇక్కడ ఆసియా ఏనుగులు అధికంగా ఉంటాయి. వాటితోపాటు లేడి, దుప్పి, జింకలు, సంభార్, అడవి పందులు, కోతులు ఇలా ఎన్నో రకాల జంతువులను ఇక్కడ చూడవచ్చు. వాటిన్నింటిలో ఏనుగుల సముదాయాలు ప్రత్యేకమనే చెప్పాలి. వీటితోపాటు పులులు, చిరుత పులులు, వేట కుక్కలు వంటివి కూడా ఈ ప్రాంతంలో సంచరించటం వల్ల పర్యాటకులను అటవీశాఖ వారు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉంటారు.

సఫారీ స్పెషల్

కాబినిలోని సుందర సన్నివేశాలు అటవీ ప్రాంత పర్యావరణ వేత్తలకు ఎంతో ఆసక్తి కలిగిస్తాయి. సరికొత్త వృక్షజాతులు, జీవజాతులను జీపు ప్రయాణంలో చూసి ఆనందించవచ్చు. పచ్చని ఈ ప్రాంతంలో పర్యాటకులు కాలినడకను ఎక్కువగా ఆస్వాదిస్తూ కనిపిస్తారు. ఇక్కడి వాతావరణం శీతాకాలంలో కాస్త అనుకూలంగా ఉంటుంది. ప్రకృతి అందాలు కాలినడకన వెళ్లే పర్యాటకుల అలసటను దూరం చేస్తాయి. జంతుజాలాన్ని వీక్షించేందుకు జంగిల్ సఫారీ ఎంతో అనువుగా ఉంటుంది. అడవిలో సఫారీపై వెళితే, అనేక జంతువులను దగ్గర నుంచి చూడొచ్చు. కాబినిలో సుమారు మూడువందల రకాల పక్షి జాతులు ఉన్నాయి. సుంకదకట్టలోని ఏనుగుల సఫారీ, జీపులు సైతం వెళ్లలేని ఎత్తయిన ప్రదేశాలను వీక్షించేందుకు అందుబాటులో ఉంటుంది. సాహస పర్యాటకులను ఈ ప్రాంతం ఎంతగానో ఆకర్షిస్తోంది. ఈ ప్రాంతంలోని సహజ అందాలు ఏనుగు సఫారీపై వీక్షించడం ఓ గొప్ప థ్రిల్‌ను కలిగిస్తాయి. వన్యప్రాణుల మధ్య గుండా ఏనుగు మెల్లగా అడుగులు వేస్తుంటే ఆ అనుభూతులు మాటల్లో చెప్పలేం. అందుకే, కాబినిలో ప్రధాన ఆకర్షణ అంటే, జంగిల్ సఫారీ, ఏనుగుల సఫారీ అంటారు. అడవుల్లో నడక, ట్రెక్కింగ్, బోట్ విహారం, సైక్లింగ్, పక్షుల గమనం, రాత్రులలో చలిమంటలు, స్థానిక గ్రామాల సందర్శనలతో ఎంతో ఆనందం పొందవచ్చు.

సేకరణ : చందు



కుమర్‌టులీలో కళాకృతులు



బసంత్ పంచమి. కోల్‌కతాలో ఈ పండగను ఎక్కువగా జరుపుకోవడం చూస్తుంటాం. ఈ పండగ సంబరాలు జనవరి మొదటి నుంచి ప్రారంభమవుతాయి. కోల్‌కతాలోని కుమర్‌టులీ ప్రాంతంలో సూదూర ప్రాంతాల నుంచి వచ్చిన విగ్రహ తయారీదారులు ఏడాదంతా పెద్ద పెద్ద విగ్రహాలను ఇక్కడ తయారు చేస్తుంటారు. ఒకవేళ మీరు కోల్‌కతా ప్రయాణానికి సిద్ధమైయుంటే గనుక, లిస్టులో కుమర్‌టులీ పేరును చేర్చుకోవడం మర్చిపోవద్దు.

పూల తోరణం.. పూల్‌మండీ

నాకెప్పుడూ కొత్త ప్రాంతాలను చూడాలని ఆసక్తిగా ఉండేది. ఇప్పటికీ కొత్త ప్రాంతాలను వెతికేందుకు గూగుల్‌తో పోటీ పడుతుంటాను. దారిపొడవునా కనబడే వారిని దారి అడుగుతూ మరీ వెళుతుంటాను. ఇప్పుడు నేను కోల్‌కతాలోని సదర్ స్ట్రీట్ గురించి చెప్పబోతున్నాను. ఈసారి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు మాత్రమే వాడాలని నిర్ణయించుకున్నాను. సదర్ స్ట్రీట్‌లో నా ప్రయాణం మొదలయ్యింది. అలా బస్టాప్ వరకూ నడుచుకుంటూ వెళ్లాను. బస్ ఎక్కి, హౌరా బ్రిడ్జ్ కింద ఉన్న పూల్ మండీ దగ్గరికి చేరుకున్నాను. కుమర్‌టులీ వెళ్లాల్సిన నేను పూల్‌మండీ దగ్గరకు ఎందుకు వెళ్లానా అని అనుకుంటున్నారా? కోల్‌కతాలో కుమర్‌టులీ ఎంత ప్రత్యేకమో పూల్‌మండీ కూడా అంతే ప్రత్యేకం. ఇక, ఈ మాసంలో అయితే చెప్పక్కర్లేదు. ఉదయాన్నే ఇక్కడి దృశ్యాలు సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. ఒకవేళ మీరు ఫొటోగ్రాఫర్ అయితే, ఒక్క క్షణం



కూడా ఆలస్యం చేయొద్దు. వెంటనే మీ కెమెరాకు పనిచెప్పండి. ఈ ప్రాంతం సరస్వతీ పూజకు అవసరమైన వాటి తయారీతో రద్దీగా ఉంటుంది. బసంతీ పంచమి పూజలో పూలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఈ ప్రాంతాన్ని చూస్తే ఆ పూజలో పూలకున్న ప్రత్యేకతేంటో ఇట్టే అర్థమవుతుంది. ఈ ప్రాంతానికి వెళ్లేందుకు బెస్ట్ షార్ట్‌కట్ హౌరాబ్రిడ్జ్.

ఆనందాన్నిచ్చే.. జాయ్‌రైడ్

నా మార్గానికి కుడివైపున హుగ్లీ బ్రిడ్జి ఉంది. దీని వంతెనను ఆనుకుని, పెద్ద పెద్ద బోట్లు ప్రయాణికులను ఒక పాయింట్ నుంచి ఇంకో పాయింట్‌కు చేరుస్తున్నాయి. కోల్‌కతా ప్రజలు వారి జీవన విధానంలో ఈ బోట్లను ఎక్కువగా వాడుతుంటారు. ఆఫీస్‌కు వెళ్లి వచ్చేందుకు ఎక్కువమంది ఈ బోట్లను ఉపయోగిస్తుంటారు. కోల్‌కతాను ఓ కొత్త యాంగిల్‌లో వీక్షించాలనుకునేవారు ఈ బోట్‌లో హుగ్లీకి ప్రయాణం చేయాల్సిందే. అందుకే నేను దగ్గర్లోని ఓ బోట్‌ను ఎక్కాను. హౌరా బ్రిడ్జి నుంచి పూల్‌మండీ వరకూ కొన్ని ఫోటోలను తీశాను. హౌరా షోబా బజార్‌లో ఫెర్రీ సర్వీసును చూస్తే నాకు భలే ఆశ్చర్యం కలిగింది. మనదేశంలో ఇంకా ఐదు రూపాయల సర్వీసు ఉందంటే నమ్మలేకపోయాను. బోట్ నుంచి దిగి, లోకల్ ట్రామ్‌ట్రైన్ ఎక్కాను. అలా రద్దీ వీధుల గుండా ట్రామ్ ముందుకు వెళుతుంటే ఓల్డ్ కోల్‌కతాను దగ్గరగా వీక్షించే అవకాశం కలిగిన అనుభూతి వచ్చింది. ట్రామ్‌లో ప్రయాణిస్తే ఎక్కువ సమయం పడుతుంది. కానీ, జాయ్‌రైడ్‌ను ఎంజాయ్ చేయాలనుకునేవారు తప్పనిసరిగా ఒకసారి ట్రామ్ ప్రయాణం చేయాల్సిందే. కోల్‌కతా వచ్చి ట్రామ్ ప్రయాణం చేయకపోతే ఆ మజానే ఉండదు. ట్రామ్ నుంచి దిగిన కొద్దిదూరంలోనే కుమర్‌టులీ ఉంది. దీనికోసం పెద్దగా వెతకాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, ముస్తాబవుతోన్న పెద్ద పెద్ద విగ్రహాలు మనకు స్వాగతం పలుకుతాయి. కుమర్‌టులీలోని ప్రతి ప్రాంతంలో శారదాదేవీ విగ్రహాలే తారసపడతాయి. మట్టినే నమ్ముకుని బతుకుతున్న ఈ కళాకారులు గంటల తరబడి తపస్సు చేస్తున్నట్లుగా నిలబడి మరీ వారి పనిని చేస్తుంటారు. ఇక్కడ కేవలం దేవతామూర్తుల విగ్రహాలు మాత్రమే కాకుండా ఇతర డెకరేషన్ ఐటమ్స్, కాగితపు పూలు, వీరుల విగ్రహాలు, ఇతర విగ్రహాలనూ తయారుచేస్తారు. ఇక్కడ ప్రతి ఒక్కరూ సరస్వతి పూజకోసం విగ్రహాలను తీసుకొని వెళతారు. ఎన్నో రోజుల తరబడి రాత్రనకా? పగలనకా? నిల్చుని విగ్రహాలను తయారుచేస్తారీ కళాకారులు. ఇలాంటి పండగల సందర్భంలోనే వీరి పనికి కాస్త విలువుంటుంది. ఇంకా ఇక్కడ ఉండాలని ఉంది కానీ, సమయం లేదు కాబట్టి వెళ్లక తప్పట్లేదు. మీరెప్పుడైనా కోల్‌కతా వస్తే ఈ విగ్రహతయారీ దారులను ఒకసారి పలకరించడం మర్చిపోవద్దు.

- కైనాథ్ కాజీ

'జర్నీ'కి ఆహ్వానం

మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.




మా చిరునామా

జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చిన్నారి



నీడ కనిపెట్టండి!



పిల్లలూ! ఈ చిత్రంలో కొన్ని కాయలు, వాటి నీడలూ ఉన్నాయి. ఏ నీడ ఎక్కడ ఉందో కనిపెట్టండి?

జోక్:


తండ్రి : మాట్లాడే ప్రతిసారీ నోట్లో చక్కెర వేసుకుంటావేంటి రా?

బిట్టు : తియ్యగా మాట్లాడాలని మా టీచర్ చెప్పారు నాన్నా..!

పొడుపు కథ

కొప్పంది కాని జుట్టు లేదు, కళ్ళున్నాయి కాని చూపులేదు

జవాబు : టెంకాయ



ఆడతా ఆడతా



ఆడుతా ఆడుతా నేను ఆడుతా
కబడ్డీ ఆట నేను ఆడుతా

రాస్తా రాస్తా నేను రాస్తా
కథలెన్నో నేను రాస్తా

చెబుతా చెబుతా నేను చెబుతా
అందరికీ పెద్దన్నై నేను చెబుతా

పరిగెత్తుతా పరిగెత్తుతా నేనే పరిగెత్తుతా
అందరి కంటే మొదటిగా పరిగెత్తుతా

చూస్తా చూస్తా నేను చూస్తా
ఆకాశంలో మెరిసే
నక్షత్రాలను చూస్తా



టి. అర్జున్
9వ తరగతి, జెడ్‌పిహెచ్ స్కూల్
చిప్పగిరి, కర్నూలు జిల్లా.

రంగులు వేయండి!

పిల్లలూ..! ఇక్కడ మీకెంతో ఇష్టమైన బొమ్మ ఉంది కదా? దానికి రంగులు వేయండి!



నేను గీసిన బొమ్మ





ఎ. తేజవిష్ణు
7వ తరగతి,
శ్రీ చైతన్య స్కూల్,
అనూ కాంప్లెక్స్,
విజయవాడ.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com

ఆసీస్‌కు పంత్ పంచ్

- భారత్ 622/7 డిక్లేర్డ్
- పుజారా డబుల్ సెంచరీ మిస్
- అర్థసెంచరీతో రాణించిన జడేజా

సిరీస్ ప్రారంభానికి ముందు కోహ్లీతో సహా భారత బ్యాట్స్‌మెన్‌ను కట్టడిచేస్తామన్న ఆసీస్ బౌలర్లు సిడ్నీ టెస్టులో పూర్తిగా చేతులెత్తేశారు. టీమిండియా నయావాల్ పుజారా 193 పరుగులు చేసి తృటిలో డబుల్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. యువ వికెట్‌కీపర్ రిషబ్ పంత్ అజేయంగా 159 పరుగులు చేసి టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన కీపర్‌గా ధోనీ రికార్డును బ్రేక్ చేశాడు. ఆల్‌రౌండర్ జడేజాకూడా రాణించడంతో భారతజట్టు ఏడు వికెట్ల నష్టానికి 622 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది.



రిషబ్ పంత్ 159 (నాటౌట్)

'నా టలో ఎలాంటి మార్పు లేదు. ఈ సారి అవతలి ఎండ్‌లో మంచి బ్యాట్స్‌మన్ ఉన్నాడు. చాలాసార్లు నేను క్రీజులోకి వచ్చినప్పుడు టెయిలెండర్లు ఉంటారు. అలాంటి సమయంలో ఆలోచన వేరేలా ఉంటుంది. బ్యాట్స్‌మన్‌తో కలిసి ఆడుతున్నప్పుడు ఆలోచనా విధానం మరోలా ఉంటుంది. స్వేచ్ఛగా ఆడేందుకు జట్టు యాజమాన్యం నాకు అవకాశమిచ్చింది. బ్యాటింగ్‌కు దిగిన ప్రతిసారీ ఆటను ఆస్వాదిస్తా. గతంలో వెస్టిండీస్‌పై రెండు సార్లు 92 వద్ద ఔటయ్యాను. ఇప్పుడది నన్ను కంగారు పెట్టింది. కానీ ఆ దశను త్వరగా దాటేశా. అంతర్జాతీయ క్రికెట్‌లో సాధించే ప్రతి శతకం ప్రత్యేకం. ఇప్పుడే నా కెరీర్ మొదలైంది. శతకాల గురించి నేను ఆలోచించను. జట్టు అవసరమేంటో ఆలోచిస్తా. క్రికెట్ నిరంతరం నేర్చుకోవాల్సిన క్రీడే. అప్పుడే గడ్డు దశలను సులభంగా దాటేస్తాం'

– రిషబ్ పంత్

సిడ్నీ : టెస్ట్ సిరీస్‌లో ఇప్పటికే 2–1తో ఆధిక్యంలో ఉన్న టీమిండియా నాల్గో టెస్ట్‌లో భారీస్కోర్ నమోదు చేయడంతో టెస్ట్ సిరీస్ విజయం ఖాయం కానుంది. భారత బ్యాట్స్‌మన్లు రెండోరోజూ సమిష్టిగా రాణించడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు నమోదు చేయగల్గింది. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ హనుమ విహారి(42)ని నాథన్ లియాన్ మొదట్లోనే పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత పుజారా(193) పరుగులు చేసి ద్విశతకానికి ఏడు పరుగుల దూరంలో లియాన్ చేతిలో కాట్ అండ్ బౌల్డ్‌గా ఔటయ్యాడు. ఆ తర్వాత రిషబ్ పంత్ ఎడాపెడా బౌండరీలు బాదుతూ 137 బంతుల్లో టెస్టు కెరీర్‌లో రెండో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో ఉన్న జడేజా సైతం పంత్‌కు సహకరిస్తూ టెస్టు కెరీర్‌లో పదో అర్ధశతకాన్ని నమోదు చేసుకున్నాడు. వీరిద్దరూ సెంచరీ, అర్ధసెంచరీలు పూర్తయిన తర్వాత దూకుడు పెంచి స్కోరుబోర్డును పరుగులు పెట్టించారు. దీంతో పాటు వీరిద్దరి జోడీ ఏడో వికెట్‌కు 204 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నిర్మించింది. ఒకానొక దశలో పంత్ ద్విశతకం, జడేజా శతకం చేసేలా కనిపించారు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ స్టేడియాన్ని కాసేపు హోరెత్తించారు. దూసుకుపోతున్న ఈ జంటను నాథన్ లియాన్ విడదీశాడు. 168వ ఓవర్లో నాథన్ వేసిన బంతికి జడేజా 81 పరుగుల వ్యక్తిగత స్కోర్‌వద్ద బౌల్డ్ అయ్యాడు. అప్పటికే టీమిండియా స్కోర్ 622 పరుగులకు చేరడంతో టీమిండియా సారథి విరాట్ కోహ్లీ తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేస్తున్నట్లు ప్రకటించాడు. రెండోరోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో వికెట్లేమీ నష్టపోకుండా 24 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లలో లియాన్‌కు నాలుగు, హేజిల్‌వుడ్‌కు రెండు, స్టార్క్ ఒక వికెట్ దక్కాయి.



రికార్డుల రిషబ్

ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాల్గో టెస్ట్‌లో సెంచరీ సాధించిన టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటివరకు ఆడిన తొమ్మిది టెస్ట్‌ల్లో పంత్‌కిది రెండో సెంచరీ. అంతేగాక ఆస్ట్రేలియా గడ్డపై శతకం సాధించిన తొలి భారత వికెట్ కీపర్‌గా రికార్డు నమోదు చేశాడు. ఇదేగాక అత్యధిక పరుగులు చేసిన వికెట్‌కీపర్‌గానూ మరో రికార్డును తనపేర లిఖించుకున్నాడు. అంతకుముందు మహేంద్ర సింగ్ ధోనీ 2006లో పాకిస్తాన్‌లోని ఫైసలాబాద్ మైదానంలో 148 పరుగుల అత్యధికస్కోర్‌ను నమోదుచేశాడు. రిషబ్ ఇప్పుడు ఆస్ట్రేలియాపై అజేయంగా 159 పరుగులు సాధించడంతో ధోనీ రికార్డును బ్రేక్ చేశాడు. అలాగే ఒక టెస్ట్ సిరీస్‌లో 200 కంటే ఎక్కువ పరుగులు, 20 క్యాచ్‌లు అందుకున్న ఉపఖండపు తొలి వికెట్ కీపర్‌గా కూడా రిషబ్ నిలిచాడు.

వన్డే సిరీస్‌కు ఆసీస్ జట్టు ప్రకటన

టీమిండియాతో జరగబోయే మూడు వన్డేల సిరీస్‌కు ఆసీస్ జట్టును ఆ దేశ క్రికెట్ బోర్డు(సిఎ) శుక్రవారం ప్రకటించింది. జట్టు : ఆరోన్ ఫించ్ (కెప్టెన్), ఖ్వాజా, షాన్ మార్ష్, హ్యాండ్స్‌కోంబ్, మ్యాక్స్‌వెల్, స్టోయినిస్, మిచెల్ మార్ష్, క్యారీ, రిచర్డ్‌సన్, స్టాన్‌వెల్, బెహ్రాన్‌డార్ఫ్, పీటర్ సిడిల్, నాథన్ లియాన్, ఆడమ్ జంపా. కాగా ఇరుజట్ల మధ్య తొలివన్డే జనవరి 12న జరగనుంది.

స్కోర్‌బోర్డు:

టీమిండియా తొలి ఇన్నింగ్స్: మయాంక్ అగర్వాల్(సి)స్టార్క్(బి), లియాన్ 77, రాహుల్(సి)షాన్ మార్ష్(బి)హేజిల్‌వుడ్ 9. పుజారా (సి అండ్ బి) లియాన్ 193, కోహ్లీ (సి)పైన్ (బి) హేజిల్‌వుడ్ 23, రహానే (సి)పైన్ (బి) స్టార్క్ 18, విహారి (సి)మార్నస్ (బి)లియాన్ 42, పంత్ (నాటౌట్) 159, జడేజా(బి) లియాన్ 81, అదనం 20, (మొత్తం 167.2 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 622 డిక్లేర్)

బౌలింగ్ : స్టార్క్ 26–0–123–1, హేజిల్‌వుడ్ 35–11–105–2, కమ్మిన్స్ 28–05–101–0, లియాన్ 57.2–8–178–4, మార్నస్ 16–0–71–0, హెడ్ 4–0–20–0, ఖ్వాజా 1–0–4–0

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : హారిస్ (బ్యాటింగ్) 19, ఖ్వాజా (బ్యాటింగ్) 5 (మొత్తం 10 ఓవర్లలో 24 పరుగులు)

బౌలింగ్ : షమి 3–0–9–0, బుమ్రా 3–0–12–0, జడేజా 2–1–1–0, కుల్దీప్ 2–1–2–0



నేడు ప్రొ కబడ్డీ ఫైనల్

ముంబయి : అక్టోబర్ 7న అట్టహాసంగా ప్రారంభమైన ప్రొ కబడ్డీ ఆరోసీజన్ పోటీలు శనివారం ముంబయిలో బెంగళూరు–గుజరాత్ జట్ల మధ్య జరిగే ఫైనల్ మ్యాచ్‌తో ముగియనున్నాయి. గత ఏడాది రన్నరప్ గుజరాత్ జట్టు తొలిసారి ఫైనల్లోకి ప్రవేశించిన బెంగళూరు బుల్స్‌తో టైటిల్‌కై అమీతుమీ తేల్చుకోనుంది. జోన్–బిలో అగ్రస్థానంలో నిలిచిన బెంగళూరు బుల్స్ జట్టు గుజరాత్‌పై 41–29తో గెలిచి ఫైనల్లోకి ప్రవేశించగా, గురువారం జరిగిన పోటీలో యుపి యోధాను 31–38 పాయింట్ల తేడాతో గుజరాత్ ఓడించి ఫైనల్లోకి ప్రవేశించింది. నేడు జరిగే ప్రొ కబడ్డీ ఫైనల్ విజేతకు రూ.3 కోట్లు, రన్నరప్‌కు రూ.1.80 కోట్ల ప్రైజ్‌మనీ దక్కనుంది. ప్లేయర్ ఆఫ్ సీజన్ ఆటగాడికి రూ. 15 లక్షలు, బెస్ట్ రైడర్‌కు 10 లక్షల రూపాయల నగదు లభించనుంది. ఫైనల్ మ్యాచ్ రాత్రి 8 గం॥లకు స్టార్–మా గోల్డ్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది.

డుప్లెసిస్ సెంచరీ

- దక్షిణాఫ్రికాకు ఆధిక్యం

కేప్‌టౌన్ : పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండోటెస్ట్‌లో దక్షిణాఫ్రికా జట్టుకు 205 పరుగుల ఆధిక్యత లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్తాన్ కేవలం 177 పరుగులకే పరిమితం కావడంతో ఓవర్‌నైట్ స్కోర్ రెండు వికెట్ల నష్టానికి 123 పరుగులతో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సఫారీ జట్టును కెప్టెన్ డుప్లెసిస్(103) సెంచరీతో ఆదుకున్నాడు. బవుమా(75) సాయంతో ఐదో వికెట్‌కు 132 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. పాకిస్తాన్ బౌలర్ షాహిన్ షాకు మూడు వికెట్లు లభించినా, చివర్లో డీకాక్(55 నాటౌట్) చెలరేగడంతో దక్షిణాఫ్రికా రెండోరోజు అట ముగిసే సమయానికి 116 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 382 పరుగులు చేసింది.

అవధే హవా



బి జంగ్ (అవధే)

అహ్మదాబాద్ : ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో భాగంగా శుక్రవారం జరిగిన పోటీల్లో అవధే వారియర్స్ జట్టు 6–(–1) తేడాతో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ జట్టును చిత్తుచేసింది. అవధే ట్రంప్ మ్యాచ్‌గా తీసుకున్న మహిళల సింగిల్స్ తొలిమ్యాచ్‌ను బివేన్ జంగ్ 10–15, 15–11, 15–11 పాయింట్ల తేడాతో గిల్మోర్ (అహ్మదాబాద్)పై గెలిచి 2–0 పాయింట్ల ఆధిక్యతను సంపాదించింది. అనంతరం పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో లీ–క్రిస్టియన్‌సేన్(అవధే) జోడీ 15–12, 10–15, 15–6 పాయింట్ల తేడాతో నందగోపాల్–రంకిరెడ్డి(అహ్మదాబాద్) జోడీని చిత్తుచేసి 3–0 ఆధిక్యం చేకూర్చారు. ఆ తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్ రెండో మ్యాచ్‌లో అక్సెల్సన్(అహ్మదాబాద్) 7–15, 15–8, 10–15 అనూహ్యంగా ఎస్.డబ్ల్యు.హో(అవధే) చేతిలో ఓడిపోవడంతో అవధే తిరుగులేని 4–0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఏకపక్షంగా సాగిన పురుషుల సింగిల్స్ రెండోమ్యాచ్‌ను ట్రంప్ మ్యాచ్‌లోనూ సమీర్(అహ్మదాబాద్) 8–15, 12–15తో కియోన్(అవధే) చేతిలో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లోను అవధే గెలిచి 6–(–1) మ్యాచ్‌ను ముగించింది.

ఫ్రూట్ బాస్కెట్‌గా ఆంధ్రప్రదేశ్

ఉద్యానశాఖపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

అత్యధిక పండ్ల ఉత్పత్తి కలిగిన రాష్ట్రం(ఫ్రూట్ బాస్కెట్)గా ఎపిని మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఉద్యానశాఖ ప్రకటించింది. మిరప,కోకో, నిమ్మ, అయిల్‌పామ్, బొప్పాయి, కొబ్బరి, టమోటా ఉత్పత్తుల్లో దేశంలోనే అగ్రస్థానంలో ఉందని పేర్కొంది. జీవిమామిడి, మామిడి, పసుపు, బత్తాయిలో రెండోస్థానంలో ఉందనీ వివరించింది. కోకో 26,600 హెక్టార్లలో కోకో సాగవుతోందని, ఇది అత్యంత లాభదాయకపంటని వివరించింది. ఉద్యానపంటల ఆదాయంలో ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ ప్రాంత జిల్లాలు ముందున్నాయని, వాటిల్లోనే డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిని ప్రవేశపెడుతున్నామనీ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యాన విశ్వవిద్యాలయంలో దేశంలోనే ఉన్నత విద్యాలయంగా నిలవడంతోపాటు ఐకార్ గుర్తింపూ పొందిందని పేర్కొంది. 2017–18 సంవత్సరంలో 26,973 కోట్ల నికర ఆదాయంతో 17.16 జివిఏ సాధించిందని తెలిపింది. విజయనగరం జిల్లా పార్వతీపురం, ప్రకాశం జిల్లా చిన్నలాతర్పిలో ప్రతి విద్యా సంవత్సరానికి 120 మంది విద్యార్థులతో కోర్సును ప్రారంభించినట్లు ఉద్యానశాఖ తెలిపింది. 2.23 లక్షల మంది ఉద్యానశాఖ రైతులకు రుణమాఫీ పథకం కింద 384.47 కోట్లను అందించినట్లు అధికారులు తెలిపారు. రాయలసీమలో ప్రాంతంలో 1.40 లక్షల హెక్టార్ల ఉద్యానతోట పంటల కింద సాగుకు తీసుకొచ్చినట్లు వెల్లడించారు. హార్టికల్చర్‌లో ఫ్యూచర్‌గ్రూపు, దేశాయిఫ్రూట్స్, లీఫ్, జైన్, ఐటిసి, బేయర్, మొండలేజ్, శ్రీనిఫుడ్స్, బిగ్‌బాస్కెట్ సంస్థలతో వేర్వేరు ప్రాంతాల్లో ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించినట్లు ఉద్యానశాఖ అధికారులు ప్రకటించారు. ఈ 10 ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.424 కోట్లుగా ఉందని ప్రకటించారు.

సిబిఐపి అవార్డు అందుకున్న మంత్రి దేవినేని

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సిబిఐపి) అవార్డు–2019ను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అందుకున్నారు. బహుళ అవసరాల తీర్చే పోలవరం నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణం, ప్రణాళిక అత్యుత్తమంగా ఉన్నాయంటూ ఇచ్చిన ఈ అవార్డును కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్‌కె సింగ్ చేతులు మీదుగా దేవినేని అందుకున్నారు. సిబిఐపి దినోత్సవం సందర్భంగా శుక్రవారం నాడిక్కడ అవార్డు ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పోలవరం ప్రాజెక్టు సిఈ శ్రీధర్, పోలవరం ప్రాజెక్టు ఈఎన్‌సి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆతిథ్య రంగ పెట్టుబడులపై 10న సదస్సు

పర్యాటక శాఖ సిఇవో శుక్లా

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆతిథ్య రంగంలో పెట్టుబడుల అవకాశాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని పర్యాటక శాఖ సిఇవో హిమాన్షు శుక్లా తెలిపారు. అతిథ్య రంగంలో ఉన్న అనుభవజ్ఞులతో పాటు, ఈ రంగంపట్ల ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు ఉపయోగపడేలా ఈ సదస్సు కార్యాచరణను రూపొందించామని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10న విజయవాడలోని హరితబెరం పార్కులో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అతిథ్య రంగంలో ఉన్న పెట్టుబడి అవకాశాలపై పూర్తి అవగాహన కలిగించేలా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. తొలిసారి ఈ తరహా కార్యక్రమాన్ని పర్యాటక శాఖ ఎంచుకుందని, హోటల్ పరిశ్రమకు చెందిన అందరూ భాగస్వాములు కావొచ్చునని పేర్కొన్నారు. సదస్సుకు హాజరు కావాలనుకున్న వారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవలసి తెలిపారు. 9198736617 నెంబర్ ద్వారా గానీ, bit.ly/biddersmeet ద్వారా నేరుగా నమోదు చేసుకోవచ్చుని వెల్లడించారు.

పెట్టుబడి వ్యయంపై సర్కారు కాకి లెక్కలు

- ఉపాధి హామీ నిధులూ ఆ ఖాతాలోకే
- స్థానిక సంస్థలవీ ఈ పద్దుల్లోనే
- అయినా డబుల్ డిజిట్‌కు అటూ ఇటే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి – అమరావతి

రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడి వ్యయాన్ని పెంచడమే కీలకం. దాని ద్వారా మాత్రమే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. పైగా జిఎస్‌డిపిలో ఆయా రంగాల వాటా కూడా పెరుగుతుంది. అందుకే అన్ని రాష్ట్రాలు పెట్టుబడి వ్యయంపైనే ఎక్కువగా దృష్టి సారిస్తాయి. అయితే నవ్యాంధ్ర ప్రదేశ్ పెట్టుబడి వ్యయం మాత్రం డబుల్ డిజిట్‌కు ఒక ఏడాది చేరితే మరుసటి ఏడాది దిగజారుతోంది. అంతేగాక పెట్టుబడి వ్యయం లెక్కల్లో కూడా కొత్త అర్థాలను చెప్పేందుకు ప్రయత్నిస్తోంది.

గత నాలుగేళ్లుగా పెట్టుబడి వ్యయం తగ్గుతూనే వస్తోంది. మొదట్లో కేవలం డబుల్ డిజిట్‌కే పరిమితమైన వ్యయం గత ఆర్థిక సంవత్సరంలో సింగిల్ డిజిట్‌కు చేరిపోయింది. రెవెన్యూ వ్యయాన్ని పెరుగుతున్న కారణంగానే పెట్టుబడి వ్యయం పెంచలేకపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. 2015–16లో రూ.1.16 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ అందులో పెట్టుబడి వ్యయం కేవలం 12 శాతంగానే ఉంది. 2016–17లో కూడా పెట్టుబడి వ్యయంగా 11 శాతం వెచ్చించారు. ఇక ముగిసిన గత ఆర్థిక సంవత్సరంలో అయితే ఈ వ్యయం గణనీయంగా తగ్గిపోయింది. రూ.1.47 లక్షల కోట్లు ఖర్చు చేయగా, అందులో పెట్టుబడి వ్యయం రూ.13,491 కోట్లు మాత్రమే. అది మొత్తం వ్యయంలో 9.1 శాతం మాత్రమే! అయితే, 2018–19 బడ్జెట్ ప్రతిపాదనలో పెట్టుబడి వ్యయం 15 శాతం చూపినా ఆచరణలో అది ఎంతకు దిగజారుతుందో వేచి చూడాలి. రాష్ట్ర ప్రభుత్వ ట్రాక్ రికార్డు అలాంటిది మరి! ఇలా పెట్టుబడి వ్యయం తగ్గిపోవడం అన్నది లెక్కల్లోనే స్పష్టంగా కనిపిస్తుండగా, ప్రభుత్వం మాత్రం వ్యతిరేక అర్థాలు వివరిస్తోంది. పెట్టుబడి వ్యయం అన్నది లెక్కల్లో చూపించినది మాత్రమే కాదని, ఇతర రంగాల ద్వారా వచ్చిన నిధులను కూడా పెట్టుబడి వ్యయంగానే చూడాల్సి వస్తుందని స్వయంగా ముఖ్యమంత్రే వ్యాఖ్యానించారు. జాతీయ ఉపాధి హామీ నిధులు, పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలు వసూలు చేస్తున్న పన్నుల నుంచి అభివృద్ధికి వెచ్చిస్తున్న నిధులను కూడా పెట్టుబడి వ్యయంగానే చూడాల్సి ఉంటుందని ఆయన భాష్యం చెప్పారు. ఆయన స్ఫూర్తితోనే కొందరు అధికారులు కూడా అదే తరహా వ్యాఖ్యలు వినిపిస్తున్నారు. సాధారణంగా బడ్జెట్‌లో కేంద్ర నిధుల రాకను కూడా కలిపే ఆదాయ వ్యయాల అంచనాను సిద్ధం చేశారు. ఈ అంచనాల నుంచే ఖర్చులను కూడా గణిస్తారు. ఈ నేపథ్యంలోనే 2017–18 ఆర్థిక సంవత్సరంలో మొత్తం బడ్జెట్ దాదాపు 1.57 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. ఇందులో కేంద్రం నుంచి వచ్చే నిధులను కూడా జత చేశారు. ఉపాధి హామీ నిధులు కూడా కేంద్రం నుంచే వస్తాయని, వీటిని కూడా రాష్ట్ర బడ్జెట్‌లో ప్రస్తావించాల్సి ఉంటుందని అప్పట్లో అధికారులు చెప్పారు కూడా. మొత్తం బడ్జెట్‌లో చివరకు 1.47 లక్షల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఈ గణాంకాల మేరకే తొమ్మిది శాతం పెట్టుబడి వ్యయాన్ని కూడా గుర్తించారు. అప్పుడు లేని కారణాలను తాజాగా శ్వేతపత్రం సమయంలో ప్రస్తావించడం, ఉపాధి హామీ నిధులను ఇతర శాఖలకు అనుసంధానం చేయడం ద్వారా అనేక ఆస్తుల కల్పన కార్యక్రమాలు చేపట్టామని, ఇది పెట్టుబడి వ్యయంగానే ఉంటుందని ఒక ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. అలాగే స్థానిక సంస్థలు వసూలు చేసే పన్నుల నుంచి రోడ్లు, డ్రెయిన్లు, ఇతర పనులు నిర్వహిస్తున్నారని, వాటిని కూడా పెట్టుబడి వ్యయంగానే భావించాల్సి ఉంటుందని ఆయన పేర్కొనడం కొసమెరుపు.

రెవెన్యూ, పెట్టుబడి వ్యయాల వివరాలు (రూ.కోట్లలో)

ఏడాది	మొత్తం ఖర్చు	రెవెన్యూ వ్యయం	పెట్టుబడి వ్యయం	పెట్టుబడి వ్యయ శాతం
2014–15	1,33,422	1,14,866	11,408	8.55
2015–16	1,16,832	95,950	14,171	12.00
2016–17	1,37,545	1,16,215	15,144	11.00
2017–18	1,47,206	1,21,214	13,491	9.10
2018–19 (అంచనా)	1,91,064	1,50,272	28,678	15.0

జగన్‌కు కిమిడి 19 ప్రశ్నలు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

పాదయాత్ర ద్వారా ఏం సాధించారో జగన్ ప్రజలకు తెలపాలని ఎపి టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు 19 ప్రశ్నలతో ఆయన వైఎస్ జగన్‌కు బహిరంగ లేఖ రాశారు. జగన్ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారో ప్రజలకు అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు . జగన్ లక్ష కోట్ల అవినీతి కేసులో చార్జిషీట్ల విచారణ మళ్లీ మొదటి నుంచి విచారించాలని చెప్పడం దేనికి సంకేతమన్నారు. ఇన్ని రోజులు విచారించింది కేవలం రెండు చార్జిషీట్లకు సంబందించిన కేసులేనన్నారు. ఇప్పుడు మళ్లీ మొదటి నుంచి విచారించి ఎన్నేళ్లు జాప్యం చేస్తారని కళా వెంకటరావు లేఖలో ప్రస్తావించారు. ఉమ్మడి హైకోర్టును కేంద్ర ప్రభుత్వం తగిన సమయం ఇవ్వకుండానే గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. దీంతో న్యాయవాదులు, న్యాయమూర్తులను కేంద్రం ఇబ్బందులకు గురిచేస్తే మీరెందుకు స్పందించడం లేదని ఆయన జగన్‌ను ప్రశ్నించారు. కోడి కత్తి డ్రామాను అడ్డంపెట్టుకుని ప్రజల్లో సానుభూతి కోసం మీరు ప్రయత్నించలేదా? పాదయాత్రను నవ్వుల పాలు చేయలేదా అంటూ లేఖలో పేర్కొన్నారు. రైతు రుణ మాఫీని జగన్ వ్యతిరేకించినా టిడిపి ప్రభుత్వం రూ.24వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిందన్నారు. 60 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరింది వాస్తవం కాదా? అంటూ జగన్‌ను ప్రశ్నించారు.

హోదా అడిగితే లాఠీఛార్జా?

(మొదటి పేజీ తరువాయి)

లేదని చెప్పారు. రాష్ట్రంలో సంత ప్తి 98 శాతం ఉందని, నూటికి నూరు శాతం మందిని సంత ప్తిగా ఉంచాలన్నదే తన లక్ష్యమన్నారు. రాష్ట్రంలో విపక్షం మొన్నటి వరకూ కోడికత్తి, ఇప్పుడు సిబిఐ కత్తి అంటూ తిరుగుతోందని విమర్శించారు. మెడపై సిబిఐ కత్తి ఉంచడంతో జగన్ మోడీకి ఊడిగం చేసేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. తమతో అభివ ద్ధిలో పోటీ పడలేక కేసీఆర్ కూడా జగన్‌తో చేతులు కలిపారని, మొన్నటి వరకూ తెలంగాణాలో పంచిన గడియారాలు ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి తరలించారని చెప్పారు.. అంతకుముందు చంద్రబాబు అభివ ద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. వివిధ వర్గాల లబ్ధిదారులతో మాట్లాడించారు.

నేనే ఓడిపోతే మోడీకి అడ్రస్ ఉండదు..

'నేను ఓడిపోతానని 'స్వయంగా ప్రధానమంత్రి అనడం విచిత్రంగా ఉంది. నేనే ఓడిపోతే మోడీకి అడ్రస్ కూడా ఉండదు' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రధాని ముందు తన సంగతి చూసుకోవాలన్నారు. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలులో భారీగా అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీలో రూ.75 వేల కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉందని నిర్ధారించిన పవన్ కల్యాణ్ కూడా వాటి కోసం పోరాడాలని కోరారు. కులాలు, మతాల పేర్లతో ఓట్లు అడిగితే అందరికీ నష్టం వస్తుందన్నారు. మన సముద్రంలో వస్తున్న గ్యాస్ ఇక్కడి అవసరాలకు వాడాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. గుజరాత్‌లో నష్టపోయిన కంపెనీల కోసం ఇక్కడ వచ్చిన లాభాలను వినియోగిస్తున్నారని విమర్శించారు. ఒఎన్‌జిసిని కూడా నష్టాల పాలుజేస్తున్నారని మండిపడ్డారు.

ఫినిష్ అయిపోతారని బిజెపి నేతలకు హెచ్చరిక

జన్మభూమి సభలో పాల్గొనేందుకు హెలీప్యాడ్ నుంచి వస్తున్న చంద్రబాబు కాన్వాయ్‌ని కాకినాడ అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద బిజెపి నేతలు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో, ఆయన తాను ప్రయాణిస్తున్న బస్సును నిలిపివేసి, బిజెపి నాయకులను ద్దేశించి 'మీరు ఈ గడ్డ మీద ఉన్నారు తెలుసుకోండి. ఫినిష్ అయిపోతారు' అంటూ హెచ్చరించారు. 'రాష్ట్రంలో ఉండడానికి బిజెపికి అర్హత లేదు. మోడీ చేసిన అన్యాయాన్ని ఇక్కడ సమర్థిస్తారా? కొంచెమైనా సిగ్గుందా? మోడీ పనికి అవమానంగా భావించాలి. సిగ్గుపడాలి' అని వ్యాఖ్యానించారు. బిజెపి కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

పలు అభివద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

ముఖ్యమంత్రి చంద్రబాబు కాకినాడ జెఎన్‌టియు క్రీడా ప్రాంగణంలో రూ.3 వేల కోట్ల అంచనాతో నిర్మించనున్న జిఎంఆర్ పోర్టు పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. రూ.400 కోట్లతో కాకినాడ స్మార్ట్ సిటీ పనులకు, రూ.292 కోట్లతో రాజానగరం–సామర్లకోట ఎడిబి రోడ్డు పనులకు, శ్రీకాకుళం నుంచి కాకినాడ ఎపిజిడిసి గ్యాస్ పైపు లైన్ పనులకు, రూ.296 కోట్లతో ఏలేరు ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.

జిల్లా ఎస్పి కార్యాలయాన్ని ప్రారంభించారు. కాకినాడలో రూ.60 వేల కోట్లతో కాకినాడ సెజ్‌లో రిఫైనరీ నిర్మాణానికి హల్దియా పెట్రో కెమికల్స్ సంస్థతో ప్రభుత్వం ఎంఒయు కుదుర్చుకుంది. సిఎం సమక్షంలో ఒప్పంద పత్రాలపై సంతకాలు జరిగాయి. రూ.13 కోట్ల 29 లక్షల విలువైన ఉపకరణాలు, యంత్ర పరికరాలు, వత్తిదారుల సామగ్రిని, వ్యవసాయశాఖ ద్వారా రూ.6 కోట్ల విలువైన ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

జిల్లా పరిషత్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని, ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్నీ, జెడ్‌పి ఫైలాన్‌ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.



ఏలేరు కుడికాలువ నిర్మాణానికి రూ.25కోట్లు

రైతుల పంటలను కాపాడేందుకు 9 గంటల ఉచిత విద్యుత్ మాత్రమే కాదని, అవసరమైతే 10 గంటలు అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ఫేజ్–2, జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఆయన జగ్గంపేటలో ప్రారంభించారు. డిగ్రీ కళాశాల సమీపంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఏలేరు కుడి కాలువ నిర్మాణానికి రూ.25కోట్లు మంజూరు చేశామన్నారు. పోలవరం కాలువ గట్టుపై పేదలకు జి+3లో 4,600 ఇళ్లు నిర్మిస్తామన్నారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా ఫేజ్–2 నుంచి ఏలేరు ఆయకట్టు పరిధిలో 67,607 ఎకరాలకు సాగునీరు అందుతుందని, 24 టిఎంసిల నీరు ఏలేరులో నిత్యం ఉంటుందని చెప్పారు. రంపచోడవరం ఐటిడిఎ ప్రాంతంలో మలేరియా, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68